

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

28.11.2026
శనివారం | విజయవాడ
సంపుటి : 01 | సంచిక: 25
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

మిగిలిన రెండు దశల్లోనూ ఇదే జోరు కొనసాగించాలి

- తొలి దశ పంచాయతీ ఎన్నికల విజయంతో
- సంతృప్తి చెందొద్దన్న మంత్రి లోకేష్
- రెండు దశల్లోనూ ఇదే జోరు కొనసాగించాలి
- ప్రతి ఎన్నికనూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

2లో..



లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపు వల్ల ఎవరికీ నష్టం జరగదు

సీఎం చంద్రబాబు వెల్లడి

లోక్‌సభ సీట్లను 50శాతం పెంచడం గొప్ప విషయం

దక్షిణ భారతంలో ప్రస్తుతం 129 లోక్‌సభ స్థానాలు

డీలిమిటేషన్ తర్వాత 195 లోక్‌సభ స్థానాలు

దక్షిణ భారతానికి ఉన్న 23.76 శాతంలో ఎలాంటి మార్పు ఉండదు

50 శాతం పెంపు వల్ల ఎలాంటి నష్టం ఉండదు

ఏపీలో ప్రస్తుతం 25 సీట్లు.. పెంపు తర్వాత 38 సీట్లు



6లో..

డిమాండ్లలో రాజీలేదు

- నియోజకవర్గాల పునర్విభజనపై..
- పార్టీ అగ్రనేత ఎంకే స్టాలిన్ తేల్చిచెప్పారు
- టీవీకే మాత్రం ఎన్డీయేకు అనుకూలంగా నిర్ణయం



2లో..

డీలిమిటేషన్, మహిళా కోటా బిల్లుకు
కేంద్ర కేబినెట్ ఆమోదం

- అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచి
- 2051 వరకు ప్రస్తుత వాటాను స్తంభింపజేసేలా
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లు



న్యూఢిల్లీ, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు రంగం సిద్ధమవుతున్న వేళ, కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. డీలిమిటేషన్ ద్వారా మహిళా రిజర్వేషన్ అమలు చేసే రాజ్యాంగ సవరణ బిల్లుకు శుక్రవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాలను సమానంగా 50 శాతం పెంచడంతో పాటు, ప్రతి రాష్ట్రం ప్రస్తుత స్థానాల వాటాను 2051 వరకు స్తంభింపజేసేలా ఈ ప్రతిపాదనను రూపొందించారు. నవంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాల అవసరాలకు అనుగుణంగా ఈ సమావేశాలు డిసెంబర్ 3న ముగిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం కేబినెట్ సమావేశం జరిగింది.

2లో..

రూ.36 వేల కోట్ల పెట్టుబడులు

వేలాది ఉద్యోగాలు భర్తీ చేస్తాం.. క్యాబినెట్ భేటీలో మంత్రులతో కీలక నిర్ణయాలు

- రాష్ట్ర అభివృద్ధికి ఊతమిచ్చే 30 అంశాల అజెండా
- ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు-2026కు గ్రీన్‌సిగ్నల్
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న
- ఆరు సంస్థల పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించింది
- ఆరు సంస్థల ద్వారా దాదాపు రూ.36 వేల కోట్ల పెట్టుబడులు
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న కేబినెట్
- రుషికొండ ప్యాలెస్‌పై కేబినెట్ కీలక నిర్ణయం
- పీపీపీ విధానంలో అప్పగింత..!



అమరావతి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ క్యాబినెట్ భేటీలో మంత్రులతో పలు కీలక అంశాలపై సీఎం చర్చించారు. దాదాపు 3గంటల పాటు ఈ భేటీ జరిగింది. ఏపీ క్యాబినెట్‌లో మంత్రులతో చర్చించి సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఊతమిచ్చే 30 అంశాల అజెండాను మంత్రిమండలి ఆమోదించింది. ఆయా పరిశ్రమల ఏర్పాటులో జాప్యం నివారించేలా ఏపీ ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు 2026కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న ఆరు సంస్థల పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించింది. ఆరు సంస్థల ద్వారా దాదాపు రూ.36 వేల కోట్ల పెట్టుబడులు.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని క్యాబినెట్ నిశ్చయించింది.

రూ.19 వేల కోట్లతో కియా రెండో ఆటోమొబైల్ ప్లాంట్..

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో రూ.19 వేల కోట్లతో కియా రెండో ఆటోమొబైల్ ప్లాంట్ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. శ్రీకాకుళంలో రూ.13,667 కోట్లతో అదానీ ఇంటిగ్రేటెడ్ టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అచ్యుతాపురంలో రూ.1,800 కోట్లతో సెయింట్ గోబైన్ ఫ్లోట్ గ్లాస్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఆమోదించింది.

6లో..

కూటమికి 74 శాతం ఓట్లు

- తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు
- అద్భుత విజయాన్ని అందించిన ప్రజలకు
- ధన్యవాదాలు తెలిపిన పల్లా

2లో..



రాజకీయాలు పక్కన పెట్టండి

- డీలిమిటేషన్‌పై జన సేనాని పవన్ కళ్యాణ్
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌ల..
- బిల్లుల ప్రతిపాదనకు పూర్తి మద్దతు
- సహకార సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనం



2లో..

అమరావతి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల ప్రతిపాదనపై జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రియాక్ట్ అయ్యారు. ఈ విషయంలో పవన్ కళ్యాణ్.. కేంద్ర విధానానికి మద్దతుగా నిలిచారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేలా డీలిమిటేషన్ జరుగుతుందని, ఇది సహకార సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి ప్రాంతానికి ప్రాతినిధ్యం లభించినప్పుడు, ప్రతి రాష్ట్రం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడు బలమైన ప్రజాస్వామ్యం నిర్మించబడుతుందని ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

పోలీస్ శాఖలో 1,534 ఉద్యోగాలకు నోటిఫికేషన్

- 378 ఎస్ఐ, 1,156 కానిస్టేబుల్ పోస్టులు
- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గ్రీన్ సిగ్నల్
- 378 ఎస్ఐ పోస్టులలో 253 సివిల్ ఎస్ఐ

2లో..

ఏపీకి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ వేణు మృతి

బంగ్లాదేశ్ సరిహద్దులో ఘటన

నదిలో మృతదేహం లభ్యం

రెండు రోజుల గాలింపు తర్వాత కుషియారా నదిలో మృతదేహం లభ్యమైంది



2లో..

సాహస పర్యాటకానికి కొత్త రెక్కలు.. దక్షిణాది అడ్వెంచర్ హబ్‌గా గండికోట

- మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్), అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ మధ్య అవగాహన ఒప్పందం

2లో..



కేబినెట్ భేటీకి వెళ్లకుండా.. అమిత్ షాను ఒప్పించా

- మోడీ అనుమతితో
- యాత్ర కొనసాగిస్తున్న
- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి
- ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది
- సినీ ప్రముఖులు తరలిరావడం ఆశ్చర్యం
- డ్రగ్స్ సమస్యను కేవలం దేశ సమస్యగా కాకుండా
- ప్రతి ఒక్కరూ తమ సొంత సమస్యగా భావిస్తున్నారు



హైదరాబాద్, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

'నషా ముక్త్ భారత్' పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. యాత్రలో భాగంగా ఆయన ప్రసంగిస్తూ, అన్ని వర్గాల ప్రజలు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, సినీ ప్రముఖులు స్వచ్ఛందంగా తరలిరావడం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. డ్రగ్స్ సమస్యను కేవలం దేశ సమస్యగా కాకుండా, ప్రతి ఒక్కరూ తమ సొంత సమస్యగా భావిస్తున్నారని, ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్ నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ స్పందన చూస్తుంటే 'నషా ముక్త్ భారత్' లక్ష్యాన్ని తప్పకుండా సాధిస్తామనే నమ్మకం కలుగుతోందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

6లో..

మిగిలిన రెండు దశల్లోనూ ఇదే జోరు కొనసాగించాలి

అమరావతి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

తొలి దశ పంచాయతీ ఎన్నికల విజయంతో సంతృప్తి చెందొద్దని.. మిగిలిన రెండు దశల్లోనూ ఇదే జోరు కొనసాగించాలని తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ అన్నారు. గెలుపుపై ధీమాతో నిర్లక్ష్యం వద్దని, ప్రతి ఎన్నికనూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. 2024 ఎన్నికల్లో మొదలైన కూటమి విజయ పరంపర పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగుతోందన్నారు.

రాబోయే రెండు, మూడు విడతల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించాలని లోకేశ్ ఆకాంక్షించారు. పోలింగ్ శాతం పెరిగే కొద్దీ మెజార్టీలు కూడా పెరుగుతాయని, ప్రతి ఓటునూ కీలకంగా భావించి పనిచేయాలని సూచించారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కష్టపడిన దానికంటే ఎక్కువగా పంచాయతీ ఎన్నికల్లో శ్రమించాలని పిలుపునిచ్చారు. జనసేన, భాజపా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

ఎన్నికలు లేని నియోజకవర్గాల నేతలు సైతం అవసరమైన చోట ప్రచార బాధ్యతలు చేపట్టాలని సూచించారు. సమస్యలుంటే పార్టీ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. బలహీనంగా ఉన్న చోట గెలుపే లక్ష్యంగా.. బలంగా ఉన్న చోట మెజార్టీ పెంచుకునేలా పనిచేయాలన్నారు. వరుస ఓటములతో వైకాపా ఫ్రస్ట్రేషన్‌లో ఉందని.. ఆ పార్టీ నేతలు హింసకు పాల్పడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. దాడులు, కుట్రల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను సమర్థంగా ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

డిమాండ్లలో రాజీలేదు

చెన్నై, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

దేశంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో డీఎంకే వైఖరిలో ఏమాత్రం మార్పు లేదని ఆ పార్టీ అగ్రనేత ఎంకే స్టాలిన్ తేల్చిచెప్పారు. మరోవైపు అధికార టీవీకే మాత్రం ఎన్డీయేకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు సీఎం విజయ్ సంకేతాలిచ్చారు. ఈ నేపథ్యంలో డీఎంకే కూడా మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టిన నియోజకవర్గ పునర్విభజన బిల్లుకు అనుకూలంగా స్వరం మారుస్తుందనే ప్రచారం జరిగింది. కానీ, తాజాగా తన కీలక రెండు డిమాండ్లకు కట్టుబడి ఉన్నట్లు ఆ పార్టీ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్‌వేదికగా పోస్టు పెట్టింది.''నియోజకవర్గ పునర్విభజనతో వచ్చే దుష్ఫలితాలపై దేశంలో తొలుత డీఎంకే గళం విప్పింది. చెన్నైలో జరిగిన తొలి భేటీలోనే వ్యతిరేకించి.. సహేతుకంగా పునర్విభజన జరగాలన్న డిమాండ్‌పై దేశవ్యాప్తంగా నేతలను ఏకతాటిపైకి తెచ్చాం. ఇప్పటికే తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన తీర్మానానికి కట్టుబడి ఉన్నాం. ఒకవేళ పార్లమెంట్ స్థానాలను పెంచాలనుకుంటే.. ఎట్టి పరిస్థితుల్లో తమిళనాడుకు ఇప్పుడున్న 7.18% ప్రాతినిధ్యం తగ్గకూడదు.ప్రస్తుతం రాష్ట్రాల మధ్య అనుసరిస్తున్న 1971 నాటి జనాభా లెక్కల ఆధారిత పార్లమెంటరీ ప్రాతినిధ్య నిష్పత్తి మరో 25 ఏళ్లు యథాతథంగా కొనసాగించాలి.ఈ రెండు అంశాల్లో డీఎంకే రాజీపడదు. మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వెన్నుపోటుదారుల ప్రచారాలు మా వైఖరిని ఏమాత్రం మార్చలేవు'' అని ఎక్స్ వేదికగా డీఎంకే పేర్కొంది. దీంతోపాటు నియోజకవర్గ పునర్విభజనపై జరిగిన అఖిలపక్ష సమావేశ చిత్రాలు, అసెంబ్లీ తీర్మానం కాపీలను షేర్‌చేసింది.

సాహస పర్యాటకానికి కొత్త రెక్కలు.. దక్షిణాది అడ్వెంచర్ హబ్‌గా గండికోట

అమరావతి: నవంబర్ 27 అనంత జనశక్తి న్యూస్



సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో సాహస పర్యాటకాన్ని ప్రోత్సహించడం, యువతలో నైపుణ్యాభివృద్ధి, స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్రతిష్టాత్మక సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (NIMAS), గండికోటలోని అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ (ASA) మధ్య శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో అవగాహన ఒప్పందం (MoU) కుదిరింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్, సెక్రటరీ ఆమ్రపాలిల సమక్షంలో నిమాస్ డైరెక్టర్ కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్, అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ కార్యదర్శి ఉన్నాది రఘునాథ్ రెడ్డి లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..ఈ ఒప్పందం ద్వారా స్థానిక యువతకు వృత్తిపరమైన శిక్షణ అందించి, వారిని అర్హత కలిగిన అడ్వెంచర్ గైడ్‌లు, ఇన్‌స్ట్రక్టర్లు, రెస్క్యూ సిబ్బంది, అవుట్‌డోర్ లీడర్లు, పర్యాటక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2027 జనవరి 6నుండి 31 వరకు గండికోటలో మొదటి 'కంబైన్డ్ బేసిక్, ఇంటర్మీడియట్ పారామోటార్ కోర్సు' నిర్వహించనున్నట్లు వివరించారు. నిమాస్ సాంకేతిక మార్గదర్శకత్వంలో జరిగే ఈ శిక్షణలో గ్రౌండ్ ట్రైనింగ్, పరికరాల వినియోగం, భద్రతా ప్రమాణాలు, ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్షన్ ఉండనున్నాయన్నారు. దక్షిణ భారతదేశంలోని ఔత్సాహిక పైలట్లు, సాహస క్రీడాకారులకు ఇది గొప్ప అవకాశంగా నిలవనుందని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఇప్పటికే గండికోటలో శిక్షణా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ప్రభుత్వ భూమి, సౌకర్యాలను అందించడం ద్వారా అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిందని తెలిపారు. నిమాస్‌తో కుదిరిన ఈ ఒప్పందం ఈ దార్శనికతకు అనుగుణంగా ఉందని, సురక్షితమైన, వృత్తిపరమైన, స్థిరమైన సాహస పర్యాటక కార్యకలాపాలకు మద్దతు ఇవ్వగల నైపుణ్యం కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడంలో ఆంధ్రప్రదేశ్‌కు సహాయపడుతుందని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఎస్.ఎస్ రావత్, ఆమ్రపాలి కాట అన్నారు.. నిమాస్ డైరెక్టర్ కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో సాహస క్రీడలకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. గండికోటలో పారామోటార్ శిక్షణతో ప్రారంభమయ్యే ఈ భాగస్వామ్యం, భవిష్యత్తులో ల్యాండ్, ఏరో, ఆక్వా విభాగాలలోని ఇతర సాహస క్రీడలకు విస్తరిస్తుందని తెలిపారు. సాహస క్రీడలు యువతలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఆయన అన్నారు.గండికోటలో భద్రతా ప్రమాణాలతో కూడిన పైలట్ శిక్షణకు తన సాంకేతిక సహకారం అందిస్తానని నిమాస్ సీనియర్ పారామోటార్ ఇన్‌స్ట్రక్టర్ దీన్ దయాళ్ యాదవ్ తెలిపారు ఈ ఒప్పందం వల్ల ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణాది రాష్ట్రాల యువతకు వృత్తిపరమైన సర్టిఫికేషన్, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ATOAI సదరన్ చాప్టర్ ఛైర్మన్ శేఖర్ బాబు బాచినేపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ASA దక్షిణ భారతదేశంలో నిమాస్ అనుబంధ ప్రాంతీయ శిక్షణా కేంద్రంగా పనిచేయనుంది. దీని ద్వారా ట్రెక్కింగ్ గైడ్, వైల్డర్‌నెస్ ఫస్ట్ ఎయిడ్, రాక్ క్లైంబింగ్, కయాకింగ్, వాటర్ రెస్క్యూ వంటి విభాగాలలో శిక్షణ ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమంలో 13 ఏళ్ల 11 నెలల వయసులోనే ఎవరెస్ట్ అధిరోహించి చరిత్ర సృష్టించిన మాలావత్ పూర్ణ,ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎవరెస్ట్ పర్వతారోహకుడు షేక్ హిమాంషా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామీణ యువత, ముఖ్యంగా బాలికలు సాహస రంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవడానికి ఈ వేదిక ఎంతో స్ఫూర్తినిస్తుందని వారు పేర్కొన్నారు.

సాహస పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ సాహస పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, రోప్‌వే, గుహలు, సౌండ్ & లైట్ షోల ద్వారా పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. ఏపీటీడీసీ రాష్ట్రంలోని 6 జిల్లాల పరిధిలో 9 ప్రాంతాలలో మొత్తం 42 బోట్లను (12 మంది కంటే తక్కువ సామర్థ్యం గలవి 13, అంతకంటే ఎక్కువ సామర్థ్యం గలవి 29) నిర్వహిస్తోంది. వీటితో పాటు శ్రీశైలం రోప్‌వే, బెలూం, బొర్రా గుహలను నిర్వహిస్తోంది. ప్రయాణికుల భద్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా 9 కంట్రోల్ రూమ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ సాగుతోంది. ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ 44 ప్రాంతాలలో ఒప్పందాలు కుదుర్చుకోగా, ఇప్పటికే 9 ప్రాంతాల్లో కార్యకలాపాలు మొదలయ్యాయి (మిగిలిన 35 అనుమతుల దశలో ఉన్నాయి). భవానీ ద్వీపంలో హౌస్ బూట్లు; రుషికొండ, తిమ్మాపురంలో పారామోటరింగ్, పారాసెయిలింగ్, స్కూబా డైవింగ్; తాటిపూడి, శ్రీసిటీ, చించినాడ, గండికోట, గోస్తనీ నది, అంతర్వేది, కాకినాడ బీచ్ ఆర్కేడ్ తదితర ప్రాంతాల్లో స్పీడ్ బోటింగ్, జెట్ స్కీ అందుబాటులోకి వచ్చాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వాటర్‌ఫ్లీట్, సౌండ్ & లైట్ యూనిట్ల ద్వారా ఏపీటీడీసీ రూ. 15.70 కోట్ల నిర్వహణ మిగులును సాధించడంతో పాటు ఏడాదిలో 27 లక్షల మందికి పైగా పర్యాటకులు సందర్శించడం విశేషం..ఈ నేపథ్యంలో పర్యాటక సౌకర్యాల పెంపునకు రూ. 1.40 కోట్లతో 50 మంది సామర్థ్యం గల 2 ఎఫ్ఆర్‌పీ బోట్లు, ఆరుగురు ప్రయాణించే 4 స్పీడ్ బోట్ల కొనుగోలుకు 209వ బోర్డు సమావేశం ఆమోదం తెలిపింది. అలాగే, సిబ్బందికి వృత్తిపరమైన శిక్షణ కోసం విశాఖపట్నం మంగమారిపేటలో 'వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్' ఏర్పాటు చేయనుంది. ప్రయాణికులు, పర్యాటకుల భద్రత, మౌలిక సదుపాయాల కల్పన, ప్రైవేట్ పెట్టుబడులు, యువతకు ఉపాధి లక్ష్యంగా ఏపీని అగ్రగామి సాహస పర్యాటక గమ్యస్థానంగా నిలబెడతామని మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

డీలిమిటేషన్, మహిళా కోటా బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

నవంబర్ 30న లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెడతామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. చర్చలో ప్రతిపక్షాలు భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఏప్రిల్‌లో వీగిపోయిన బిల్లు.. విమర్శలకు తెర?

గత ఏప్రిల్ 17న మూడు రోజుల ప్రత్యేక సమావేశాల సందర్భంగా లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. లోక్‌సభ గరిష్ఠ స్థానాల సంఖ్యను 550 నుంచి 850కి పెంచాలని ఆ బిల్లు ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి గరిష్ఠంగా 815 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35 మంది సభ్యులు ఉండేలా, 2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా రూపొందించారు. ప్రస్తుతం లోక్‌సభలో 543 స్థానాలు ఉన్నాయి. ఆ ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. హాజరై ఓటు వేసిన సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ (అప్పట్లో 352) అవసరం కాగా, ఆ బలం దక్కలేదు. 2014లో ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం అదే తొలిసారి.

అప్పట్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చివరి నిమిషంలో ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచుతామని బిల్లులో చేరుస్తామని హామీ ఇచ్చినా, విపక్షాలన్నీ ఏకమై బిల్లును అడ్డుకున్నాయి. ఆ తర్వాత సాధారణ మెజారిటీ సరిపోయే మరో రెండు అనుబంధ బిల్లులను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. సమానంగా సీట్లు పెంచుతామన్న హామీ సభలో ప్రసంగాలకే పరిమితమైందని, బిల్లుల పాఠంలో రాయలేదని విపక్షాలు, దక్షిణాది రాష్ట్రాలు అప్పట్లో విమర్శించాయి. ఇప్పుడు ఆ విమర్శలకు సమాధానంగా బిల్లులో స్పష్టత తెచ్చేందుకు ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది.

జనాభా లెక్కలు, దక్షిణాది వాదన నేపథ్యం

సుప్రీంకోర్టు సిట్టింగ్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, తాజాగా ప్రచురించిన జనాభా లెక్కల (వాస్తవంగా 2011 జనాభా లెక్కల) ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయాలని గతంలో ప్రతిపాదించారు. కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు ద్వారా ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్మూకశ్మీర్‌లకు కూడా ఈ మార్పులను వర్తింపజేయాలని భావించారు. అదనపు సీట్లను ఎలా పంచుతారనే అంశంపైనే ప్రధాన వివాదం తలెత్తింది. 2011 జనాభా ఆధారంగా సీట్లు కేటాయిస్తే ఉత్తరాది రాష్ట్రాల వాటా పెరిగి, దేశ జీడీపీలో సుమారు 3031 శాతం వరకు సహకరిస్తున్న దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గుతుందని విమర్శకులు వాదించారు. కేవలం జనాభా ఒక్కటే ప్రాతినిధ్యాన్ని నిర్ణయించకూడదని దక్షిణాది రాష్ట్రాలు పలుమార్లు స్పష్టం చేశాయి.

ప్రతి రాష్ట్రంలోనూ సీట్లు 50 శాతం పెరిగితే లోక్‌సభ సంఖ్య సుమారు 815కి చేరుతుందని, ప్రస్తుత వాటా అలాగే ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. కానీ అప్పటి బిల్లుల పాఠంలో నిర్దిష్ట నిష్పత్తిని, 2051 వరకు వాటా స్తంభన వంటి అంశాలను పొందుపరచలేదు. మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తామని కానీ డీలిమిటేషన్‌కు కాదని విపక్షాలు తేల్చిచెప్పాయి. విపక్షాల వైఖరి వల్ల మహిళా సాధికారతకు దెబ్బ తగిలిందని అధికార పక్షం ఆరోపించింది.

తటస్థ పార్టీలపైనే కీలక ఆశలు

ఎన్డీఏకు సొంతంగా మూడింట రెండొంతుల మెజారిటీ లేనందున, తాజా ప్రయత్నం కూడా తటస్థ పార్టీలు, నిర్ణయం తీసుకోని సభ్యుల మద్దతుపైనే ఆధారపడి ఉంది. సభలో ప్రతీ ఓటు, ప్రతీ గైర్హాజరు బిల్లు భవితవ్యాన్ని నిర్ణయించడంలో కీలకం కానున్నాయి.

కూటమికి 74 శాతం ఓట్లు



అమరావతి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలో జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమికి 74 శాతం ఓట్లతో అద్భుత విజయాన్ని అందించిన ప్రజలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీకి కేవలం 26 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని.. గ్రామీణ ఓటర్లలో ఆ పార్టీకి ఆదరణ పూర్తిగా తగ్గిపోయిందన్నారు. బ్యాలెట్, పోస్టల్, ఈవీఎం.. ఏ పద్ధతిలో ఓటేసినా ప్రజల మద్దతు కూటమి వైపే ఉందని మరోసారి రుజువైందని చెప్పుకొచ్చారు.

2021లో వైసీపీ దౌర్జన్యాలు, ఏకగ్రీవాలతో ఎన్నికలు జరిపితే, తాము పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామని శ్రీనివాసరావు వెల్లడించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ నాయకత్వంతో పాటు సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. కుప్పం మండలం వానగుట్టపల్లిలో వైసీపీ నేతల దాడిలో చనిపోయింది టీడీపీ కార్యకర్త రాజేంద్ర అని తెలిపారు. టీడీపీ కార్యకర్త చనిపోతే, వైసీపీ కార్యకర్తపై దాడి జరిగిందంటూ సాక్షి పత్రికలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

కార్యకర్తపై రాజేంద్ర కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని పల్లా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. రాజకీయ లబ్ధి కోసం ఫేక్ ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని వైసీపీ చూస్తోందని ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరించి సాక్షి వార్తలు రాయడం పత్రికా విలువలకు విరుద్ధమన్నారు. రాబోయే రెండు విడతల పంచాయతీ ఎన్నికల్లోనూ వైసీపీ మరింత దిగువ స్థాయికి పడిపోవడం ఖాయమని పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు.

ఏపీకి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ వేణు మృతి

అమరావతి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కదిమి వేణు (31) నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. అస్సాంలోని భారత్‌బంగ్లాదేశ్ సరిహద్దు వెంట అనుమానిత పశువుల స్మగ్లర్లను వెంబడించే క్రమంలో ఈ విషాదం జరిగింది. వేణు స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలంలోని కొత్తపల్లె గ్రామం. అస్సాంలోని కచార్ జిల్లాలో ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. అంతర్జాతీయ సరిహద్దు వద్ద బీఎస్ఎఫ్ సిబ్బంది అనుమానిత పశువుల అక్రమ రవాణా ముఠాను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. బరాక్ నదిలోకి దిగి గాలింపు.. జవాను గల్లంతు

అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే అనుమానితులను పట్టుకునేందుకు బీఎస్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. వారిని వెంబడించే సమయంలో వేణుతో పాటు హెడ్ కానిస్టేబుల్ జితేంద్ర యాదవ్ బరాక్ నదిలోకి దిగారు. ప్రవాహంలో జితేంద్ర యాదవ్ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. అయితే వేణు మాత్రం నదిలో గల్లంతయ్యారు.

వేణు కనిపించకుండా పోయిన వెంటనే బీఎస్ఎఫ్ అధికారులు ఆయన కుటుంబానికి సమాచారం అందించారు. అనంతరం నదిలో గాలింపు చర్యలు ప్రారంభించారు. దాదాపు రెండు రోజుల పాటు బీఎస్ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలించాయి. బుధవారం ఉదయం వేణు మృతదేహం బయటపడింది. వేణు గల్లంతైన ప్రాంతానికి సుమారు 25 కిలోమీటర్ల దిగువన మృతదేహాన్ని గుర్తించారు. అస్సాంలోని శ్రీభూమి జిల్లాలో కుషియారా నదిలో మృతదేహం లభించిందని బీఎస్ఎఫ్ అధికారులు ధ్రువీకరించారు. మృతదేహం దొరకడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. కొత్తపల్లె గ్రామానికి చెందిన యువ జవాను సరిహద్దులో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

సీఎం చంద్రబాబు సంతాపం

యువ జవాను అకాల మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కదిమి వేణు అస్సాంలోని భారత్‌బంగ్లాదేశ్ సరిహద్దులో విధుల్లో ఉన్నప్పుడు నదిలో మునిగి ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదం. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను," అని చంద్రబాబు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. చిన్న వయసులోనే వేణు మృతి చెందడం ఎంతో బాధాకరమని, విషాదంలో ఉన్న ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామన్న భావనతో సంతాపం తెలిపారు.

రాజకీయాలు పక్కన పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ముఖ్యమైన జాతీయ సంస్కరణకు జనసేన పార్టీ సపోర్ట్ ఇస్తుందని స్పష్టంగా తెలియజేశారు.

బలమైన ముందడుగు...

డీలిమిటేషన్ సంస్కరణ... ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని విస్తరించడానికి, బలోపేతం చేయడానికి ఒక ముఖ్యమైన ముందడుగని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. 2051 వరకు అన్ని రాష్ట్రాల ప్రస్తుత దామాషా ప్రాతినిధ్యాన్ని కొనసాగిస్తూనే.. లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచాలనే ప్రతిపాదన వల్ల మరిన్ని అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఇది సహకార సమాఖ్యవాద స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, ప్రతి రాష్ట్రం పురోగతికి ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు.

మహిళల 33 శాతం రిజర్వేషన్‌పై...

మహిళలకు ప్రతిపాదిత 33 శాతం రిజర్వేషన్ బిల్లుపై కూడా పవన్ సానుకూలంగా స్పందించారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య సంస్కరణను మరింత బలోపేతం చేస్తుందని, చట్టసభల్లో, విధాన నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యానికి మరిన్ని అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. అలాగే దేశ ప్రజాస్వామ్య విస్తృత ప్రయోజనాల దృష్ట్యా, అన్ని రాజకీయ పార్టీలు, ఎన్నికైన ప్రతినిధులు.. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి ఏకమై... ఈ బిల్లుకు మద్దతును ఇవ్వాలని పవన్ కళ్యాణ్ కోరారు.

మిగతా పార్టీల వైఖరిపై ఉత్కంఠ...

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో డిలీమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ప్రవేశ పెట్టనుంది. దీనికోసం ఇప్పటికే కొన్ని రాజకీయ పార్టీలు మద్దతును ఇచ్చాయి. అందులో ఏపీ నుంచి టీడీపీ, జనసేనతో పాటు, వైసీపీ కూడా మద్దతు ఇచ్చినట్టు తెలుస్తుంది. దీనిపై టీడీపీ, జనసేనలు స్పష్టతనిచ్చాయి. అయితే ఈ విషయంలో కాంగ్రెస్, డీఎంకే పార్టీలు, ఇతర ప్రతిపక్షాలు ఎలాంటి వైఖరిని తీసుకుంటాయనేది ఉత్కంఠగా మారింది.



పోలీస్ శాఖలో 1,534 ఉద్యోగాలకు నోటిఫికేషన్

అమరావతి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్ర పోలీసు శాఖలో 1,534 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 378 ఎస్ఐ, 1,156 కానిస్టేబుల్ స్థాయి పోస్టుల భర్తీకి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 378 ఎస్ఐ పోస్టులలో 253 సివిల్ ఎస్ఐ, 116 ఏఆర్ రిజర్వ్ ఎస్ఐ, 9 ఎస్‌పీఎఫ్ ఎస్ఐ పోస్టులు ఉన్నాయి. 1,156 కానిస్టేబుల్ విభాగంలో 542 సివిల్, 285 ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటితో పాటు ఫైర్‌మెన్ 158, పురుష వార్డర్లు 150, మహిళా వార్డర్ల విభాగంలో 21 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది.

నవంబర్ 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానుండగా.. డిసెంబర్ 16 సాయంత్రం 5 గంటల వరకు చివరి గడువుగా విధించారు. 2027 జనవరి 31న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షను నిర్వహించనున్నారు. 2027 ఫిబ్రవరి 28న ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది. ఈ పరీక్షలో ఉదయం పేపర్ 1, మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహించనున్నారు. అలాగే ఎస్ఐ (PTO, కమ్యూనికేషన్), సైంటిఫిక్ అసిస్టెంట్లు, డ్రైవర్, మెకానిక్ పోస్టుల భర్తీకి సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలోనే వెల్లడిస్తామన్న బోర్డు తెలిపింది. ఈ ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి వివరాలు, సిలబస్, అర్హతల కోసం అధికారిక వెబ్‌సైట్ slprb.ap.gov.in చూడాలని అభ్యర్థులకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సూచించింది.



గుజరాత్‌లో అనుమానిత

జైషే ఉగ్రవాది అరెస్టు

- ఏకే 47 సీజ్ చేసిన పోలీసులు

- వడోదరలోని ఓ బస్టాండ్‌లో అదుపులోకి

గుజరాత్‌లోని వడోదరలో ఒక వ్యక్తిని గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేసింది. జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థతో అతనికి సంబంధాలు ఉన్నట్లు ఏటీఎస్ అధికారులు అనుమానిస్తున్నారు. వడోదరలోని ఓ బస్టాండ్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఒక ఏకే 47 రైఫిల్‌తో పాటు 23 రౌండ్ల మందుగుండు సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. అతనికి ఆ రైఫిల్ ఎక్కడి నుంచి వచ్చింది,

భారీ లేఆఫ్స్‌కు సిద్ధమైన మరో టెక్ దిగ్గజం.. SAPలో 10 వేల ఉద్యోగాలకు కోత?

ప్రపంచ టెక్నాలజీ రంగంలో మరో దిగ్గజ కంపెనీ ఉద్యోగుల కోతకు సిద్ధమైంది. జర్మనీకి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ SAP సుమారు 10 వేల ఉద్యోగాలను తగ్గించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెట్టుబడులు పెంచుతూ, వ్యాపార కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించడంలో భాగంగా ఈ లేఆఫ్స్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఈ ఉద్యోగాల తొలగింపు అనేది ఒకేసారి కాకుండా వివిధ మార్గాల్లో చేపట్టనున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అంటే నేరుగా ఉద్యోగాలను తొలగించడం కంటే కూడా సహజంగా ఖాళీ అయ్యే స్థానాలను భర్తీ చేయకపోవడం , స్వచ్ఛందంగా ఉద్యోగాల నుంచి వైదొలిగే అవకాశాలు కల్పించడం వంటి విధానాల ద్వారా ఈ ప్రక్రియ చేపట్టే అవకాశం ఎక్కువగా ఉంది. అయితే, ఏ విభాగాల్లో ఉద్యోగాల కోత ఉండనుంది?



ఏయే బృందాలు ప్రభావితమవుతాయి? అనే వివరాలను SAP ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.

ప్రపంచవ్యాప్తంగా లక్ష మందికి పైగా ఉద్యోగులు కలిగిన SAP, వ్యాపార సంస్థలకు అవసరమైన ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్‌ను అందించే అతిపెద్ద సంస్థల్లో ఒకటి. ఆర్థిక నిర్వహణ, సరఫరా వ్యవస్థలు, మానవ వనరులు, ఇతర కీలక వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ సేవలను ఈ సంస్థ అందిస్తోంది. ప్రస్తుతం టెక్నాలజీ సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలు, ఆటోమేషన్, క్లౌడ్ కంప్యూటింగ్‌పై భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో SAP కూడా తన సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల్లో AI ఫీచర్లను విస్తృతంగా అందుబాటులోకి తీసుకొస్తోంది. క్లౌడ్ సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, AI ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, కొన్ని విభాగాల్లో ఖర్చులను తగ్గించడం, భవిష్యత్తులో వృద్ధికి అవకాశం ఉన్న AI సంబంధిత రంగాలకు వనరులను మళ్లించడం వంటి లక్ష్యాలతో ఉద్యోగాల కోత చేపట్టనున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

పార్కులో ఒంటరిగా కూర్చున్న మహిళకు రూ.2,500 జరిమానా.. కారణం తెలిస్తే షాకవ్వాల్సిందే..!

పార్కులో ఒంటరిగా కూర్చుకున్న మహిళ కు అధికారులు రూ.2,500 జరిమానా ధించారు. దాంతో షాకవ్వడం ఆ మహిళ వంతయ్యింది. అధికారుల నిర్ణయం ఆమెకు ఆగ్రహం కూడా తెప్పించింది. ఈ ఘటనపై నెటిజన్‌లు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. జర్మనీ లోని గెల్సెన్‌కిర్చెన్ నగరంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

జర్మనీలోని గెల్సెన్‌కిర్చెన్‌కు చెందిన 31 ఏళ్ల మహిళ హానా తనకు మనసు బాధగా అనిపించడంతో అక్టోబర్ 25న స్థానికంగా ఉండే పార్కుకు వెళ్లింది. ఆ పార్కులో పిల్లలు ఆడుకునే గ్రౌండ్‌లోని బెంచీపై కూర్చుని ఏడ్చింది. ఆ తర్వాత తన అత్తకు ఫోన్ చేసి తన గోడు వెళ్లబోసుకుంది. చదువులు, ఫైనాన్షియల్ సమస్యలతో తాను సతమతమవుతున్నానని, తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నానని తన అత్తకు చెప్పుకుని భానహోద్వేగానికి లోనయ్యింది.

ఏడుస్తూ సదరు మహిళ అత్తతో తన గోడును వెళ్లబోసుకుంటుండగానే ముగ్గురు మున్సిపల్ అధికారులు



ఆమె దగ్గరకు వచ్చారు. అప్పటికే ఏడుస్తున్న ఆమెతో అధికారులు అక్కడ ఉయ్యాల మీద ఆడుకుంటున్న ఇద్దరు మీ కొడుకులేనా..? అని ప్రశ్నించారు. ఆమె కాదని చెప్పడంతో.. మరి పిల్లల ఆట స్థలంలో ఎందుకు కూర్చున్నారని గట్టిగా అడిగారు. ఇక్కడ కూర్చోకూడదనే విషయం తనకు తెలయదని ఆమె చెప్పడంతో హెచ్చరిక బోర్డును చూపించారు. ఆ బోర్డును తాను గమనించలేదని చెప్పగా రూ.2,500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించిన సదరు మహిళ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధలో ఉన్న తపై సానుభూతి చూపించాల్సింది పోయి జరిమానా విధించడం ఏమిటని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వార్తపై నెటిజన్‌లు కూడా అసహనం వ్యక్తంచేశారు. బాధలో ఉన్న మహిళపట్ల అధికారులు మానవత్వం ప్రదర్శించాల్సిందని అభిప్రాయపడ్డారు.

కానీ అధికారులు మాత్రం తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. పిల్లల రక్షణ కోసం, పిల్లల అపహరణలను అరికట్టడం కోసం తాము ఇలాంటి నిబంధనలు తీసుకొచ్చామని తెలిపారు. పిల్లలతోపాటు వచ్చే పేరేంట్స్, సంరక్షులకు మాత్రమే ఆ గ్రౌండ్లోని బెంచీలపై కూర్చునే అనుమతి ఉన్నదని, ఒంటరిగా వచ్చే పెద్దలు అక్కడ కూర్చునేందుకు అనుమతి లేదని చెబుతున్నారు. కానీ ఓ మహిళ మాత్రం తాను చాలాసార్లు అక్కడ కూర్చున్నానని, తనకు ఎవరూ జరిమానా విధించలేదని తెలిపారు.

ఇదిలావుంటే అధికారులు పిల్లల ఆటస్థలంలోకి ఒంటరిగా వచ్చి కూర్చునే పెద్దవాళ్లకు జరిమానాను మరింత పెంచే యోచనలో ఉన్నట్లు గెల్సెన్‌కిర్చెన్ మున్సిపల్ కౌన్సిల్ అధికారులు వెల్లడించారు.

భారత సరిహద్దులో పరిస్థితి స్థిరంగా ఉంది: చైనా

బీజింగ్: భారత్ చైనా సరిహద్దులో పరిస్థితి సాధారణంగా, స్థిరంగా ఉందని చైనా సైన్యం గురువారం వెల్లడించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సుబన్సిరి ప్రాంతంలో చైనా సైనికుల కదలిక నేపథ్యంలో ఇరు దేశాల ఉన్నత స్థాయి సైనికాధికారులు నెల రోజులపాటు చర్చలు జరిపినట్లు సమాచారం. ఇరు దేశాలు దౌత్య, సైనిక మార్గాల ద్వారా నిరంతర సంప్రదింపులు జరుపుతున్నాయని చైనా రక్షణ శాఖ ప్రతినిధి సీనియర్ కల్నల్ చెన్ షీ తెలిపారు. సరిహద్దుల్లో ప్రశాంతతను కాపాడేందుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. అయితే అరుణాచల్‌ప్రదేశ్‌ను భారత్‌లో భాగంగా గుర్తించబోమని చైనా మరోసారి తన వైఖరిని వెల్లడించింది. మరోవైపు భారత్ జపాన్ రక్షణ సహకారంపై కూడా చైనా అసంతృప్తి వ్యక్తం చేసింది.

అమెరికా సుంకాలను ఖండించిన చైనా

హాంకాంగ్: చైనా, జపాన్‌లతో సహా అమెరికాతో వాణిజ్య భాగస్వామ్యం కలిగివున్న అనేక దేశాలు ట్రంప్ యంత్రాంగం తాజాగా విధించదలచిన సుంకాలకు వ్యతిరేకంగా నిరసన ప్రకటించాయి. బుధవారం ప్రకటించిన ఈ సుంకాలు వచ్చే సంవత్సరం ప్రారంభం నుంచి అమలులోకి రానున్నాయి. గత సంవత్సరం ట్రంప్ యంత్రాంగం భారీగా సుంకాలు విధించినా అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాల కారణంగా వాటిని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. భారత్‌తో పాటు 14 దేశాలు అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు ఆయా దేశాల్లో అధికోత్పత్తికి, చవకైన ఉత్పాదనకు దారితీసి తమ ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నాయని ఆ విషయంపై



విచారణ జరిపిన అమెరికా వాణిజ్య ప్రతినిధి జామియెసన్ గ్రీర్ పేర్కొన్న నేపథ్యంలో మళ్లీ సుంకాలు విధించాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించింది. అమెరికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన చైనాపై దీనికింద 20 శాతం సుంకాలు విధించాలని ప్రతిపాదించారు. అధిక ఉత్పాదక సామర్థ్యం కలిగివున్నామన్న కారణంగా తమపై సుంకాలు విధించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ''రాజకీయ వ్యూహంలో భాగంగా చైనాపై నింద మోపే ఎత్తుగడను వ్యతిరేకిస్తున్నాం'' అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ తెలిపారు. సుంకాల యుద్ధాలు, వాణిజ్య యుద్ధాలు ఎవరికీ ప్రయోజనం కలిగించవని ఆయన అన్నారు. తమపై 15 శాతం సుంకాలు విధించాలన్న అమెరికా నిర్ణయాన్ని జపాన్ ఖండించింది. సింగపూర్, మలేషియా తదితర దేశాలు కూడా అమెరికా విధానాన్ని తూర్పారబట్టాయి.

డెమోక్రట్ల మండిపాటు

వాణిజ్య యుద్ధాలతో అట్టుడుకుతున్న వేళ మిత్రదేశాలపై ట్రంప్ యంత్రాంగం సుంకాలు విధించడంపై డెమోక్రటిక్ పార్టీ నేతలు మండిపడ్డారు. డెమోక్రటిక్ పార్టీకి చెందిన సెనెటర్ చక్ షూమర్ తాజా సుంకాలపై స్పందిస్తూ ''డొనాల్డ్ ట్రంప్ ఎప్పటికీ తన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకోరు. అమెరికన్ కుటుంబాలపై భారం మోపుతూ.. కార్మికులకు ఉపయోగపడని నిర్ణయాలు తీసుకొంటున్నారు. అసలు షరతులు నిర్ణయించే అధికారం చైనాకే ఇస్తున్నారు. జనవరిలో ఈ పరిస్థితి మారుతుంది'' అని పేర్కొన్నారు.

అమెరికాపై 'బాంబ్ సైక్లోన్' ఎఫెక్ట్: న్యూజెర్సీ, న్యూయార్క్‌లో వరదలు

'థ్యాంక్స్‌గివింగ్ డే' వేళ అమెరికా (USA)లో 'బాంబ్ సైక్లోన్' (అతి వేగంగా ఏర్పడే తుపాను) ప్రభావంతో న్యూయార్క్, న్యూజెర్సీ సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని చోట్ల గంటకు 100 కిలోమీటర్లకు మించిన వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. న్యూయార్క్, న్యూజెర్సీ నగరాల్లోకి వరద రావడంతో.. వీధులు నదులను తలపించాయి. 'థాంక్స్‌గివింగ్ డే' నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో సుమారు 9 లక్షల మంది ఇబ్బందులు పడ్డట్లు పవర్ ట్రాకింగ్ వెబ్‌సైట్ తెలిపింది. 420 విమానాలు రద్దు అయినట్లు.. సుమారు 2000 ఫ్లైట్స్ ఆలస్యంగా నడుస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. న్యూజెర్సీ హోబుకెన్ ట్రాన్సిట్ రైలు పట్టాలు వరద నీటిలో మునిగాయి. స్టోన్ హార్బర్‌లోకి నీరు చేరింది. న్యూయార్క్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా ఈ తుపాను ప్రభావం అట్లాంటిక్ తీరంలోని 25 రాష్ట్రాల్లో కనిపిస్తోంది. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అమెరికాలో 100 ఏళ్లుగా జరుగుతోన్న మేసిస్ థ్యాంక్స్ గివింగ్ డే పరేడ్ కూడా బాంబ్ సైక్లోన్ కారణంగా వాయిదా పడింది. తీవ్రమైన గాలుల కారణంగా జార్జి వాషింగ్టన్ వంతెనపై ఖాళీ ట్రాలీలు, బైకుల ప్రయాణాలను నిషేధించారు. ఇక మేరీ ల్యాండ్‌లో 19 లక్షల మంది ప్రజలను మంచినీరు పొదుపుగా వాడుకోవాలని హెచ్చరించారు.

వాతావరణ పీడనం 24 గంటల్లోనే అసాధారణ స్థాయిలో పడిపోయే ప్రక్రియను శాస్త్రవేత్తలు 'బాంబోజెనిసిస్' అంటారు. ఈ ప్రక్రియతో ఏర్పడే తుపాన్లను 'బాంబ్ సైక్లోన్లు'గా వ్యవహరిస్తారు.



రూ.6వేల కోట్లు ఎవరు ఇవ్వాలి..?: సంజయ్ కపూర్ ఆస్తి వివాదంపై సుప్రీం అసహనం

బాలీవుడ్ నటి కరిష్మా కపూర్ మాజీ భర్త, పారిశ్రామికవేత్త సంజయ్ కపూర్ ఆస్తి వివాదం ఎటూ తెగట్లేదు. ఆస్తుల పంపకాలకు సంబంధించి సంజయ్ తల్లి రాణి కపూర్, భార్య ప్రియా సచ్‌దేవ్ మధ్య సుప్రీంకోర్టు నిర్వహించిన మధ్యవర్తిత్వం విఫలమైంది. దీంతో సర్వోన్నత న్యాయస్థానం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. ఈ ఆస్తిలో తనకు రూ.6వేల కోట్లు రావాలని రాణి కపూర్ చేస్తోన్న వాదనపై కోర్టు స్పందిస్తూ.. ఇంత మొత్తం ఎవరు ఇవ్వాలి? ఎలా ఇవ్వాలి? అని ప్రశ్నించింది.

సంజయ్ కపూర్‌కు చెందిన ఆర్కే ఫ్యామిలీ ట్రస్ట్ విలువ దాదాపు రూ.30వేల కోట్లుగా ఉంది. అయితే, ఈ ట్రస్టు చెల్లదంటూ రాణి కపూర్ గతంలో దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన భర్త, సోనా గ్రూప్ ఫౌండర్ సురీందర్ కపూర్ నుంచి తనకు సంక్రమించిన ఆస్తులను తన సమ్మతి లేకుండా సంజయ్, అతడి భార్య ఈ ట్రస్టుకు బదిలీ చేశారని రాణి ఆరోపించారు. ఈ ట్రస్టు ఆస్తులను మరొకరికి బదిలీ చేయకుండా ఆదేశాలివ్వాలంటూ సుప్రీంకోర్టులోనూ ఆమె పిటిషన్ వేశారు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం.. ఆస్తుల పంపకానికి మధ్యవర్తిత్వాన్నిసిఫార్సు చేసింది. ఇందుకోసం మాజీసీజేఐ డీవై చంద్రచూడ్‌ను మధ్యవర్తిగా నియమించింది. దీంతో జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఇప్పటివరకు సంజయ్ భార్య, తల్లి మధ్య 15 సార్లు మధ్యవర్తిత్వ చర్చలు జరిగాయి. కానీ, ఇరుపక్షాలూ ఏకాభిప్రాయానికి రాలేదు. ఈ ట్రస్టు ఆస్తిలో తనకు వాటాగా రూ.6వేల కోట్లు రావాలని రాణి కపూర్ ఆరోపిస్తున్నారు. దీన్ని ప్రియా సచ్‌దేవ్ వ్యతిరేకించారు. ట్రస్టు ఆస్తుల్లో 60శాతం వాటా తనదేనని, మిగతా 40శాతం సంజయ్ పిల్లలకు సమానంగా పంచాలని ప్రియ వాదిస్తున్నారు. ఇక, ఇందులో కరిష్మా కపూర్ పిల్లలకు కూడా 26శాతం వాటా ఉందని వారి తరపున న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ పరిణామాలతో మధ్యవర్తిత్వం కొలిక్కి రాలేదని సుప్రీంకోర్టు తాజాగా ప్రకటించింది.

ఈ సందర్భంగా రాణి కపూర్ వాదనలపై కోర్టు స్పందిస్తూ.. ''రూ.6 వేల కోట్లు ఇవ్వాలంటే ట్రస్టు ఆస్తులను ఎవరు విక్రయించాలి? ఈ మొత్తాన్ని ఎలా చెల్లించాలి?. అసలు ఇక్కడ ఎవరిపై ఎవరు పోరాడుతున్నారో అర్థం కావట్లేదు. సామరస్యపూర్వక పరిష్కారానికి అన్ని వర్గాలు అంగీకరిస్తే బాగుండేది. కానీ, పరిష్కారం కోసం మేం ఎవరినీ బలవంతం చేయలేం. అందువల్ల దీనిపై త్వరలోనే మేం వాదనలు విని ఉత్తర్వులు జారీ చేస్తాం'' అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.

2025 జూన్‌లో సంజయ్ కపూర్ మరణించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆయన కుటుంబంలో ఆస్తి వివాదాలు మొదలయ్యాయి. తమ తండ్రి ఆస్తి విషయంలో సవతి తల్లి ప్రియా సచ్‌దేవ్ మోసం చేశారంటూ కరిష్మా కపూర్ పిల్లలు గతేడాది దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ కొనసాగుతోంది.



ఫార్మా వ్యర్థాలతో హైడ్రోజెల్ తయారీ

దిల్లీ: ఫార్మాస్యూటికల్ కంపెనీలు పారవేసే నిష్ప్రియాత్మక ప్రొటీన్లను హైడ్రోజెల్స్‌గా మార్చే పద్ధతికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) రవుర్కెలా పరిశోధకులు పేటెంట్ పొందారు. గాయాలు మానడం, కణజాల పునరుత్పత్తి, మందుల సమర్థ వినియోగంలో ఇవి ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. ఈ పరిశోధన రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన జర్నల్ ఆఫ్ మెటీరియల్స్ కెమిస్ట్రీలో ప్రచురితమైంది. మానవ శరీరంలో కణజాల మరమ్మతు, జీవ ప్రక్రియల నియంత్రణతో సహా అనేక విధులను ప్రొటీన్లు నిర్వర్తిస్తాయి. అయితే వేడి, రసాయనాలు లేదా కఠినమైన పరిస్థితులకు గురైనప్పుడు ప్రొటీన్లు తమ త్రిమితీయ ఆకృతి (3డీ)ని కోల్పోయి, ముద్దలుగా మారతాయి. దీనివల్ల వాటి జీవ క్రియాశీలత నశిస్తుంది. అందుకే ఫార్మా, బయోటెక్ సంస్థలు ఈ ప్రొటీన్ ముద్దలను పారవేస్తాయని రసాయన శాస్త్ర విభాగ ప్రొఫెసర్ హరేకృష్ణ సాహా తెలిపారు. ఈ వ్యర్థ ప్రొటీన్లను గాయాలను మాన్పే హైడ్రోజెల్స్‌గా మార్చే ప్రక్రియను పరిశోధక బృందం రూపొందించింది. బోన్ మార్ఫోజెనెటిక్ ప్రొటీన్ 2 (బీఎంపీ 2)ను సుమారు 85 డిగ్రీల సెల్సియస్ పద్ధ 10 నిమిషాలు వేడిచేసి, రసాయన చర్యల ద్వారా అగ్రిగేట్స్ (ముద్దలు)గా మార్చారు. తర్వాత వాటికి హైడ్రోజన్ పెరాక్సైడ్, హైలురోనిక్ యాసిడ్ కలిపి జెల్ తయారు చేశారు. ఈ జెల్‌లోని సూక్ష్మ రంధ్రాలు నీటిని పీల్చుకోవడానికి, మందులను నిలుపుకోవడానికి, కణజాలంతో కలిసి పనిచేయడానికి తోడ్పడతాయి. యాంటీబయోటిక్ యాంపిసిలిన్ నింపిన ఈ జెల్ గాయాలను మాన్పే ఫైబ్రోబ్లాస్ట్ కణాల పెరుగుదలకు కూడా సహాయపడింది.

భవితను మార్చే.. బంగారు కాంతులు



దీపాలన్నీ ఆకాశంలో తేలియాడుతూ కనువిందు చేస్తుంటే.. వాటి ప్రతిబింబాలతో నీటిపైనా బంగారు కాంతులు పరుచుకున్న ఈ దృశ్యం ఉత్తర థాయ్‌లాండ్‌లోనిది. చియాంగ్‌మై ప్రాంతంలోని ప్రాచీన లన్నా బౌద్ధ సంప్రదాయ పంచాంగం ప్రకారం రెండో నెల పౌర్ణమి రోజున 'యీ పెంగ్' పేరిట లాంతర్ల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. సాధారణంగా ఈ వేడుక నవంబరులో వస్తుంది. గతంలో ఎదురైన కష్టాలు తొలగిపోయి, జీవితంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ కాగితపు లాంతర్లను నింగిలోకి వదులుతారు.

యవ్వనంలో రక్తంలో చక్కెర పెరిగితే.. నడివయసులో డిమెన్షియా ముప్పు



దిల్లీ: యువతగా ఉన్నప్పుడు రక్తంలో పరగడుపున చక్కెర స్థాయిలు క్రమంగా పెరిగినట్లయితే నడివయసు నాటికి జ్ఞాపకశక్తి, మెదడు పనితీరు దెబ్బతినే అవకాశం ఉందని ఒక కొత్త అధ్యయనం వెల్లడించింది. యువకులను మూడు దశాబ్దాలకు పైగా పరిశీలించిన మీదట, గ్లూకోజ్ జీవక్రియలో మార్పులు.. ఊహించిన దానికంటే ముందే మెదడు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేసింది.

అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం, టైప్ 2 మధుమేహం వచ్చినవారి మెదడు నిర్మాణంలో మార్పులు కనిపించాయి. సాధారణంగా మధుమేహం వల్ల కలిగే మెదడు సమస్యలు 65 ఏళ్ల తర్వాతే వస్తాయని భావించేవారు. కానీ మధుమేహం లేకపోయినా, ప్రీడయాబెటిస్ లేదా నిరంతరం అధిక చక్కెర స్థాయిలు ఉన్నవారిలో భవిష్యత్తులో డిమెన్షియా ముప్పు పెరుగుతుందని ప్రధాన పరిశోధకురాలు రెజీనా పారడెలా తెలిపారు. దాదాపు 3,000 మంది యువకుల ఆరోగ్య సమాచారాన్ని, 605 మంది ఎంఆర్ఐ స్కాన్లను విశ్లేషించారు.

రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినవారు, మధుమేహం వచ్చినవారు జ్ఞాపకశక్తి పరీక్షలలో తక్కువ ప్రతిభ కనబరిచారు. వీరి మెదడులో గ్రే మ్యాటర్ తగ్గడం, అసాధారణ వైట్ మ్యాటర్ పెరగడాన్ని గుర్తించారు. కాబట్టి 18 నుంచి 30 ఏళ్ల వయస్సు నుండే చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పరిశోధకులు సూచించారు.

ఐదేళ్లలో ఏఐతో 2.4 కోట్ల ఉద్యోగాలకు ముప్పు

వేగంగా అభివృద్ధి చెందుతోన్న కృత్రిమ మేధతో రానున్న ఐదు సంవత్సరాల్లో 2.4 కోట్ల ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయి. ఈ విషయాన్ని జేపీ మోర్గాన్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక పేర్కొంది. ప్రభావితం అయ్యేవి శారీరక శ్రమ లేని 'నాలెడ్జి వర్కర్' కొలువులే కావడం గమనార్హం.

రానున్న ఐదేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాల పరిస్థితి నాటకీయంగా మారిపోనుంది. వ్యాపార సంస్థలు ఏఐ వాడకం పెంచి.. ఇప్పటి వరకు ఆ పని చేస్తున్న ఉద్యోగులను పక్కనపెట్టనున్నాయి. ఈ రకంగా ఐదేళ్లపాటు ఏటా ప్రపంచ నాలెడ్జి వర్కర్ల సంఖ్యలో 1.3% మందిపై ప్రతికూల ప్రభావం పడనుంది. కంపెనీల ఏఐ బడ్జెట్‌లో సగం మొత్తాన్ని నాలెడ్జి వర్కర్ల స్థానాలను భర్తీ చేయడానికి వెచ్చిస్తాయన్న అంచనాతో ఈ గణాంకాలను వెలువరించింది. 2000 సంవత్సరం ప్రారంభంలో తయారీ రంగంలో నష్టపోయిన ఉద్యోగాల కంటే ఇప్పుడు నాలుగు రెట్లు అధికంగా కోల్పోతారని వెల్లడించింది.

అయితే ఉద్యోగాలు పూర్తిగా పోతాయనే భయాలు మాత్రం అవసరం లేదని జేపీ మోర్గాన్ పేర్కొంటోంది. ప్రతి ఉద్యోగి నిర్దిత పనుల చేయాల్సి ఉంటుందని.. అయితే ఈరోజు వరకు ఏఐ వాటిల్లో కొన్నింటిని మాత్రమే చేయగలుగుతోందని తెలిపింది. ఇక ఆర్థిక వ్యవస్థ మొత్తంలోకి ఏఐ వచ్చేందుకు కొంత సమయం పడుతుందని అంచనావేసింది. టెక్నాలజీయేతర రంగాల్లో కూడా ఏఐ వాడితేనే పెట్టుబడులకు తగిన రాబడులు వస్తాయని వివరించింది.



ఎల్ఏసీలో చైనా కవ్వింపు

ఇరుగు పొరుగుతో సంబంధాలు చాలా సున్నితమైనవి. సరిహద్దు వివాదం ఉంటే అది అత్యంత సంక్లిష్టమైన వ్యవహారంగా మారుతుంది. పరిష్కారం సాధించదల్చుకున్నప్పుడు ఇచ్చిపుచ్చుకోవడాలుంటాయి. అందులో కాస్త హెచ్చుతగ్గులుంటే చాలు... విపక్షాలు విరుచుకుపడతాయి. ఇక అవతలి సైన్యం బలవంతంగా చొరబడి ఘర్షణలకు దిగితే చెప్పేదేముంది? అరుణాచల్ ప్రదేశ్‌లోగల వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) పొడవునా చైనాతో గత జూలైనుంచి పలుచోట్ల వివాదాలు తలెత్తుతున్నాయని ఇండో–టిబెటిన్ సరిహద్దు పోలీసు (ఐటీబీపీ) దళం చీఫ్ శత్రుజిత్ కపూర్ నోరు జారటం తాజా వివాదానికి కారణం.

ఈ నెలాఖరున రిటైర్ కాబోతున్న సందర్భంగా రాజస్థాన్‌లోని ఆల్వార్‌లో ఐటీబీపీలోని శౌర్య కమాండో దళం సమర్థతను ప్రశంసిస్తూ ఆయన ఈ మాటలన్నారు. అంతే, కాంగ్రెస్ వైపునుంచి విమర్శలు మొదలయ్యాయి. గత నెల 12న ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వచ్చారు. 2020నాటి గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత ఆయన మన దేశానికి రావటం ఇదే ప్రథమం. సరిహద్దులు ప్రశాంతంగా ఉంటేనే సాధారణ సంబంధాలు మెరుగుపడతాయనీ, దాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుందామనీ ప్రధాని నరేంద్ర మోదీ, జిన్‌పింగ్‌లు అవగాహనకొచ్చారు.

శత్రుజిత్ చెబుతున్న ప్రకారం జూలైనుంచీ సరిహద్దుల్లో అలజడి ఉంటుండగా ఇరు దేశాల అధినేతల మధ్యా ఇంత సుహృద్భావం ఎలా సాధ్యమైందన్న సందేహం ఎవరికైనా వస్తుంది. కనీసం సెప్టెంబర్ తర్వాతైనా పరిస్థితి చక్కబడాలి కదా అనిపిస్తుంది. రక్షణ దళాల చీఫ్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, విదేశాంగమంత్రి జైశంకర్ చైనా సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయని వేర్వేరు సందర్భాల్లో చెప్పారు. ఎప్పటికప్పుడు సైన్యాధికారుల స్థాయి భేటీ జరగటంవల్ల ఆందోళన పడేంత అస్థిరత లేదని జనరల్ సుబ్రమణి తెలిపారు. జైశంకర్ అయితే 2024 ముందుకన్నా పరిస్థితి మెరుగ్గా ఉన్నదన్నారు.

ఈ నేపథ్యంలో సహజంగానే శత్రుజిత్ మాటల్ని కాంగ్రెస్ అందిపుచ్చుకుంది. ఎల్ఏసీలో ఏం జరుగుతున్నదో దేశ ప్రజలకు తెలియాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలో ఉంటే... ఐటీబీపీ చీఫ్ చేసిన ఈ ప్రకటన ఎంత దుమారం రేపేదో ఊహించటం కష్టమేమీ కాదు. 1962 చైనా యుద్ధంలో అప్పటి ప్రధాని నెహ్రూ వ్యవహరించిన తీరువల్ల దేశానికి కలిగిన నష్టం గురించి ఇప్పటికీ తరచు బీజేపీ నేతలు చెబుతుంటారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు పొంతన లేకుండా మాట్లాడిన సందర్భం ఏర్పడితే బీజేపీ దాన్ని మామూలుగా వదిలేది కాదు. కాంగ్రెస్‌కున్న పరిమితులవల్ల అది ఆ స్థాయిలో స్పందించలేకపోతోందని చెప్పాలి.

ఐటీబీపీ సేవలు నిరుపమానమైనవి. లద్దాఖ్‌లోని కారకోరం మొదలుకొని హిమాచల్‌లోని జరేప్ లా వరకూ గల 3,488 కిలోమీటర్ల నిడివుండే ఎల్ఏసీ అత్యంత ప్రమాద కరమైనది. అక్కడ ఆక్సిజెన్ లభ్యత అంతంతమాత్రం. శరీరం గడ్డకట్టేంత చలి. ఎత్తయిన కొండలు, చుట్టూ లోయలుండే ఆ ప్రాంతంలో ఏమాత్రం అప్రమత్తత కొరవడినా ప్రాణాలు మిగలవు. చైనా సైనికులు ఏదో చోట లోపలికి చొచ్చుకొచ్చి ఇదంతా తమదే ననటం, కవ్వింపునకు దిగటం నిత్యకృత్యం. స్వల్ప తగాదా కూడా క్షణంలోనే ఉద్రిక్తంగా మారుతుంది. గస్తీ బాధ్యతల్లో ఉండే ఐటీబీపీ దళానికి ఓర్పు, సహనం, అవతలిపక్షానికి నచ్చజెప్పే నేర్పు, ఆ ఘర్షణను అక్కడికే పరిమితం చేయగలిగే వ్యూహం ఉంటేనే రోజు గడుస్తుంది. లేదంటే ఆ వివాదం విస్తరిస్తుంది. అందుకు గల్వాన్ లోయ ఘర్షణలే ఉదాహరణ. అక్కడ మన దళాలు చైనాకు గణనీయంగానే నష్టం కలిగించినా... మనవైపు 20మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు.

మొత్తానికి ఐటీబీపీ చీఫ్ ప్రసంగం చూస్తే చైనా తన వెనకటి గుణం మానుకోలేదని అర్థమవుతుంది. అధినేతల స్థాయి సమావేశాల్లో పెద్ద మనిషి తరహాగా ఉండటం, క్షేత్రస్థాయిలో గిల్లికజ్జాలకు దిగటం మొదటినుంచీ దానికి అలవాటు. వాణిజ్యం, సరిహద్దు వివాదం– దేనిదారి దానిదేననే చైనా వాదనను ఇకపై అంగీకరించకూడదు. చిత్తశుద్ధి లోపిస్తే సామరస్యత సాధ్యంకాదనీ, కవ్వింపు చర్యలకు స్వస్తి పలకాలనీ నిక్కచ్చిగా చెప్పాలి.





కుంగిన మనసుకు ఆత్మీయతే మందు

దేశంలో మానసిక సమస్యలతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. పెద్దవాళ్లలో సుమారు పదిశాతం మంది ఇలాంటి బాధితులు ఉన్నట్లు గత నేషనల్ మెంటల్‌హెల్త్ సర్వే పేర్కొంది. నిజానికి మానసిక రుగ్మతలు ఏ ఒక్క వయసుకో పరిమితం కావు. కాబట్టి, బాధితులకు కావాల్సింది- వినే మనిషి, గౌరవించే సమాజం, సరైన చికిత్స. వారిని అర్థం చేసుకుని, తోడ్పాటు అందించడం అందరి బాధ్యత. 'ఎలా ఉన్నావు?' అని అడిగితే, చాలామంది 'బాగున్నాను' అంటారు. కానీ, ఆ సమాధానం వెనక నిద్రలేని రాత్రులు, ఎవరికీ చెప్పుకోలేని భయాందోళనలు, ఒంటరితనం దాగి ఉండొచ్చు. బయటికి నవ్వుతూ కనిపించే వ్యక్తి తీవ్రబాధలో ఉండొచ్చు. కాబట్టి, మనసులోని బాధను చెప్పుకొనేలా వారితో సంభాషణను కొనసాగించాలి. బాధ, భయం, ఒత్తిడి వంటివి ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఎదురవుతాయి. అయితే, వీటిలో ఏదైనా తీవ్రంగా వేధిస్తూ, ఎక్కువకాలం కొనసాగుతుంటే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించాలి.

వేధిస్తున్న నిపుణుల కొరత

మానసిక సమస్య అనేది కుంగుబాటు, ఆందోళన, బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రెనియా, వ్యసనాలు, ప్రవర్తనా లోపాలు, నేర్చుకోవడంలో సమస్యలు, మతిమరుపు వంటి అనేక రూపాల్లో ఉండొచ్చు. అందరికీ ఒకే వైద్యం సరిపడదు. 'ధైర్యంగా ఉండు, ఎక్కువగా ఆలోచించకు' అనే మాటలు సమస్య తీవ్రంగా ఉన్నవారికి సాంత్వన చేకూర్చలేవు. అలాగని బాధను పంచుకునే ప్రతి వ్యక్తికీ రుగ్మత ఉందని ముద్ర వేసేయకూడదు. సమస్యను బట్టి మందులు, చికిత్స, పునరావాసం అందించాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా 1019ఏళ్ల వయస్కుల్లో ప్రతి ఏడుగురిలో ఒకరు ఏదో ఒక మానసిక సమస్యతో బాధపడుతున్నట్లు డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. అలాంటి వారిని ఉపాధ్యాయులు గుర్తించగలగాలి. నిజానికి పిల్లలు తమ బాధను స్పష్టంగా విడమరచి చెప్పలేకపోవచ్చు. కాబట్టి నిద్ర, చదువు, ప్రవర్తన, స్నేహ సంబంధాల్లో మార్పులు వంటివి కనిపిస్తే... కుటుంబ సభ్యులు ముందుగా అసలు ఏం జరుగుతోందో వారిని అడిగి తెలుసుకుని, వైద్యుల దగ్గరికి తీసుకువెళ్లాలి.



దురదృష్టవశాత్తు మన దేశంలో తగినంత మంది సైకియాట్రిస్టులు లేరు. ఇండియన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీ నివేదిక 2019నాటికి దేశంలో సుమారు 9వేల మంది సైకియాట్రిస్టులు ఉన్నట్లు అంచనా వేసింది. ఆ లెక్కన లక్ష జనాభాకు ఒక్క మానసిక నిపుణుడు కూడా లేరన్న మాట. 202324 ఆర్థిక సర్వే ప్రతి లక్ష జనాభాకు కనీసం ముగ్గురు సైకియాట్రిస్టులు ఉండాలని లక్షించింది. ప్రస్తుతం దేశంలో ఎంతమంది మానసిక నిపుణులు సేవలు అందిస్తున్నారనే కచ్చితమైన డేటాయే లేదు! 'లక్ష జనాభాకు ముగ్గురు' చొప్పున అయినా, దేశంలో సుమారు 44,300 మంది మానసిక నిపుణుల అవసరముంది. వారితో పాటు క్లినికల్ సైకాలజిస్టులు, సైకియాట్రీ హెల్త్‌వర్కర్లు, మెంటల్‌హెల్త్ నర్సులు, కౌన్సెలర్లు కూడా అవసరం. ఒకప్పుడు దేశంలో మానసిక వైద్యం ప్రత్యేక ఆస్పత్రులకే పరిమితమయ్యేది. నేడు మెడికల్ కాలేజీలు, జనరల్ ఆసుపత్రులు, జిల్లాస్థాయి వరకు విస్తరించింది. కానీ, అన్నిచోట్లా సిబ్బంది, మందులు, సంరక్షణ వసతులు ఉన్నాయా అన్నది పరిశీలించాలి. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 'చికిత్స పొందే హక్కు'ను గుర్తించడంతో పాటు మానసిక 4వైద్యానికీ బీమాను వర్తింపజేయాలని పేర్కొంది. దీన్ని పక్కాగా అమలు చేయాలి. మానసిక సమస్యలతో బాధపడేవారికి 'టెలీమానస్' ఎంతో ఉపయోగపడుతోంది. 14416, 18008914416 నంబర్లకు కాల్‌చేసి ఉపశమనం పొందవచ్చు.

మనం చేయగలిగేదేంటి?

ఎవరైనా తమ బాధను చెబుతున్నప్పుడు మధ్యలో ఆపకుండా వినాలి. వారిని చిన్నచూపు చూడకూడదు. 'నీకు ఎలాంటి సాయం కావాలి' అని అడగడంతో పాటు, వైద్య నిపుణుడిని సంప్రదించేందుకు తోడుగా ఉండాలి. 'చనిపోవాలని ఉంది' అని ఎవరైనా చెబితే, వారిని ఒంటరిగా విడిచిపెట్టకుండా అత్యవసర వైద్య సేవలు అందేలా చూడాలి. అలాంటి సమయంలో నిందించడం, వాదించడం, అవమానించడం చేయకుండా... వారి భద్రతకు ప్రాధాన్యమివ్వడం ముఖ్యం. బాధితుడి బాధను కుటుంబ సభ్యులు వినాలి. కార్యాలయాలు, పని ప్రదేశాల్లో తోటివారు మద్దతుగా నిలవాలి. సినిమాలూ ఇతర దృశ్య మాధ్యమాల్లో మానసిక అనారోగ్యాన్ని అపహాసించేలా చూపడం ఎంతమాత్రం సరికాదు, అది బాధితులపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని గుర్తుంచుకోవాలి.

మితవాదులకు ఊతం

నెల క్రితం మొదలైన ఫ్రాన్స్ విద్యార్థి ఉద్యమం తగ్గుముఖం పట్టకపోగా, బలపడుతోంది, సమాజంలోని ఇతర వర్గాల ప్రత్యక్ష, పరోక్ష మద్దతుతో విస్తరిస్తోంది. స్కూళ్ళ స్థితిగతులను మెరుగుపరచాలంటూ మొదలైన నిరసనలకు తోడుగా పెరుగుతున్న ఇంధన ధరలు, క్షీణిస్తున్న ప్రజాసేవలు, ఖరీదవుతున్న ఇళ్ళు ఇత్యాది పలు సమస్యలు ఈ నిరసనలకు ఆజ్యంపోస్తున్నాయి. పారిస్ సహా అనేకనగరాల్లో విధ్వంసకాండ, లూటీలు సాగుతూ, వారసత్వ సంపదగా ఫ్రాన్స్ సగర్వంగా చెప్పుకొనే పలు అద్భుతమైన భవనాలు సైతం తగలబడిపోవడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. కార్మికసంఘాలు, రైతులు, సామాన్యప్రజలు కూడా వచ్చిచేరడంతో, కేవలం నెలరోజుల్లో ఈ ఆందోళన స్వరూపమే మారిపోయింది. అత్యంత కర్కశంగా ఈ నిరసనలను అణచివేయబోతున్నానంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు చేస్తున్న హెచ్చరికలతో మరింత హింసాయుతమైన పరిణామాలు చూడవలసి రావచ్చు.



ఫ్రాన్స్‌లో విధ్వంసానికి వలసదారులే కారణమంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు యూరప్‌లోని చాలా దేశాల నాయకులకు సమధికోత్సాహాన్నిచ్చాయి. 'ఫ్రాన్స్ తగలబడుతోంది.. పూర్తిభిన్నమైన మరో ప్రపంచం నుంచి, గుండెలనిండా ద్వేషాన్ని నింపుకున్న వారి వలసలు, ఒకప్పుడు గొప్పగా వెలిగిన ఈ దేశాన్ని ముక్కలు చేశాయి. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా, సరిహద్దులు మూసివేయండి, మీ దేశాన్ని కాపాడుకోండి' అని ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మధ్యంతర ఎన్నికల్లో ఉభయసభల్లోనూ ఉన్న ఆ కాస్త మెజారిటీ కూడా రిపబ్లికన్ పార్టీ కోల్పోనుందన్న సంకేతాల నేపథ్యంలో, ఫ్రాన్స్ దారుణపరిస్థితులను చూపి అమెరికా జనాన్ని రెచ్చగొట్టడం ట్రంప్‌కు అవసరం. అమెరికా ఘనమైన వారసత్వాన్ని కాపాడి, దానిని గ్రేట్ ఎగైన్ చేయడానికే తాను వలసలను అడ్డుకుంటున్నాననీ, లేనిపక్షంలో మనమూ ఫ్రాన్స్‌లాగా కూలిపోతామని ఆయన సూచిస్తున్నారు. వర్ధమాన దేశాల కోసం ఐరోపా సరిహద్దులను తెరవడానికి పాశ్చాత్య ఉదారవాదులు కారణమనీ, మధ్యంతర ఎన్నికలలో కాంగ్రెస్‌ను డెమోక్రాట్లు కనుక కైవసం చేసుకుంటే, ఫ్రాన్స్‌కు పట్టిన దుర్గతే తమకూ పడుతుందని అమెరికన్ ఓటర్లు గుర్తించాలని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సలహా ఇచ్చారు.

ఫ్రాన్స్ ఎంతో ఉదారంగా వలసలను అనుమతించడమే ఈ మహాఘోరానికి కారణమన్న రీతిలో యూరప్‌లోని ట్రంప్ తరహా నాయకులంతా వ్యాఖ్యలు చేస్తున్నారు. వలసలు ఒక్కటే ఫ్రాన్స్ తగలబడటానికి కారణమా? అన్న ప్రశ్నను అటుంచితే, ఫ్రాన్స్‌తో పాటు ఎన్నికలు జరగబోతున్న స్పెయిన్, ఇటలీ, పోలాండ్, గ్రీస్‌లలో వలసవ్యతిరేక వాదనలతో మితవాదులు రాజకీయంగా లబ్ధిపొందేందుకు తెగ ప్రయత్నిస్తున్నారు. యూరప్ అంతటా ఆయాదేశాల్లో అశాంతికి అనేక కారణాలు ఉన్నప్పటికీ, ప్రజాసమస్యలన్నీ వెనక్కుపోయి, వలసలు, మతం చుట్టూ విమర్శలు ప్రధానంగా సాగుతున్నాయి. కమ్యూనిస్టులూ, సోషలిస్టులూ ఈ హింసకు కారణమనీ, దీనివెనుక ఒక అంతర్జాతీయ నెట్‌వర్క్ ఉన్నదంటూ మరికొందరు కుట్రసిద్ధాంతాలు తెరమీదకు తెస్తున్నారు. భారతదేశంలో సీజేపీ ఉద్యమాలకూ, ఫ్రాన్స్ విద్యార్థి నిరసనలకూ మధ్య ఆశయాల్లో అదర్శాల్లో గల పోలికలను పక్కనబెట్టి ఇదంతా ఐదుఖండాల్లో, యాభైఐదుకుపైగా సంస్థల సమన్వయంతో సాగుతున్న అంతర్జాతీయ కుట్ర అని ఒక అమెరికన్ చానెల్ వాదిస్తోంది. ఇరాన్‌తో ఎడతెగని యుద్ధం చేస్తూ ఇంధనం, ఎరువుల కొరతకు కారణమై ప్రపంచాన్ని ఆర్థికసంక్షోభంలోకి నెట్టినవారే ఈ తరహా ఆందోళనల వెనుక విచ్చిన్నకరశక్తులున్నాయని ప్రచారం చేయడం విచిత్రం.

ఫ్రాన్స్‌లో మరో ఆర్నెల్లలో అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నందున ఈ అల్లర్లు కచ్చితంగా ఫలితాలపై ప్రభావం చూపుతాయి. పలుసర్వేల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న పచ్చిమితవాద నేషనల్ ర్యాలీ నాయకురాలు మెరినే లీపెన్‌కు ఇవి మరింత లబ్ధిచేకూర్చవచ్చు. భారతదేశంలో వివిధరాష్ట్రాల్లో అత్యంత దుర్భరమైన స్థితిలో ఉన్న స్కూళ్ళ చిత్రాలను సీజేపీ నాయకులు కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన సంగతి తెలిసిందే. ఫ్రాన్స్‌లోనూ దాదాపు ఇటువంటి పరిస్థితులే ఉన్నాయి. సగానికిపైగా స్కూళ్ళు అరవైయేళ్ళకు పైబడినవే. టీచర్ల కొరత, కారుతున్న పైకప్పులు, కిటకిటలాడుతున్న తరగతి గదులతో ఫ్రాన్స్‌లో సైతం బడులు కడుదయనీయస్థితిలో ఉన్నాయన్నది వాస్తవం. నిరసనకారుల డిమాండ్లలో అత్యధికం సరైనవేనని అంగీకరిస్తూనే, పరిష్కారాలు చూపడం కాక, ఉద్యమాన్ని కఠినంగా అణచివేస్తానని మేక్రాన్ ప్రతిజ్ఞలు చేయడం విచిత్రం.

రిజర్వేషన్లపై ఎవరు గెలవాలి?

కుల వ్యవస్థపై చర్చ వచ్చినప్పుడు ప్రతి కుల సంఘం, కుల పెద్దలు, మేధావులు, సామాజిక ప్రతినిధులు సహజంగానే తమ తమ అనుభవాలు, ప్రయోజనాలు, సామాజిక స్థితి నుంచి తమ వాదనను నిర్మించుకుంటారు. ఒక వర్గం తమలో తాము చర్చించుకున్నప్పుడు "మా వాదనే సరైనది" అనిపించడం సహజం. కానీ సమాజానికి వర్తించే విధానాన్ని నిర్ణయించాలంటే ఒక్క వర్గం అనుభవం మాత్రమే ప్రాతిపదిక కాకూడదు. ఇతర వర్గాల అనుభవాలు, చారిత్రక వాస్తవాలు, సామాజిక గణాంకాలు, రాజ్యాంగ విలువలు కూడా చర్చలోకి రావాలి. అందుకే రిజర్వేషన్ల వంటి సున్నితమైన అంశాలపై "ఎవరి వాదన వారిదే" అనే స్థాయిని దాటి, భిన్న వర్గాలు ఒకరినొకరు వినే సామాజిక సంభాషణ అవసరం.

రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు ''రిజర్వేషన్లు వద్దు'' అని చెప్పడంతో చర్చ ముగిసిపోదు. ''అయితే వాటి స్థానంలో ప్రత్యామ్నాయం ఏమిటి?'' అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి. వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అవకాశాలు, సామాజిక గౌరవం ఎలా కల్పించాలి? దానికి మీ కాంక్రీట్ విధాన ప్రతిపాదన ఏమిటి? ఆ ప్రతిపాదనను రిజర్వేషన్ల మద్దతుదారులతో బహిరంగంగా చర్చించడానికి సిద్ధంగా ఉన్నారా? అనే ప్రశ్నలు ముందుకు రావాలి. ఎవరికి వారు తమ అభ్యంతరాన్ని చెప్పడంతో పాటు ప్రత్యామ్నాయ సామాజిక పరిష్కారాన్ని కూడా సమాజం ముందు ఉంచడం ముఖ్యం కదా.

అదే సమయంలో రిజర్వేషన్లను అమలు చేస్తున్న లేదా పెంచుతున్న పాలకులను కూడా ప్రశ్నించాలి- ఇప్పటివరకు అమలైన రిజర్వేషన్ల వల్ల ఎంతమంది సామాజికంగా ముందుకు వచ్చారు? ఇంకా ఎంతమంది అవకాశాలకు దూరంగా ఉన్నారు? ఏ రంగాల్లో వెనుకబాటుతనం కొనసాగుతోంది? దాన్ని కొలిచే వ్యవస్థ ఏమిటి? తదుపరి కార్యాచరణ ఏమిటి? - ఇలాంటి ప్రశ్నలను అడగాలి. రిజర్వేషన్లు ప్రకటించడం మాత్రమే సామాజిక న్యాయం కాదు. రిజర్వేషన్ల అవసరం తగ్గేంతగా విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక గౌరవం వంటి రంగాల్లో అసమానతలను తగ్గించే కార్యాచరణ కూడా అవసరం. ఇక్కడే ''ఇక ఎంతకాలం?'' అనే ప్రశ్నకు అసలు అర్థం వస్తుంది.

రిజర్వేషన్లు యాభై శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు ఇందిరా సహాని తీర్పును అనుసరించి పలు సందర్భాల్లో తన న్యాయస్థితిని స్పష్టం చేసింది. కాబట్టి ''కోర్టులు చట్టాన్ని పక్కనపెట్టి రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పు ఇవ్వాలి'' అనేది ప్రశ్న కాదు. అసలు ప్రశ్న ఏమిటంటే-రిజర్వేషన్ల ప్రతి వివాదాన్ని కేవలం పరిమితి అనే న్యాయపరమైన ప్రశ్నగానే చూస్తామా? లేక ఆ వివాదం వెనుక ఉన్న సామాజిక అసమానత, వెనుకబాటుతనం, రిజర్వేషన్ల లక్ష్యం, వాటి ఫలితాలను చూస్తామా? అన్నది.

యాభై శాతం పరిమితి విషయంలో రాజ్యాంగ-చట్టపరమైన మార్పు అవసరమని భావిస్తే, ఆ మార్పుపై రాజకీయ ప్రక్రియ ఎక్కడ జరగాలి అన్న ప్రశ్న సహజంగానే పార్లమెంట్ ముందుకు వస్తుంది. అందుకే రాజకీయ ప్రతినిధులను కూడా ప్రశ్నించాలి: సమాజంలో సమానత్వాన్ని సాధించడానికి ఇన్నేళ్లుగా ఏ విధానపరమైన మార్పులు తీసుకొచ్చారు? కుల అసమానతలను తగ్గించడానికి మీ కార్యాచరణ ఏమిటి? వంటి ప్రశ్నలు. ''రిజర్వేషన్లు ఎప్పటివరకు?'' అనే ప్రశ్నతో పాటు ''రిజర్వేషన్లు అవసరం లేని సమాజాన్ని ఎప్పటికి నిర్మిస్తాం?'' అనే ప్రశ్న కూడా ముందుకు రావాలి.

అందుకే ఈ చర్చలు రాజకీయ పార్టీలు నిర్వహించే సభలుగా కాకుండా స్వతంత్ర సామాజిక సంభాషణ వేదికలుగా ఉండాలి. సోషల్ సైంటిస్టులు, చరిత్ర-సమాజ శాస్త్ర పరిశోధకులు, న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, శాస్త్రవేత్తలు, కుల సంఘాల ప్రతినిధులు, సిద్ధాంతపరంగా పనిచేసే సామాజిక సంస్థలు, ప్రజా ఉద్యమాలతో అనుబంధం ఉన్న నిజమైన స్వతంత్ర విప్లవవాదులు ఇందులో భాగస్వాములు కావాలి. ఎవరి రాజకీయ ప్రయోజనాలకు గులాంగిరి చేయకుండా సామాజిక వాస్తవాలను స్వతంత్రంగా పరిశీలించే వ్యక్తులు ఈ సంభాషణకు మధ్యవర్తులుగా ఉండాలి. ఈ చర్చలు ఒకే సభతో ముగియకూడదు. మొదట సామాజిక అసమానతలు, తర్వాత విద్య-ఉద్యోగ అవకాశాలు, ఆపై రాజకీయ ప్రాతినిధ్యం, చివరగా రిజర్వేషన్లకు సంబంధించిన విధానాలు, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు వంటి అంశాలపై దశలవారీగా సమావేశాలు జరగాలి. ప్రతి సమావేశంలో గణాంకాలు, పరిశోధనలు, రాజ్యాంగ విలువలు, సామాజిక అనుభవాలు ముందుంచాలి. ఒక వర్గం మాట్లాడి మరొక వర్గం వినే కార్యక్రమం కాకుండా, ప్రతిపాదనలను ప్రశ్నించే, సమాధానాలు కోరే, అవసరమైతే సవరించే విధానం ఉండాలి.

ఈ చర్చల అంతిమ లక్ష్యం ఎవరి వాదననూ ఓడించడం కాదు. అన్ని వర్గాలు తమ అభిప్రాయాలను పూర్తిగా వదులుకోవాల్సిన అవసరం లేదు. కానీ సమాజం ముందుకు సాగడానికి అవసరమైన కొన్ని ప్రాథమిక అంశాలపై కనీస సామాజిక అవగాహన ఏర్పడాలి. అదే ఒక అనధికారిక జెంటిల్‌మెన్స్ అగ్రిమెంట్‌కు పునాది కావచ్చు. అది చట్టానికి ప్రత్యామ్నాయం కాదు, రాజ్యాంగ హక్కులకు ప్రత్యామ్నాయం కాదు. పరస్పర గౌరవంతో, ఆధారాలతో, బాధ్యతతో ముందుకు సాగేందుకు ఏర్పడే ఒక సామాజిక అవగాహన మాత్రమే. రిజర్వేషన్లపై ఎవరు గెలవాలి? ఎవరు ఓడాలి? అన్నది ప్రశ్న కాదు. రిజర్వేషన్ల అవసరం లేకుండా చేసేంత సామాజిక సమానత్వాన్ని ఎప్పుడు, ఎలా నిర్మిస్తాం? అన్నదే అసలు ప్రశ్న. ఈ అంశంపై పలు వర్గాల వాదనలు తమ తమ గోడల మధ్యే మిగలకూడదు. ఒకరి మాట మరొకరు వినాలి. విభేదాలున్నచోటే సంభాషణ మొదలుకావాలి. సంభాషణ నుంచి అవగాహన, అవగాహన నుంచి విధానం, విధానం నుంచి సామాజిక మార్పు రావాలి.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శనివారం ⁞ 28.11.2026 ⁞ 01

ప్రజా సమస్యపై మంత్రి తక్షణ స్పందన



శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,
నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం కదిరి గేటు నుంచి అనంతపురం వెళ్లే ప్రధాన రహదారిలో మార్కెట్ యార్డు వెనుక వైపు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల సమస్యపై మంత్రి, ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తక్షణమే స్పందించారు. ప్రజల భద్రత దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారు లతో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి చొరవతో అధికారులు రెండు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో స్థానికులు, వాహనదారులకు ఊరట లభించింది.

32ఏళ్ల తర్వాత 3పంచాయతీల్లో క్లీన్ స్వీప్ చేశాం..

- ఎమ్మెల్యే దగ్గుపాటి
- మాపై చేస్తున్న విమర్శలకు ఈ విజయమే సమాధానం
- పంచాయతీ ఎన్నికల ఫలితాలపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి హర్షం
- అర్బన్ టీడీపీ కార్యాలయంలో విజేతలను ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే
- నకిలీ ఆధార్ కార్డులు, దొంగ ఓట్లతో ఇన్నేళ్లుగా అనంత గెలుస్తున్నారన్న దగ్గుపాటి



అనంతపురం నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

32ఏళ్ల తర్వాత అనంతపురం అర్బన్ పరిధిలోని 3పంచాయతీల్లో క్లీన్ స్వీప్ చేశామని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో కూటమి జైత్రయాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మూడుకు మూడు పంచాయతీల్లోనూ తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేసి ఘన విజయం సాధించారు. రుద్రంపేటలో హరిప్రసాద్, రాజీవ్ కాలనీలో అవుకు హరి, మరియు అనంతపురం రూరల్ పంచాయతీలో హరిత (జయరాం నాయుడు సతీమణి) విజయం సాధించడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులను ఆయన ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో 62 స్థానాలకు గాను 41 చోట్ల, 11 ఎంపీటీసీ స్థానాల్లో 9 చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారన్నారు. ఇప్పుడు మూడు పంచాయతీల్లోనూ సత్తా చాటడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు నిదర్శనమన్నారు. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నూటికి నూరు శాతం నిలబెట్టుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నకిలీ ఆధార్ కార్డులు, దొంగ ఓట్లతో ఇన్నేళ్లుగా గెలుస్తూ వచ్చారని ఆరోపించారు. 2019 ఎన్నికల్లో ఏకంగా 12 వేల దొంగ ఓట్లు వేయించుకుని ఆయన గెలిచారన్నారు. మొన్నటి ఎన్నికల్లో రాప్తాడు మండలంలో ఆయన శిష్యుడు ఏకంగా 3 వేల నకిలీ ఆధార్ కార్డులతో పట్టుబడటమే వారి అక్రమాలకు ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఈ ఎన్నికల్లో ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టి మమ్మల్ని ఆదరించారన్నారు. ఇన్ని రోజులు మాపై చేస్తూ వస్తున్న విమర్శలకు ఈ విజయం ఒక సమాధానం అన్నారు. 40 ఏళ్లుగా ప్రజలు ఆదరించినా అనంత వెంకటరామిరెడ్డి ఏనాడూ అభివృద్ధి చేయలేదన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలోనూ పంచాయతీల్లో కనీసం రోడ్లు, డ్రైనేజీలు కూడా వేయకుండా గాలికొదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనంత పురాన్ని ఆనుకుని ఉన్న నాలుగు పంచాయతీలకు వందల కోట్ల రూపాయలతో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. 10 వేల జనాభా ఉన్న రాజీవ్ కాలనీలో ఇన్నేళ్లలో హైస్కూల్ లేదంటే వారి పాలన ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే హైస్కూల్ తీసుకొస్తామన్నారు. అలాగే అక్కడి డంపింగ్ యార్డ్‌ను క్లియర్ చేసి ఆధునిక వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు, మిగిలిన స్థలంలో ప్రజల కోసం సుందరమైన పార్కును నిర్మిస్తామన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రుద్రంపేట తగరకుంట రోడ్డును కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వచ్చిన ఆరు నెలల్లోనే పూర్తి చేశామని.. ఆ రహదారికి డివైదర్లు, లైట్లు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎన్నో ఏళ్ల సమస్యలకు పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

భక్త కనకదాసు ఆశయాలు, భక్తి తత్వం ఆదర్శనీయం



- జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్

అనంతపురం, నవంబర్ 27:అనంత జనశక్తి న్యూస్

సమాజంలో కుల, మత భేదాలకు అతీతంగా మానవత్వమే ప్రధానమని భక్తి తత్వాన్ని చాటిచెప్పిన మహనీయుడు భక్త కనకదాసు అని అనంతపురం జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ పేర్కొన్నారు. భక్త కనకదాసు జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ వారు జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోల, బిసి సంక్షేమ శాఖ అధికారిణి ఖుష్బూ కొఠారి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఏ.బాలకొండయ్య, తదితర అధికారులతో కలిసి భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పుష్పాంజలి సమర్పించారు.ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ, కనకదాసు తన కీర్తనల ద్వారా భక్తి మార్గంతో పాటు సామాజిక చైతన్యాన్ని కలిగించారని కొనియాడారు. ఆయన రచనలు, బోధనలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన సన్మార్గం అనుసరణీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈ.డీ సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై జగన్‌వి పచ్చి అబద్ధాలు

- వాస్తవాలను ప్రజల ముందు ఉంచే ధైర్యం జగన్ కు ఉందా?
- 2020లోనే ఎన్జీటీ స్టే ఇచ్చి, 2023లో రూ.2.65 కోట్ల జరిమానా విధించింది.
- అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్నది జగనా? చంద్రబాబా?
- రాయలసీమ లిఫ్ట్ స్కీం తాగునీటి అవసరాల కోసమేనని జీవో ఇచ్చింది జగన్ కాదా?
- ఇప్పుడు రాయలసీమ భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అంటూ మాట మార్చడం జగన్‌కే చెల్లింది.
- రాయలసీమలో 102 ప్రాజెక్టులను ప్రీ క్లోజర్ చేసిన ఘనత జగన్‌దే.
- కూటమి ప్రభుత్వం 27 నెలల్లోనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై రూ.13,484 కోట్లు ఖర్చు చేసింది.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.



పాలకొల్లు నవంబర్ 27,అనంత జనశక్తి న్యూస్

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా విమర్శించారు. తన అనుకూల మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా రోజూ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజలు వాటిని నిజాలుగా నమ్మే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు జగన్ హయాంలోనే నిలిచిపోయిందనడానికి స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు, ఎన్జీటీ ఆదేశాలు ఆధారాలుగా ఉన్నాయని తెలిపారు.2020లో ఒక చేత్తో రాయలసీమ లిఫ్ట్‌కు పరిపాలనా అనుమతులు ఇచ్చి, రెండో చేత్తో ఎన్జీటీ ద్వారా స్టే తెప్పించింది జగన్ మోహన్ రెడ్డి కాదా? నాడు ఎన్జీటీ స్టే విధిస్తే కనీసం అఫిడవిట్ కూడా దాఖలు చేయకుండా రాయలసీమకు ద్రోహం చేశారు. 22.03.2023న ఎన్జీటీ ఈ ప్రాజెక్టుపై రూ. 2.65 కోట్ల జరిమానా విధించినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నది జగన్ మోహన్ రెడ్డి కాదా? ఆనాడు తన రాజకీయ గురువు కేసీఆర్‌ను ఒప్పించి ప్రాజెక్టును ఎందుకు కొనసాగించలేకపోయారో సమాధానం చెప్పాలి. ఈ రెండు సందర్భాల్లోనూ ముఖ్యమంత్రిగా ఉన్నది జగన్‌మోహన్‌రెడ్డేనని, చంద్రబాబు కాదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, 2023 ఆగస్టు 11న జారీ చేసిన జీవో నంబర్ 364లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సాగునీటి అవసరాల కోసం కాదని, కేవలం పరిమితమైన తాగునీటి అవసరాల కోసమేనని అప్పటి వైసీపీ ప్రభుత్వం పేర్కొందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టు పరిధిని తాగునీటి అవసరాలకే పరిమితం చేస్తూ జీవో ఇచ్చిన జగన్, ఇప్పుడు అదే ప్రాజెక్టును రాయలసీమ భవిష్యత్తును మార్చే జీవనాడిగా అభివర్ణించడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.నాడు ఏపీ సీఎం జగన్‌కు వార్నింగ్ ఇచ్చి రాయలసీమ లిఫ్ట్‌ను నిలిపివేశామని తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు స్వయంగా ప్రకటించినా జగన్ కానీ, ఆయన పత్రిక కానీ ఎందుకు సమాధానం చెప్పడం లేదురాయలసీమ ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని మంత్రి నిమ్మల అన్నారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనలో రాయలసీమకు చెందిన 102 సాగునీటి ప్రాజెక్టులను జీవో నంబర్ 365 ద్వారా ప్రీ క్లోజర్ చేశారని విమర్శించారు. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల రైతాంగానికి ఉపయోగపడే ప్రాజెక్టులను నిలిపివేసి, ఇప్పుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.రాయలసీమ రైతులకు వరప్రదాయినిగా నిలిచే డ్రిప్ ఇరిగేషన్ పథకాన్నికూడా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 90 శాతం సబ్సిడీ లభించే ఈ పథకాన్ని అమలు చేయకుండా రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు.రాయలసీమకు గుండెకాయ వంటి శ్రీశైలం ప్రాజెక్టు భద్రత విషయంలోనూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని మంత్రి అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో ప్లంజ్ పూల్ మరమ్మతులకు ఐదేళ్లపాటు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.205 కోట్లతో మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టు భద్రతకు చర్యలు చేపట్టిందన్నారు.అదేవిధంగా రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలకు కీలకమైన తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల నిర్వహణను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. 2024 వరదల సమయంలో 19వ నంబర్ గేటు కొట్టుకుపోవడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం గేట్లను ఆధునీకరించి కొత్త గేట్లను ఏర్పాటు చేసిందని, ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులతో పాటు కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో వాటిని ప్రారంభించడం జరిగిందని తెలిపారు.గోరకల్లు రిజర్వాయర్ విషయంలోనూ గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి అన్నారు. గోరకల్లు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఉంటేనే అవుకు, గండికోట, చిత్రావతి రిజర్వాయర్లకు నీరు చేరుతుందని, తద్వారా పులివెందుల సహా రాయలసీమ ప్రాంతాలకు సాగు, తాగునీరు అందుతుందని వివరించారు. గోరకల్లు భద్రతకు అవసరమైన మరమ్మతులు చేపట్టకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.201419 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై రూ.12,000 కోట్లు ఖర్చు చేశామని, 201924 మధ్య ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ పరిమాణం పెరిగినా రాయలసీమ సాగునీటి రంగానికి వైసీపీ ప్రభుత్వం కేటాయింపులు పెంచలేదని విమర్శించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 27 నెలల్లోనే రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై రూ.28,000 కోట్ల మేర ఖర్చు చేయగా, అందులో రాయలసీమ ప్రాజెక్టులకే రూ.13,484 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం మరో రూ.10,014 కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల్లో 512 టీఎంసీల వాటా సాధించడంలో చంద్రబాబు నాయుడు దూరదృష్టికీలక పాత్ర పోషించిందని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించడం వల్ల కృష్ణా జలాలపై ఒత్తిడి తగ్గి, శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు.హంద్రీనీవా ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసి, సుమారు రూ.3,800 కోట్ల వ్యయంతో 738వ కిలోమీటరు వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లిందని తెలిపారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేని పనులను కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు.రాయలసీమలో గాలేరునగరి, హంద్రీనీవా, తెలుగుగంగ, గోరకల్లు, అవుకు, గండికోట వంటి కీలక ప్రాజెక్టుల నిర్మాణానికి ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు చేసిన కృషి మరువలేనిదన్నారు.రాయలసీమను మరోసారి రతనాల సీమగా మార్చాలన్న లక్ష్యంతో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కూడా భవిష్యత్తులో రూ.20 వేల కోట్ల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు లభిస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని మంత్రి నిమ్మల విమర్శించారు. హంద్రీనీవా పనులు వేగంగా చేసి, చివరి భూములకు సైతం నీరందిస్తున్నారని పొరుగు రాష్ట్రాల నాయకులు చంద్రబాబును పొగుడుతుంటే జగన్ కడుపు మంటతో అసత్య ప్రచారానికి దిగడం ఆయన రాజకీయ అసహనానికి నిదర్శనమన్నారు.రాయలసీమ ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాల్సిన మూడు కీలక ప్రశ్నలున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

1. 2020లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఎన్జీటీ స్టే విధించినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నది ఎవరు?
2. 2023 మార్చి 22న రూ.2.65 కోట్ల జరిమానా విధించినప్పుడు అధికారంలో ఉన్నది ఎవరు?
3. రాయలసీమ లిఫ్ట్ కేవలం పరిమిత తాగునీటి అవసరాల కోసమేనని జీవో జారీ చేసింది ఎవరు?ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం ద్వారా వాస్తవాలను మార్చలేరని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి, ప్రజలకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

ఘనంగా శ్రీ భక్త కనకదాసు జయంతి వేడుకలు



- కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్
- సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి ఆయన కీర్తనలు ఎంతో దోహదపడ్డాయి.
- శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, నవంబర్ 27:అనంత జనశక్తి న్యూస్

కార్తీక బహుళ తదియ పర్వదినాన్ని పురస్కరించుకుని, శుక్రవారం నాడు స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు శ్రీ భక్త కనకదాసు జయంతి వేడుకలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ముందుగా భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భక్త కనకదాసు జీవిత విశేషాలను, సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు."దాస సాహిత్యంలో భాగంగా శ్రీకృష్ణుని అపారమైన భక్తితో సేవిస్తూ, ఆనాటి సమాజంలో వేళ్లూనుకున్న కుల వ్యవస్థను, అసమానతలను వ్యతిరేకిస్తూ కనకదాసు గారు ఆలపించిన కీర్తనలు సమాజ చైతన్యానికి ఎంతో మేలు చేశాయి" అని పేర్కొన్నారు.భక్తి మార్గంలో పయనిస్తూనే, సమాజం పట్ల తన బాధ్యతను ఆయన చక్కగా నిర్వర్తించారని తెలిపారు.నేటి తరం కూడా సమాజంలోని కుల వివక్ష, దురాచారాలను వ్యతిరేకిస్తూ కనకదాసు గారు చూపించిన ఆదర్శ మార్గంలో పయనించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ జయంతి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య,పుట్టపర్తి రెవెన్యూ డివిజనల్ అధికారి కుమారి సువర్ణ,విఆర్ఓలు,వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు కలెక్టరేట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కొవ్వూరు కూటమి సర్పంచులకు దేవినేని ఉమా అభినందనలు



- గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచన

తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు

(నవంబర్ 27):అనంత జనశక్తి న్యూస్

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి సర్పంచుల అభినందన సభలో మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, టిడిపి నేత, పారిశ్రామిక వేత్త పెండ్యాల అచ్చిబాబుతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరై విజయం సాధించిన కూటమి సర్పంచులను అభినందించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని చూరగొని విజయం సాధించిన సర్పంచులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ సహకారంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

ఎండీ రేడియో డయాగ్నోసిస్ పీజీ పరీక్షల్లో గుంటూరు విద్యార్థి ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించిన డాక్టర్ జల్లేపల్లి శివసాయి
- విద్యార్థిని అభినందించిన అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

గుంటూరు, నవంబర్ 27: అనంత జనశక్తి న్యూస్



డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎండీ రేడియో డయాగ్నోసిస్ పీజీ పరీక్షల్లో గుంటూరు నగరం, గోరంట్ల గ్రామానికి చెందిన డాక్టర్ జల్లేపల్లి శివసాయి విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించారు. శ్రీకాకుళంలోని గ్రేట్ ఈస్ట్రన్ మెడికల్ స్కూల్ అండ్ హాస్పిటల్‌లో ఎండీ రేడియో డయాగ్నోసిస్ విద్యను అభ్యసించిన శివసాయి, విశ్వవిద్యాలయ పరీక్షల్లో 608 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచారు. వైద్య విద్యలో శివసాయి సాధించిన ఈ ఘనత పట్ల కళాశాల అధ్యాపక బృందంతో పాటు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తన విజయానికి మార్గదర్శకత్వం వహించిన రేడియో డయాగ్నోసిస్ విభాగాధిపతి డాక్టర్ రూపేష్ మాండవతో పాటు అధ్యాపక బృందానికి శివసాయి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జల్లేపల్లి రవి, నాగకుమారి ల కుమారుడైన డాక్టర్ శివసాయి వైద్య విద్యలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడం తమకు ఎంతో గర్వకారణమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శివసాయిని అభినందించి, వైద్యరంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

యర్నగూడెం గ్రామ అభివృద్ధికి కూటమి అభ్యర్థి బొల్లిన పద్మజకు మద్దతివ్వండి



- మంచం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలి – దేవినేని ఉమా

తూర్పుగోదావరి జిల్లా (గోపాలపురం):నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలన, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి మండలం ఎర్నగూడెం గ్రామంలో పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి శ్రీమతి బొల్లిన పద్మజ కి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో దేవినేని ఉమా పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కలిసి కూటమి అభ్యర్థి బొల్లిన పద్మజ గారికి మద్దతు తెలియజేయాలని కోరారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఎర్నగూడెం గ్రామ సమగ్ర అభివృద్ధికి కూటమి అభ్యర్థి బొల్లిన పద్మజ కి మంచం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెనుమర్తి సుబ్బరాజు, సీనియర్ నాయకులు బల్ల సూర్యచక్రం తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





వాపుని చూసి బలుపు అనుకోవద్దు ప్రకాష్ రెడ్డి

- మేమే అక్రమాలకు పాల్పడి ఉంటే.. వాళ్లు ఎలా గెలిచారు
- మీ మెజారిటీ... మా రెబల్ అభ్యర్థులకు వచ్చిన ఓట్లతో సమానం
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్ట్రాంగ్ కౌంటర్
- ఎమ్మెల్యే సునీతను కలిసిన నూతన సర్పంచులు, వార్డు సభ్యులు
- ఆశావహులు ఎక్కువ మంది కావడం వలనే కొన్ని చోట్ల ఓటమి అన్న సునీత

రాప్తాడు నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు నియోజకవర్గ పంచాయతీ ఎన్నికల్లో ఫలితాలను చూసి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బలుపుగా భావిస్తున్నారని.. అది కేవలం వాపు అన్నది తెలుసుకుంటే మంచిదని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 96 పంచాయతీలకు గాను 52చోట్ల టీడీపీ, ఒక చోట జనసేన.. మొత్తం 53 స్థానాలలో అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు రామగిరి మండలం, వెంకటాపురం, అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసాలకు భారీగా తరలివచ్చి పరిటాల సునీతను కలిశారు. నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. వారిని ఘనంగా సత్కరించారు.

అలాగే తమకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే సునీతను ఘనంగా సత్కరించి.. ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. ఎన్నికల్లో తాము అక్రమాలకు పాల్పడ్డామని ప్రకాష్ రెడ్డి ఆరోపించడం హాస్యాస్పదమని, వాపుని చూసి బలుపు అనుకోవద్దని ఘాటుగా విమర్శించారు. నిజంగా తామే అధికార బలంతో అక్రమాలకు పాల్పడి ఉంటే స్వల్ప తేడాతో కోల్పోయిన మరో 20 పంచాయతీలను కూడా గెలిపించుకునే వాళ్లమని స్పష్టం చేశారు. రామగిరి మండలం పేరూరు పంచాయతీలో వైసీపీ అభ్యర్థి కేవలం ఒక్క ఓటుతో గెలిచారని, తామే గనుక ఫలితాలను తారుమారు చేసేవాళ్లమైతే ఆ ఒక్క ఓటును మేనేజ్ చేసుకోలేమా అని సూటిగా ప్రశ్నించారు. మీ కరపత్రికలో 10 ఓట్ల ఆధిక్యం ఉంటే 200 ఓట్ల భారీ ఆధిక్యం వచ్చినట్లు తప్పుడు రాతలు రాసుకుంటున్నారని విమర్శలు చేశారు. అసలు 190 ఓట్లు మార్చడానికి సాధ్యమవుతుందా అని నిలదీశారు. ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరిగాయన్న విషయం మీకు కూడా తెలుసని అన్నారు. అసలు వైసీపీ గెలిచిన స్థానాల వెనుక ఉన్న అసలు లెక్కలను ప్రకాష్ రెడ్డి తెలుసుకోవాలని సునీత ఎద్దేవా చేశారు. ఒకే పంచాయతీలో తమ పార్టీకి చెందిన అభ్యర్థులు ఎక్కువ మంది రెబల్స్‌గా పోటీలో ఉండటం వల్ల ఓట్లు చీలిపోయి కొన్ని కీలక పంచాయతీలను తాము కోల్పోయామని వివరించారు. ఉదాహరణకు రాప్తాడు పంచాయతీలో వైసీపీ అభ్యర్థికి 1,405 ఓట్లు రాగా, బరిలో ఉన్న ముగ్గురు టీడీపీ మద్దతుదారులకు (965 + 1,365 + 1,305) కలిపి ఏకంగా 3,635 ఓట్లు వచ్చాయని, అంటే టీడీపీకి 2,230 ఓట్ల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ ఓట్లు చీలిపోవడం వల్ల వైసీపీ అభ్యర్థి కేవలం 40 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలిచారని గుర్తుచేశారు.

ఇదే తరహాలో ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి మండలంలోని మేదాపురం, నాగసముద్రం పంచాయతీల్లో తమ రెబల్ అభ్యర్థుల వల్లే వైసీపీ గెలిచిందని, ఇదేనా మీ బలం అని ప్రశ్నించారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని 5పంచాయతీల్లో 2, మరియు 1నుంచి 40 ఓట్ల లోపు అత్యంత స్వల్ప తేడాతో తాము ఓడిపోయామని.. రంగంపేట (9), గాండ్లపర్తి (24), రాప్తాడు (40), పేరూరు (1), బసంపల్లి (37) స్థానాల్లో వైసీపీకి వచ్చిన మొత్తం మెజారిటీ కేవలం 111 ఓట్లు మాత్రమేనన్నారు. ఇక పులేటిపల్లిలో సమాన ఓట్లు రాగా లాటరీలో వైసీపీకి దక్కిందని గణాంకాలతో సహా వివరించారు. మొత్తం 96 పంచాయతీల్లో కూటమి 55 శాతం స్థానాలు 13,252 మెజారిటీ ఓట్లతో కైవసం చేసుకుంటే, వైసీపీ 43 శాతం స్థానాల వద్దే 9,831 మెజారిటీ ఓట్ల వద్ద ఆగిపోయిందన్నారు. అంటే మా రెబల్ అభ్యర్థులకు వచ్చిన 09వేల ఓట్లకన్నా మీ మెజారిటీ 831ఓట్లు ఎక్కువ. గతంలో మీలాగా తాము అక్రమాలకు పాల్పడి ఉంటే.. ఒక్క స్థానం కూడా గెలవలేరన్నారు. ఇవి పార్టీ గుర్తు మీద కాకుండా స్థానికంగా ఎంపిక చేసిన అభ్యర్థులను బట్టి కూడా ఉంటాయన్నారు. మా పార్టీలో ఆశావహులు ఎక్కువ కావడం వలన కొన్ని చోట్ల మీకు అనుకూలంగా మారిందన్నారు. అంతే తప్ప ఇందులో ప్రకాష్ రెడ్డి గొప్పతనం, ఆ పార్టీని చూసి కాదన్నది తెలుసుకోవాలన్నారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత హితవు పలికారు.

కనకదాసుడి ఆశయాల బాటలో కురుబ సమాజం....!!



- ధర్మవరంలో ఘనంగా జయంతి వేడుకలు
- మహనీయుడి విగ్రహానికి ఘన నివాళులు.. కురుబ కులస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు
- సామాజిక సమానత్వం, ఐక్యతను చాటేలా కనకదాస జయంతి వేడుకలు

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం పట్టణంలో భక్తి, సామాజిక చైతన్యం, సమాజ ఐక్యతకు ప్రతీకగా శ్రీ భక్త కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాజ్యోతి సర్కిల్‌లోని శ్రీ భక్త కనకదాస విగ్రహం వద్ద కురుబ కులస్తులు, కురుబ సంఘం నాయకులు, ప్రముఖులు కలిసి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో సమానత్వం, మానవతా విలువలు, ఆత్మగౌరవం పెంపొందించేందుకు కనకదాసుడు చేసిన కృషిని పలువురు నాయకులు స్మరించుకున్నారు. ఆయన చూపిన మార్గం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ మంత్రి మాలగుండ్ల శంకర్ నారాయణ, ఏపీ సీడ్స్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, కురుబ కళ్యాణ మండపం అధ్యక్షుడు మాలగుండ్ల మల్లికార్జున పాల్గొన్నారు. కురుబ సంఘం నాయకులు కోటి వెంకటేశ్, కళ్యాణ మండపం సెక్రటరీ కప్పల బలరాముడు, ట్రెజరర్ బండి ఉజ్జినప్ప, కౌన్సిలర్ కత్తె పెద్దన్న, గిరక నాగేంద్ర, బెల్లం తిరుపాల్, గవ్వల బాబు, దేవర సత్యనారాయణ, కేసాని సూర్యనారాయణ, చికెన్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. కనకదాస జయంతి సందర్భంగా పెద్ద సంఖ్యలో కురుబ కులస్తులు ఒకే వేదికపైకి చేరడం సమాజ ఐక్యతను చాటింది. మహనీయుల జయంతులు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా వారి ఆశయాలను ఆచరణలోకి తీసుకువచ్చే సందర్భాలుగా మారాలని పలువురు ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధి కోసం ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

పది రోజులు.. వందలాది ఆకలి కడుపులకు అన్నప్రసాదం..!!



- మాలధార భక్తుల సేవలో ఆగని అన్నదానం.... డోలా దంపతుల మానవతా బాట
- దీక్షలో ఉన్న భక్తులకు వరుసగా పదో రోజూ ఆప్యాయంగా అన్నప్రసాద వితరణ
- సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న 35వ వార్డు కౌన్సిలర్ డోలా రాజారెడ్డి, డోలా ఓబులమ్మ

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి
, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్:

భక్తికి అన్నదానం తోడైతే ఆ సేవకు మరింత ప్రత్యేకత చేకూరుతుందని చాటుతూ ధర్మవరంలో మాలధార భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమం 10వ రోజుకు చేరుకుంది. 35వ వార్డు కౌన్సిలర్ డోలా రాజారెడ్డి, అయన సతీమణి డోలా ఓబులమ్మ ఆధ్వర్యంలో పుట్టపర్తి రోడ్డు సమీపంలోని శిరిడి సాయిబాబా దేవాలయంలో ప్రతిరోజూ మాలధార భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.
దీక్షలో ఉన్న భక్తులు మధ్యాహ్న సమయంలో ఆలయానికి చేరుకుంటుండగా వారికి ఆప్యాయంగా అన్నప్రసాదం వడ్డిస్తూ డోలా దంపతులు సేవా భావాన్ని చాటుతున్నారు. ఒక రోజు కార్యక్రమంగా ప్రారంభమైన ఈ సేవ పదో రోజుకు చేరుకోవడం ద్వారా భక్తుల పట్ల వారి అంకితభావాన్ని ప్రతిబింబిస్తోంది.
భక్తులకు భోజనం పెట్టడం ఒక సేవ అయితే.. ఆ సేవను నిరంతరం కొనసాగించడం మరో గొప్ప సంకల్పం అని పలువురు భక్తులు పేర్కొంటున్నారు. ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఆకలితో ఉన్న భక్తులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు.
మాలధార భక్తుల దీక్షా ప్రయాణంలో తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం మరిన్ని రోజులు కొనసాగాలని భక్తులు ఆకాంక్షించారు. సేవ చేయడానికి పెద్ద స్థాయి అవసరం లేదని, తోటి మనిషికి ఉపయోగపడాలనే మంచి మనసుంటే చాలని డోలా దంపతుల అన్నప్రసాద కార్యక్రమం చాటుతోందని స్థానికులు పేర్కొన్నారు.



27వ వార్డు ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటన

-వార్డులో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి తొలి ప్రాధాన్యత.
-త్రాగునీటి సమస్యకు తొలి ప్రాధాన్యతగా కృషి.
-చెత్త రహిత,త్రాగునీటి సమస్యలేని వార్డుగా గుర్తింపు తేవాలని లక్ష్యంగా వార్డులో ప్రజలతో మమేకం.

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం పట్టణం 27వ వార్డు సిద్దయ్యగుట్ట,సాయి నగర్ లలో క్షేత్రస్థాయిలో పర్యటించి వార్డులో గల ప్రజా సమస్యలపై తక్షణం పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని 27వ వార్డు కౌన్సిలర్ పురుషోత్తం గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....గత ఐదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వార్డులో సమస్యలను రోజువారిగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తున్నామని, ప్రధానంగా 27వ వార్డులో త్రాగునీటి సమస్య,డైనేజీ సింట్ సమస్య,చెత్త సేకరణ సమస్య ప్రధానంగా ఉన్నాయని ఈ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని పురుషోత్తం గౌడ్ అన్నారు.వార్డును క్లీన్ మరియు గ్రీన్ గా తయారుచేసి త్రాగునీటి సమస్య లేని వార్డుగా చూడడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం 2 గంటలు పాటు వార్డులో పర్యటిస్తూ,ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విధంగా ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా పురుషోత్తం గౌడ్ అన్నారు.



బాల్య వివాహ రహిత శ్రీ సత్యసాయి జిల్లా నిర్మాణమే లక్ష్యంగా తల్లిదండ్రులు, బాలికల మహా ప్రతిజ్ఞ

- జిల్లా కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జిల్లా స్థాయి 'చేతన' కార్యక్రమం
- 18 ఏళ్లు నిండే వరకు కుమార్తెలకు - వివాహం చేయబోమని జిల్లా కలెక్టర్‌కు స్వచ్ఛంద అంగీకార పత్రాలు సమర్పించిన 500 మంది తల్లిదండ్రులు
- ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థినులు, 500 మంది తల్లిదండ్రులతో కలిసి 1,000 మంది భాగస్వామ్యం
- బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికా విద్య ఆవశ్యకతపై దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి, నవంబర్ 27:అనంత జనశక్తి న్యూస్

అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి రైల్వే స్టేషన్ నందు గల రెవెన్యూ భవన్ లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి 'చేతన' అవగాహన కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ విశిష్ట అతిథిగా హాజరై కార్యక్రమాన్నిప్రారంభించారు.తల్లిదండ్రుల స్వచ్ఛంద అంగీకార పత్రాలు - కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణ:
ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 500 మంది బాలికలు, 500 మంది తల్లిదండ్రులతో కలిపి మొత్తం 1,000 మంది ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. సభకు హాజరైన బాలికలు, తల్లిదండ్రులందరూ కలిసి "బాల్య వివాహ రహిత శ్రీ సత్యసాయి జిల్లా నిర్మాణానికి మా వంతు కృషి చేస్తాం" అంటూ ముక్తకంఠంతో ప్రతిజ్ఞ చేశారు. తమ కుమార్తెలకు 18 సంవత్సరాలు నిండే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహం చేయబోమని, వారిని ఉన్నత చదువులు చదివిస్తామని 500 మంది తల్లిదండ్రులు స్వచ్ఛందంగా లిఖితపూర్వక అంగీకార పత్రాలపై సంతకాలు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతే కాకుండా,తమ గ్రామాల్లో ఇతరులకు కూడా బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తామని వారు ప్రతినబూనారు.

బాల్య వివాహాలతో బాలికల భవిష్యత్తుకు తీవ్ర నష్టం: జిల్లా కలెక్టర్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, ప్రాథమిక హక్కులు మరియు ఉజ్వల భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని వ్యక్తం చేశారు.చిన్న వయస్సులోనే వివాహం చేయడం ద్వారా తమ బాధ్యత తీరిపోతుందని తల్లిదండ్రులు భావించడం అత్యంత ప్రమాదకరమైన అపోహ అని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల బాలికలు శారీరక,మానసిక,సామాజిక సమస్యలతో పాటు తీవ్రమైన ఆరోగ్య సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా బాల్య గర్భధారణ వల్ల తల్లి, శిశువు ఇద్దరి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.తమ కుమార్తెలకు 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయబోమని తల్లిదండ్రులు నేడు తీసుకున్న సాహసోపేత నిర్ణయం ఎంతో అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. ఈ మార్పు కేవలం ఇక్కడితో ఆగిపోకుండా,ప్రతి తల్లిదండ్రులు తమ గ్రామాల్లోని ఇతర కుటుంబాలకు కూడా ఈ సందేశాన్ని చేరవేసి, బాల్య వివాహాల నిర్మూలనలో సామాజిక బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి:

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...
జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే సున్నిత ప్రాంతాలను (హాట్‌స్పాట్‌లను) ముందుగానే గుర్తించి,ఆయా గ్రామాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించడం ద్వారా ఈ దురాచారాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చని సూచించారు. కేవలం చట్టపరమైన చర్యలే కాకుండా, పోలీస్, రెవెన్యూ, విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖలు మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా, చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల కార్యక్రమ ఉద్దేశాన్ని వివరిస్తూ.. జిల్లా కలెక్టర్ ఆలోచనల మేరకు రూపొందించిన 'చేతన' కార్యక్రమం ద్వారా కేవలం విద్యార్థినులకే కాకుండా, నిర్ణయాధికారం కలిగిన తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించి వారిని నేరుగా ఈ ఉద్యమంలో భాగస్వాములను చేశామని తెలిపారు. ఉమెన్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ విశాల ఫెరర్ మాట్లాడుతూ.. ఒక బాలికకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా ఆ కుటుంబం యొక్క తలరాత మారుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలను ఉన్నతంగా చదివించి ఆర్థిక, సామాజిక స్వావలంబన దిశగా ప్రోత్సహించాలని కోరారు.చేతన ఈశ్వరమ్మ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ,కుటుంబాల్లోని ఆర్థిక, సామాజిక ఒత్తిళ్ల కారణంగా బాలికలకు చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం వల్ల వారి బంగారు భవిష్యత్తు అంధకారమవుతుందని, విద్య మరియు సాధికారతతోనే సమాజంలో నిజమైన చైతన్యం సాధ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీఎం హెచ్ఓ ఫైరోజా బేగం,డీఆర్డీఏ పీడీ నరసయ్య, ఉమెన్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ విశాల ఫెరర్, బీసీ సంక్షేమ అధికారి రాజేంద్రనాథ్ రెడ్డి, మెప్మా పీడీ నాగరాజు, జీసీడీఓ అనిత, డీసీపీఓ మహేష్ పాల్గొన్నారు. వీరితో పాటు చేతన ఈశ్వరమ్మ ట్రస్ట్ ప్రతినిధులు, సీఐఎఫ్ ప్రతినిధి కొండప్ప, సమత ఆర్గనైజేషన్ ప్రతినిధి శ్రీనివాస్ నాయుడు, రైట్స్ ప్రతినిధి భానుజ,చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధి అరవింద్,పీఆర్‌డీఎస్ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి,వాసవ్య మహిళా మండలి ప్రతినిధి గీత,వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు,జిల్లా బాలల పరిరక్షణ విభాగం, శిశు గృహం,వన్ స్టాప్ సెంటర్,చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది మరియు 1,000 మంది బాలికలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు."
బాల్య వివాహాలకు స్వస్తి పలుకుదాం - ప్రతి బాలికకు విద్య, భద్రత, సమాన అవకాశాలు కల్పిద్దాం - బాల్య వివాహ రహిత శ్రీ సత్యసాయి జిల్లాను నిర్మిద్దాం."





బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- బాల్య వివాహాల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలి:సీడీపీఓ,వై.లావణ్య

అనంతగిరి, నవంబర్ 27:అనంత జనశక్తి న్యూస్

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ కేంద్రంలో గల కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీడీపీఓ,

వై.లావణ్య మాట్లాడుతూ... నవంబర్ 27న అంతర్జాతీయ బాల్య,అకాల బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకు ని మండల వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె సూచించారు.ఐక్యరాజ్యసమితి (UN) జనరల్ అసెంబ్లీ సెప్టెంబర్ 4, 2026న నవంబర్ 27ను అంతర్జాతీయ బాల్య,అకాల మరియు బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవంగా ప్రకటించిందన్నారు.ఈ నేపథ్యంలో మండల,గ్రామ స్థాయిల్లో ర్యాలీలు,అవగాహన సదస్సులు,వర్‌క్‌షాప్‌లు నిర్వహించి ప్రజలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాల్సి ఉంటుందన్నారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక అసెంబ్లీలు నిర్వహించి విద్యార్థులు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు.విద్యార్థులు,తల్లిదండ్రులు, మత పెద్దలు,గ్రామ పెద్దలతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలన్నారు.

బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించాలని సీడీపీఓ తెలిపారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' ప్రచారాన్ని అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 21, 2026 వరకు నిర్వహిస్తున్నరన్నారు.

ఈ ప్రచారంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలను భాగస్వాములను చేయాలని ఆమె సూచించారు.గ్రామ, వార్డు స్థాయి బాలల రక్షణ కమిటీలు, బాల్య వివాహ నిషేధ అధికారులు చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.బాల్య వివాహాలు జరిగే అవకాశమున్న ప్రాంతాలపై నిరంతర నిఘా ఉంచి, అలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.బాల్య వివాహాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు.2030 నాటికి బాల్య వివాహాలు లేని భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములై బాలికల విద్య, భద్రత, హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఆమె కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కూడా బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద



సంస్థలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమిష్టిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్,కృష్ణ వేణి సెక్టార్ పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు,సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌డీటీ సేవలకు గౌరవం, ఏకపక్ష నిర్ణయాలతో సంస్థ ప్రతిష్ట దెబ్బతీయొద్దు.



- ఎస్టీ మహిళా ఉద్యోగినిపై కక్షసాధింపు తగదు.

- ఏడు రోజుల్లో విధుల్లోకి తీసుకోవాలి.

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్:

బత్తలపల్లి ఆర్‌డీటీ ఆసుపత్రిలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న ఎస్టీ మహిళ సాకే అనురాధను స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యురాలిగా నామినేషన్ దాఖలు చేశారనే కారణంతో ఉద్యోగం నుంచి తొలగించడంపై ప్రజా సంఘాలు, దళిత-బహుజన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌డీటీ సంస్థ పేద, బడుగు, బలహీన వర్గాలకు అందిస్తున్న సేవలకు తాము గౌరవం ఇస్తున్నామని, అయితే కొందరు అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో సంస్థ ప్రతిష్ట దెబ్బతినకూడదని పేర్కొన్నారు.ఈ మేరకు ప్రజా నాయకులు యోగానంద చారి, ముసలప్ప, ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేష్, శీనా, బీఎస్పీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు సాకే వినయ్ కుమార్, సాయికుమార్ తదితరులు ఆర్‌డీటీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... సంస్థ నిబంధనలను ఉల్లంఘించారంటూ ఈ నెల 25న తొలగింపు ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. కనీసం సంజాయిషీ నోటీసు ఇవ్వకుండా ఎస్టీ మహిళా ఉద్యోగినిని తొలగించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అన్నారు.

గతంలో ఆర్‌డీటీలో పనిచేస్తూనే పలువురు వార్డు సభ్యులు, ఎంపీటీసీలుగా ఎన్నికై ప్రజాప్రతినిధులుగా కొనసాగారని గుర్తుచేశారు. ఎన్నికల్లో పోటీ చేయడం ప్రజాస్వామ్య హక్కు అని, ప్రజా సేవ చేయాలనే ఆకాంక్షతో పోటీ చేసిన మహిళ ఉపాధిని దెబ్బతీయడం సరికాదని స్పష్టం చేశారు. ఏడు రోజుల్లోపు తొలగింపు నిర్ణయాన్ని పునఃపరిశీలించి సాకే అనురాధను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్లు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు న్యాయం జరిగే వరకు ఆర్‌డీటీ ఆసుపత్రి ఎదుట ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

గెలుపు ప్రజాసేవకు నాంది కావాలి...!!

- ఆకుతోటపల్లి రెండో వార్డు అభ్యర్థి మల్లేశ్వరికి ఘన సన్మానం

- ప్రజా తీర్పుతో గెలిచిన మల్లేశ్వరి, ఇక ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలి.... చిట్రా రాజేశ్వరి

అనంతపురం జిల్లా బ్యూరో

, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్:

ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీ రెండో వార్డులో 45 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన వైసీపీ అభ్యర్థి శ్రీమతి సి. మల్లేశ్వరిని కురుబ సంఘం నాయకురాలు చిట్రా రాజేశ్వరి ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించిన మల్లేశ్వరిని అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.. సమస్యలపై గళం విప్పాలి.ఈ సందర్భంగా చిట్రా రాజేశ్వరి మాట్లాడుతూ..... ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ మల్లేశ్వరి ఇకపై పూర్తిగా ప్రజాసేవకు అంకితం కావాలని సూచించారు. రెండో వార్డు



ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా వార్డులోని సమస్యలపై నిరంతరం పోరాడాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

విజయాన్ని పదవిగా కాక.. ప్రజాసేవకు బాధ్యతగా చూడాలి

ప్రజల ఓట్లతో లభించిన విజయం ఒక బాధ్యతను మరింత పెంచుతుందని చిట్రా రాజేశ్వరి పేర్కొన్నారు. వార్డు అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కుటుంబానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వమే రాజకీయంగా బలమైన పునాదిని ఏర్పరుస్తుందని అన్నారు.మల్లేశ్వరి విజయం పట్ల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు.

మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

అనంతగిరి,నవంబర్ 27:అనంత జనశక్తి న్యూస్



అనంతగిరి మండలంలో 2026 గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి డాక్టర్ స్వామి నాయుడు తెలిపారు.మండలంలోని రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సన్నద్ధత,పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, రవాణా, భద్రత,బ్యాలెట్ బాక్సులు,ఎన్నికల సామగ్రి పంపిణీ తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలు, 232 వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి 232 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 38,286 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 18,786 మంది పురుషులు, 19,499 మంది మహిళలు,ఒకరు ఇతర ఓటర్లు ఉన్నారు.పోలింగ్ కేంద్రాల భద్రతాపరమైన ఏర్పాట్లలో భాగంగా 40 సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో పెదకోట, పినకోట, జీనబాడు, గుమ్మకోట గ్రామాలకు చెందిన పది చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అత్యంత సున్నితమైన, సమస్యాత్మక, ఎల్‌డబ్ల్యూఈ పోలింగ్ కేంద్రాలు లేవని నివేదికలో పేర్కొన్నారు.

డిసెంబర్ 27న గండికోట రన్:మంత్రి కందుల దుర్గేష్

- గండికోట వారసత్వ సంపదకు ప్రాచుర్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన లక్ష్యంగా 'గండికోట రన్' పోస్టర్‌ను ఆవిష్కరించిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

అమరావతి నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

గండికోట వారసత్వ సంపదకు విస్తృత ప్రాచుర్యం కల్పించడం, ప్రజల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించే లక్ష్యంతో డిసెంబర్ 27వ తేదీ (ఆదివారం) వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రం గండికోటలో 'గండికోట రన్' నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో 'గండికోట రన్ 2026' పోస్టర్‌ను పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్. ఎస్. రావత్, కార్యదర్శి ఆమ్రపాలి కాటలతో కలిసి మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ (ASA), 'గో హెరిటేజ్ రన్స్' సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రారంభకుల కోసం 3 కి.మీ. ఫన్ రన్, ఔత్సాహిక రన్నర్లు, అనుభవజ్ఞులైన క్రీడాకారుల కోసం 5 కి.మీ., 10 కి.మీ. పరుగు పందేలు ఉంటాయని వివరించారు. ఈ రన్‌లో సుమారు 1,000 మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిట్‌నెస్, పర్యాటకం ద్వారా ప్రజలను గండికోట చారిత్రక, వారసత్వ వైభవానికి మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. చారిత్రాత్మక కోట, పెన్నా నది లోయ అందాలు, విశిష్టమైన ప్రకృతి దృశ్యాల నడుమ సాగే ఈ పరుగు.. క్రీడాకారులకు గండికోట చరిత్ర, సంస్కృతిని తెలుసుకునే అద్భుత అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. తద్వారా బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు స్థానిక హోమ్‌స్టేలు, ఆహార విక్రేతలు, గైడ్‌లు, చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.డిసెంబర్ 27 (ఆదివారం) తెల్లవారుజామున పరుగు ప్రారంభం కానున్న నేపథ్యంలో, క్రీడాకారులు ఒకరోజు ముందుగానే డిసెంబర్ 26న (శనివారం) గండికోటకు చేరుకుని తమ బిబ్‌లను స్వీ



కరించాలని నిర్వాహకులు సూచించారు. శనివారం గండికోట అందాలను వీక్షిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదకరమైన వీకెండ్ గడిపే అవకాశం లభిస్తుందన్నారు. రన్నర్లు, ఫిట్‌నెస్ ప్రియులు, విద్యార్థులు, కుటుంబాలు, చరిత్ర అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్, నిర్వాహకులు కోరారు. ఆసక్తి గలవారు www.asaao.org లేదా www.ifnish.com వెబ్‌సైట్‌ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్, సెక్రటరీ ఆమ్రపాలి, ఏపీటీడీసీ ఈడీ శేషగిరిరావు, ఎస్ఈ ఈశ్వరయ్య, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ డైరెక్టర్ కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్ , నిమాస్ సీనియర్ పారామోటార్ ఇన్‌స్ట్రక్టర్ దీన్ దయాళ్ యాదవ్, ATOAI సదరన్ చాప్టర్ ఛైర్మన్ శేఖర్ బాబు బాచినేపల్లి , ఎవరెస్ట్ శిఖర అధిరోహకురాలు మాలావత్ పూర్ణ, ఏపీకి చెందిన ఎవరెస్ట్ పర్వతారోహకులు షేక్ హిమాంషా లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై బాలికలకు అవగాహన

- 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం.. బాలికలకు హక్కులు, విద్యపై అవగాహన

ఆత్మకూరు, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్:

బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో శుక్రవారం బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యంపై, విద్యాభివృద్ధిపై, భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని సూచించారు. ప్రతి బాలిక చదువును కొనసాగిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను అరికట్టడం ఒక్కరి బాధ్యత కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమా రోజ్, వైద్యాధికారి సుల్తానా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రీతి, హెల్త్ ఎడ్యుకేటర్ లావణ్య, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, ఝాన్సీరాణి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణే పోలీసు శాఖ లక్ష్యం.

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్...

పుట్టపర్తి రూరల్ నవంబర్ 27 అనంత జన శక్తి న్యూస్.

శ్రీ సత్యసాయి జిల్లాలోని కదిరి, పుట్టపర్తి పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, తెలిపారు.ఈ విడతలో రెండు సబ్ డివిజన్ల పరిధిలోని 12 మండలాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.కదిరి సబ్ డివిజన్ పరిధిలో 18 అత్యంత సమస్యాత్మక, 23 సమస్యాత్మక, 45 సాధారణ పోలింగ్ కేంద్రాలను గుర్తించగా,పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలో 23 అత్యంత సమస్యాత్మక, 31 సమస్యాత్మక, 25 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు.ఎన్నికల విధుల కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 31 మంది సీఐలు, 51 మంది ఎస్ఐలతో పాటు ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, ఏఆర్, ఏపీఎస్పీ బలగాలు, హోంగార్డులు కలిపి మొత్తం 1,326 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించినట్లు ఎస్పీ తెలిపారు.ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను సిద్ధంగా ఉంచామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

చట్టపరమైన ఆంక్షలు తప్పనిసరిగా పాటించాలి:

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేస్తున్నామని, ఎన్నికల సందర్భంగా అమల్లో ఉన్న బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (గతంలో సెక్షన్ 144), పోలీస్



యాక్ట్ 30 నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు.పోలింగ్ కేంద్రాల వద్ద అనవసరంగా గుంపులుగా గుమికూడరాదని, ఓటు వేసిన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం అభ్యర్థులు, వారి మద్దతుదారులు సంయమనం పాటించాలని, విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది పూర్తి అప్రమత్తతో, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.ఓటర్లు ఎలాంటి భయాందోళనలు, ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

డిసెంబర్ 12, 13 తేదీల్లో విజయవాడలో 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు – 2026'

- ఉత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్

అమరావతి నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 12, 13 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వేదికగా నిర్వహిస్తోన్న 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు - 2026' పోస్టర్ ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం సచివాలయంలోని తన పేషీలో నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ స్థాయిలో ఇంతటి ప్రతిష్టాత్మక సాంస్కృతిక ఉత్సవాలు జరగడం మనందరికీ గర్వకారణమన్నారు. మన రాష్ట్ర కళా, సాంస్కృతిక ప్రాభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఎన్నో ఏళ్లుగా నిరంతరాయంగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ సభ్యులకు, నిర్వాహకులకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కళాభిమానులు, సాహితీ ప్రియులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా విచ్చేస్తున్న కవులు, రచయితలు, కార్టూనిస్టులు, కళాకారులకు వీడియో ద్వారా హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ప్రతినిధి కలిమిశ్రీ, రాజధాని వార్తలు పత్రిక సంపాదకులు పి. హుస్సేన్ ఖాన్, సాంస్కృతిక ఉత్సవాల కల్చరల్ విభాగం బాధ్యులు వై.డి. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి చేసే వారికి ఓటు వేయండి.



పుట్టపర్తి రూరల్ నవంబర్ 27 అనంత జన శక్తి న్యూస్.

తెలుగుదేశం పార్టీ సానుభూతిపరురాలుగా బరిలో నిల్చామని, ప్రజలు అభివృద్ధి చేసే వారికి పట్టం కట్టాలనీ కప్పల బండ పంచాయతీ అభ్యర్థి లెక్కల భాగ్యమ్మ ఓటర్లను కోరారు. శుక్రవారం, కప్పల బండ , సూపర్ స్పెషాలిటీ, మామిళ్ళకుంట క్రాస్, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో 10147 ఓట్లు ఉండగా, నలుగురు అభ్యర్థులు సర్పంచ్ అభ్యర్థులుగా బరిలోరిలో నలుగురు ఉండగా, జనరల్ మహిళకు కప్పల బండ పంచాయతీ కేటాయించగా పంచాయతీ సర్పంచిగా బరిలో నిలిచామని, తమ గెలుపుకు ఓటర్లు సహకరించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మహిళ లకు ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం సానుభూతి పరులైన లెక్కల గోపాల్ భార్య భాగ్యమ్మ ఆఖరి రోజు ప్రచారం ముమ్మరం సాగింది. తనకు కేటాయించిన గంప గుర్తును ఓటర్లకు తెలిపి ఓటు వేసి గెలిపిం చాలని వారు కోరారు. తమను గెలిపిస్తే పంచాయతీలో సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిం చే విధంగా చర్యలు తీసుకుంటామని, అభివృద్ధికి తోడ్పడే వారిని ఎన్నుకోవాలని ఆమె సూచించారు. రాజకీయ అనుభవం లేని వారిని ఎన్నుకుంటే అభివృద్ధి ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వెంట తెలుగుదేశం నాయకులు లెక్కల గోపాల్, వార్డు మెంబర్లు అనూష, లక్ష్మీ నరసమ్మ, మాజీ ఎంపీటీసీ మధురిమ, పుష్పవతి,తొలిసమ్మ ,నాయకులు, రిటైర్డ్ టీచర్ శివయ్య, జయమ్మ గంగాద్రి శివయ్య బాల శ్రీనివాసులు, వెంకట రాముడు, గంగాద్రి, మహేష్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర,జిల్లా అధికారులు



నల్లచెరువు నవంబర్ 27 అనంత జనశక్తి న్యూస్

మండల కేంద్రమైన నల్లచెరువు లోని దేవరెడ్డిపల్లి సమీపంలో ఉన్న పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్ ను రాష్ట్ర స్థాయి అధికారి టి.యం.డి ఈస్మాయిల్ జిల్లా ఏ.ఎం.ఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా సందర్శిం చి తనిఖీ చేసారు తనిఖీ లో భాగంగా పాఠశాలలోని పాల్ ల్యాబ్, ఏటియల్ ల్యాబ్‌లను పరిశీలించి అక్కడ అందుబాటులో ఉన్న వివిధ పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు పరికరాల పనితీరు,వా టి వినియోగం, విద్యార్థులకు అందుతున్న ప్రయోగాత్మక అభ్యసన అవకాశాల గురించి వివరాలు తెలుసుకున్నారు అనంతరం పాఠశాలలో జరుగుతున్న విద్యా బోధన,విద్యార్థుల అభ్యసన స్థాయి, బోధనాభ్యసన మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల నిర్వహణ తీరును సమీక్షించారు విద్యార్థులకు నా ణ్యమైన విద్యను అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ వారిలోసృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు.ల్యాబ్‌లను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు ఈ ఆకస్మిక తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె ఎస్ ఎన్ మూర్తి పాల్గొని, పాఠశా లలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు,ల్యాబ్‌ల వినియోగం తదితర అంశాల గురించి అధికారు లకు వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె ఎస్ ఎన్ మూర్తి,గాయత్రి ఓబుళపతి మరియు ఉపాధ్యాయ బృందం అధికారుల సందర్శనలో పాల్గొన్నారు.

187 మంది ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్..



గాండ్లపెంట, నవంబర్,27, అనంత జనశక్తి న్యూస్,

పల్లెపోరు ఎన్నికల్లో భాగంగా మండలంలో ఉద్యోగులు ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.రెండు రోజుల పాటు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.మొత్తం 187 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయు లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.గురువారం మొదటి రోజు 55 మంది, శుక్రవారం రెండో రోజు 132 మంది ఓట్లు వేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఇన్‌సర్వీస్ ఉద్యో గులు 33 మందికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పోస్టు ద్వారా పంపించినట్లు తెలిపారు. పంచాయతీల వారీగా తూపల్లిలో 17, మల్లమీదపల్లిలో 12, వేపరాలలో 20, చామలగొందిలో 5, కురుమామిడిలో 14, గాజుల వారిపల్లి పెద్దతండాలో 10, గొడ్డు వెలగలలో 8, మద్దివారిగొందిలో 11, తుమ్మలబైలు పెద్దతండాలో 6, గాండ్లపెంటలో 38, జీనులకుంటలో 2, కటారుపల్లిలో 36, తుమ్మలబైలులో 1, సోమయాజులపల్లిలో 7 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించారు. ఓటింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను అధికారులు, సిబ్బంది భద్రపరిచారు..

ఘనంగా భక్త కనకదాస్ జయంతి

అగళి నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్



అగళి మండలంలోని రామనపల్లి పంచాయితి కసాపురం గ్రామములో శుక్రవారం 517 భక్త కనకదాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామములోని కురుబ కులస్తులు అందరూ కలిసి భక్త కనకదాస్ ఫోటోకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

పార్టీకి వెన్నుపోటు పొడిచే వారిని ఉపేక్షించేది లేదు!

- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి పేర్లను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం
- 2029 ఎన్నికల నాటికి ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి
- హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి ముత్యాలప్ప

రాప్తాడు నవంబర్ 27 అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీలో ఉంటూ, పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్న కొంతమంది వ్యక్తుల తీరును సహించేది లేదని హిందూపురం పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యాలప్ప హెచ్చ రించారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తు న్న వారి పేర్లను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.
ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, మురళీ అన్న కూడా సీరియస్‌గా పరిగణించాలని కోరారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచే స్తున్న వారిపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల ని డిమాండ్ చేశారు. 2029 ఎన్నికల నాటికి ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఇప్పటి నుంచే కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.
టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరే ళ్లలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిం దని ముత్యాలప్ప పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటింటికీ పింఛన్లు అందించడం, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాలచెర్ల గ్రామానికి ఒక్క రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు. అలాంటి గత పాలనను గుర్తుంచుకోకుండా వైఎస్సార్‌సీపీ బలపరి చిన వ్యక్తులకు ఓట్లు వేయడం బాధాకరమని, సిగ్గుచే టని వ్యాఖ్యానించారు.
పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉండాలి.. పార్టీకి నష్టం కలిగించే వారికి మాత్రం ఉపేక్ష ఉండకూ



దదని పాలచర్ల ముత్యాలప్ప స్పష్టం చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి!

- రాప్తాడు కేజీబీవీలో అవగాహన కార్యక్రమం.. విద్యార్థినులతో ప్రతిజ్ఞ, ర్యాలీ

రాప్తాడు, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్:

బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. శుక్రవా రం రాప్తాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యంలో (కేజీబీవీ) బాల్య వివాహ ముక్త్ భారత్ కార్య క్రమాన్ని నిర్వహించారు.సమగ్ర శిక్ష, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా బాలల పరిర క్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు బాల్య



వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిం చారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా బాలికల ఆరోగ్యం దెబ్బ తినడంతో పాటు విద్యాభ్యాసం మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఉందని, వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. బాలికలకు 18 సంవత్స రాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరగాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాల ను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసినప్పు డు వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అం దించాలని సూచించారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రతతో కూడిన భవిష్యత్తును అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని కోరారు.అనంతరం విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహించి, బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బాల్య వివాహం చేసుకోబోమని, ఇతరులకు కూడా బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకుంటామని విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ముత్యాలమ్మ, ప్రొ టెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ శాంతామణి, రెడ్స్ సంస్థ మండల సమన్వయకర్త మూర్తి, సంబంధిత శాఖల సిబ్బంది, విద్యార్థినులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

రాప్తాడు మండలంలో టీడీపీకి 9.. వైకాపాకు 7 స్థానాలు

- 16 పంచాయతీల్లో సర్పంచులుగా విజయం సాధించిన అభ్యర్థులు

రాప్తాడు నవంబర్ 27 అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్ద తుదారులు 9 స్థానాల్లో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 7 స్థానాల్లో విజయం సాధించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇరు పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ ఆసక్తికరంగా సాగింది.
బండమీదపల్లి పంచాయతీలో సాకే వెంకటరాముడు (టీడీపీ), భోగినేపల్లిలో కర్రె నారాయణమ్మ (టీడీపీ), బొ మ్మేపర్తిలో నారాయణమ్మ (టీడీపీ), బుక్కచెర్లలో నాగ లక్ష్మమ్మ (వైకాపా), చేర్లోపల్లిలో బాబయ్య (టీడీపీ), గం ధ్లపర్తిలో బాల కదిరప్prime (వైకాపా), గొల్లపల్లిలో పెద్దింటి ముత్యాలమ్మ (వైకాపా), గొందిరెడ్డిపల్లిలో పద్మావతి (టీడీపీ), హంపాపురంలో సరస్వతి (టీడీపీ), కొత్తపల్లి లో అనంతనేని లక్ష్మి నరసమ్మ (టీడీపీ), మారురులో



బుడగల లక్ష్మీనారాయణ (టీడీపీ), పాలచెర్లలో బిల్లె వెంకటేష్ (వైకాపా), ప్రసన్నాయపల్లిలో మహానంద రెడ్డి (వైకాపా), పుల్లలరేవులో సునీత (వైకాపా), రాప్తా డులో భాగ్యమ్మ (వైకాపా), ఎర్రగుంట్లలో శివశంకర్ (టీడీపీ) సర్పంచులుగా విజయం సాధించారు.మొత్తం 16 పంచాయతీల్లో టీడీపీ మద్దతుదారులు 9 స్థానాలు కైవసం చేసుకోగా, వైకాపా మద్దతుదారులు 7 స్థానాల్లో విజయం సాధించారు.

చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- డీలిమిటేషన్ ప్రక్రియలో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి – కేంద్ర ప్రభుత్వానికి డాక్టర్ పోతుల నాగరాజు డిమాండ్

అనంతపురం నవంబర్ 27,అనంత జనశక్తి న్యూస్:

దేశంలోని బలహీన వర్గాలకు సామాజిక న్యాయం, రాజకీయ అధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించాలంటే చట్టసభల్లో బీసీలకు 44 శాతం రి జర్వేషన్లు అమలు చేయాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశా ల్లో ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయం తీసుకో వాలని కోరారు.దేశ జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బలహీన వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు సమానంగా అందాలంటే సామాజిక న్యాయం అమలు కావాలని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలు, పార్లమెంటులో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేకపోతే వారి సమస్యలు, ఆకాంక్షలకు ఎవరు ప్రాధాన్యత ఇస్తారని ప్రశ్నించారు.మహిళలకు 33 శాతం రిజ ర్వేషన్లు అమలు చేయడం, చట్టసభల్లో సీట్ల సంఖ్య పెంపు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం వివిధ పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్న నేపథ్యంలో బీసీలకు కూడా 44 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టి డీలిమిటేష న్ ప్రక్రియలో బీసీలకు న్యాయం చేయాలని కోరారు. గతంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీలో తీర్మానాలు చేసిన తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తు న్నారని ప్రశ్నించారు. తెలంగాణలో గతంలో బీఆర్ఎ స్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రకటనలు చేసిన నేపథ్యంలో ఈ డిమాండ్ అమలు కోసం ఇప్పుడు ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు.బీసీల రాజకీయ ప్రాతిని ధ్యంపై అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు, పార్లమెం ట్ సభ్యులు తమ వైఖరిని స్పష్టం చేయాలని డాక్టర్ పోతుల నాగరాజు కోరారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అంశంపై చొరవ తీసుకొని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.దేశాభివృద్ధి కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్ర ప్రభుత్వం, అవసరమైన సందర్భాల్లో రాజ్యాంగ సవరణలు కూడా చేపట్టిందని గుర్తుచేశా రు.ప్రస్తుతం బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.బీసీల రాజకీయ హక్కుల విషయంలో అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చి, చట్టసభ ల్లో 44 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేయాలని, సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని డాక్టర్ పోతుల నాగరాజు మీడియా ద్వారా ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు విజ్ఞప్తి చేశారు.



రెండో విడత పంచాయతీ ఎన్నికలకు పోలీసుల పటిష్ట భద్రతా ఏర్పాట్లు

*** పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన పోలీసు అధికారులు.. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

అనంతపురం, నవంబర్ 27 (అనంత జనశక్తి న్యూస్):

అనంతపురం జిల్లాలో ఈ నెల 29న జరగనున్న రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావర ణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయా పోలీసు అధికారులు ఎన్నికలు జరిగే మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రెండో విడతలో గార్లదిన్నె, సింగనమల, బుక్కరా యసముద్రం, నార్పల, ఎల్లనూరు, పుట్లూరు, గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లో పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, వాటి పరిసర ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను సమీక్షించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకునే మార్గాలు, సమస్యాత్మక ప్రాంతాలు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్ర తలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు.ఓటర్లు ఎలాంటి భయాందో ళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన భద్రత కల్పించాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది.



8 వ వార్డు మెంబర్ పప్పు విజయ ఏకగ్రీవం



యాడికి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్ :

యాడికి పంచాయతీలోని 8వ వార్డు మెంబర్ పప్పు వెంకటేష్ భార్య పప్పు విజయ ఏకగ్రీవం అయ్యారని శుక్రవా రం అధికారులు తెలిపారు. జనసేన పార్టీ తరపున నామినేషన్ వేశారు. ఏకగ్రీవం కావడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు , జనసేన ఇన్ చార్జి శ్రీకాంత్ కు ,ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి కి, మండల కన్వీనర్ సునీల్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. 8వ వార్డు అభివృద్ధి కి కృషి చేస్తానని,సమస్యలను పరిస్తానని తెలిపారు. పలువురు పప్పు వెంకటేష్ ను , భార్య పప్పు విజయ ను అభినందించారు.

7 వ వార్డు మెంబర్ గాథంశెట్టి (బంగారు) బాల ఏకగ్రీవం

యాడికి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్ :

యాడికి పంచాయతీ ఉన్న 7వ వార్డు మెంబర్ గా గాథంశెట్టి (బంగారు) బాల ఏకగ్రీవం అయ్యారని శుక్రవారం అధికారులు తెలిపారు.ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గా గాథంశెట్టి (బంగారు) బాల సేవలను అందిసున్నారు.ఈ సందర్భంగా గాథంశెట్టి (బంగారు) బాల మాట్లాడుతూ జెసి ప్రభాకర్ రెడ్డి కి, ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి కి, నాయకు లకు , కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. 7వ వార్డు అభివృద్ధి కి కృషి చేస్తానని,సమస్యలను పరిస్తానని తెలిపారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు,పలువురు గాథంశెట్టి (బంగారు) బాల ను అభినందించారు.

తదుపరి విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియను

మరింత సమర్థవంతంగా నిర్వహించాలి

- కౌంటింగ్‌లో జాప్యం నివారించాలి.. ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ: నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్



ఎన్టీఆర్ జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించబడిందని, అదే స్ఫూర్తితో తదుపరి విడతల్లో జరగనున్న రెండో, మూడో విడత ఎన్నికలను మరింత సమర్థవంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొదటి విడత ఎన్నికల నిర్వహణపై ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సంబంధిత ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి విడత ఎన్నికల సందర్భంగా ఎదురైన సమస్యలు, కౌంటింగ్ ప్రక్రియలో జరిగిన జాప్యాలు, తదుపరి విడతల్లో చేపట్టాల్సిన మెరుగైన చర్యలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను 15 నిమిషాల్లోపు సీల్ చేసి, భద్రతా నిబంధనల మేరకు లెక్కింపు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో కొన్ని ప్రాంతాల్లో డాక్యుమెంటేషన్, స్టాట్యూటరీ ఫారాల పూర్తి చేయడంలో జాప్యం కారణంగా మధ్యాహ్నం 2.00 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓట్ల లెక్కింపు ఆలస్యమైందని పేర్కొన్నారు. తదుపరి విడతల్లో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా, అవసరమైన ఫారాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బందికి తగిన శిక్షణ అందించి కౌంటింగ్ ప్రక్రియను నిర్ణీత సమయానికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో తప్పనిసరిగా కనీసం 10 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తక్కువ సంఖ్యలో టేబుళ్లు ఏర్పాటు చేయడం వల్ల కౌంటింగ్ రౌండ్లు పెరిగి, ఫలితాల వెల్లడిలో జాప్యం జరుగుతోందని తెలిపారు. వార్డుల సంఖ్యకు అనుగుణంగా తగినన్ని కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయడం ద్వారా ఒకటి లేదా రెండు రౌండ్లలోనే లెక్కింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో స్థలం సరిపోని పక్షంలో పక్క గదులను వినియోగించుకోవాలని లేదా ప్రత్యామ్నాయ కేంద్రాలను ముందుగానే ఎంపిక చేసుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉన్నందున, కౌంటింగ్ కేంద్రాల లోపల, బయట తగినంత వెలుతురు ఉండేలా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎంపీడీఓలు స్వయంగా పర్యవేక్షించి, నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సమయంలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలని తెలిపారు. ఓటింగ్ సమయంలో చెల్లని ఓట్ల నమోదు తగ్గించేందుకు, అధికారులు కొత్తగా సరఫరా చేసిన స్వస్తిక్ స్టాంపులను మాత్రమే వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. పాత స్టాంపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి, ముఖ్యంగా వయసు పైబడిన వారికి, ఆరోగ్య సమస్యలు ఉన్న సిబ్బందికి సకాలంలో భోజనం, తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. విధుల నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలపై తక్షణ నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో అధికారులు సిద్ధంగా ఉండాలని, అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. నందిగామ, తిరువూరు డివిజన్ల పరిధిలో జరగనున్న రెండో, మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సమీక్షలో సూచించిన అన్ని మార్పులు, మెరుగుదలలను తక్షణమే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయం, ముందస్తు ప్రణాళిక, సమయపాలన అత్యంత కీలకమని పేర్కొంటూ, ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, చేపట్టిన చర్యలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

బాల్య వివాహ రహిత భారత్‌ను నిర్మిద్దాం..

- బాల్యాన్ని కాపాడుతూ బంగారు భవితను అందిద్దాం

- ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా ముందడుగు వేద్దాం

- ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు

- అంతర్జాతీయ బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్



జిల్లాలో బాల్య వివాహాలను బాగా కట్టడి చేస్తున్నామని.. మరింత సమష్టి కృషితో సామాజిక బాధ్యతగా బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి, ప్రతి బాల బాలికకు విద్య, ఆరోగ్యం, భద్రతతో కూడిన ఉజ్వల భవిష్యత్తును అందిద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు.

జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత శాఖ బాలల పరిరక్షణ విభాగం, జస్ట్ రైట్స్, అసోసియేషన్ ఫర్ వలంటరీ యాక్షన్, చైల్డ్‌రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అంతర్జాతీయ బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నిర్మూలనకు చేయీచేయీ కలుపుదామంటూ ప్రతిజ్ఞ చేశారు. చట్టాల ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే హెచ్చరిక ప్రచార సామగ్రిని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ, బాలల హక్కుల పరిరక్షణ, బాలికల విద్య, సాధికారతపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. బాల్య వివాహాలు బాలల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు, వారి విద్యాభ్యాసం, వ్యక్తిగత అభివృద్ధి, భవిష్యత్తు అవకాశాలకు ఆటంకం కలిగిస్తాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు దేశానికి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు, బాల్య వివాహాల వల్ల ప్రభావితమయ్యే వారికి చట్టపరమైన రక్షణలు కల్పించేందుకు బాల్య వివాహ నిషేధ చట్టం 2006 అమల్లో ఉందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చల్లా మధుసూదనరావు మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనకు కమిషన్ విశేష కృషిచేస్తోందని, ఈ కార్యక్రమాన్ని గొప్ప ఉద్యమంగా తీసుకెళ్లాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అవిద్య, ఆర్థిక పరిస్థితులు, అవగాహన లేమి, అభద్రత వంటివి బాల్య వివాహాలకు కారణమవుతున్నాయని.. ఈ నేపథ్యంలో గ్రామస్థాయి కమిటీలు మొదలు ప్రతిఒక్కరూ క్రియాశీలం కావాలన్నారు. వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి.. బాల్య వివాహాల నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థల విశేష కృషితో పాటు వివిధ అధ్యయనాల్లోని ముఖ్యాంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. బాలికలకు నాణ్యమైన విద్యను అందించడం, వారి హక్కులను గౌరవించడం, ఆత్మవిశ్వాసంతో ఎదిగేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం ద్వారా బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత అధికారి రుక్సానా సుల్తానా బేగం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు, డీఎంహెచ్‌వో డా.ఎ.శ్రావణ బాబు, జిల్లా మైనారిటీ అధికారి అబ్దుల్ రబ్బానీ, అరవ రమేష్ (ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్), నవభారతి (బాలికల అభివృద్ధి అధికారి), వివిధ మతాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు

యాడికి గ్రామ పంచాయతీ సర్పంచు తాండ్ర విక్రం ఏకగ్రీవం

యాడికి, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్



: యాడికి గ్రామ పంచాయతీ సర్పంచు గా తాండ్ర విక్రం ఏకగ్రీవం అయ్యారని శుక్రవారం అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా తాండ్ర విక్రం మాట్లాడుతూ జెసి ప్రభాకర్ రెడ్డి కి, ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. యాడికి గ్రామ పంచాయతీ అభివృద్ధి వైపు నడిపిస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తానని తెలిపారు. పలువురు తాండ్ర విక్రం ను అభినందించారు.

భక్త కనకదాస జీవితం నేటి తరానికి ఆదర్శనీయం..



- - జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

తత్వజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే రీతిలో కీర్తనలు, రచనల ద్వారా అందించిన ప్రముఖ తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త భక్త కనకదాస జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

భక్త కనకదాస జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ హాజరై కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కనకదాస రచించిన రామధ్యాన చరిత్ర, మోహన తరంగిణి వంటి ప్రముఖ రచనలు విశేష ప్రాచుర్యం పొందాయన్నారు. ఆయన జీవితాన్ని, బోధనలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో కుల వివక్షను రూపుమాపడంలో భక్త కనకదాస రచనలు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

గున్న మామిడి గ్రామంలో డ్రైడే కార్యక్రమం



అనంతగిరి, నవంబర్27:అనంత జనశక్తి న్యూస్

అనంతగిరి మండలం పెద్దబిడ్డ పంచాయతీ పరిధిలోని గున్న మామిడి గ్రామంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా CHW ఎన్. అప్పలమ్మ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు పరిసరాలను శుభ్రం చేశారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల వృద్ధిని అరికట్టి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామస్తులు ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యపై మంత్రి సత్యకుమార్ తక్షణ స్పందన

- మార్కెట్ యార్డు వెనుక ప్రమాదకర విద్యుత్....

- స్తంభాల స్థానంలో రెండు నూతన స్తంభాల ఏర్పాటు.. స్థానికులకు ఊరట....

ధర్మవరం నవంబర్ 27 అనంత జనశక్తి న్యూస్ :



ప్రజా సమస్యల పరిష్కారంలో తక్షణ స్పందనే లక్ష్యంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మరోసారి చొరవ చూపారు. ధర్మవరం పట్టణంలోని కదిరి గేటు నుంచి అనంతపురం వెళ్లే ప్రధాన రహదారిలో మార్కెట్ యార్డు వెనుక వైపున దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల సమస్యపై స్పందించి, వెంటనే పరిష్కారం చూపించారు. ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిని ప్రమాదకరంగా మారడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కదిరి గేటు వద్ద నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన రహదారికి ప్రత్యామ్నాయంగా ఈ మార్గాన్ని వినియోగిస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. ఇలాంటి కీలక మార్గంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకర స్థితికి చేరుకోవడం ప్రజల భద్రతకు ముప్పుగా మారింది. ఈ సమస్యను స్థానికుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ వెంటనే స్పందించారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించడంతో పాటు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి దెబ్బతిన్న స్తంభాల స్థానంలో రెండు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్న వాహనదారులకు, స్థానిక ప్రజలకు ఉపశమనం లభించింది. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్య తెలిసిన వెంటనే పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదు

- భూమన కరుణాకర్ రెడ్డిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం

రాయచోటి, నవంబర్ 27 (అనంత జనశక్తి న్యూస్):

దేవాలయాల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి, ప్రతి చిన్న విషయానికీ ప్రభుత్వాన్ని విమర్శించడం అలవాటుగా మార్చుకున్న వైసీపీ నేతలు ముందుగా తమ ఐదేళ్ల పాలనలో జరిగిన ఘటనలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణ, పునరుద్ధరణ, ధూపదీప నైవేద్యాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతూ, ఆలయాల పవిత్రతను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.వైసీపీ పాలనలో అంతర్వేది రథం దగ్ధమైన ఘటనతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. అప్పట్లో దేవాలయాలపై జరిగిన దాడులకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. దేవాలయాల ఆస్తుల పరిరక్షణలో సరైన చర్యలు తీసుకోని వైసీపీ నేతలు ఇప్పుడు ఆలయాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు.ఆంజనేయపురం ఘటనపై ప్రభుత్వం తప్పకుండా విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. దేవాలయాల పవిత్రతను కాపాడటం, భక్తుల మనోభావాలను గౌరవించడం తమ ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు.దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, దేవాలయాలను కాపాడటం, వాటి అభివృద్ధికి కృషి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

నార్సింపల్లి, దాడితోటలో బీజేపీ విజయదుందుభి

- విజేతలకు హరీష్ బాబు ఘన సత్కారం..

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచన....

ధర్మవరం నవంబర్ 27 అనంత జనశక్తి న్యూస్ :

తాడిమర్రి మండలంలోని నార్సింపల్లి, దాడితోట గ్రామపంచాయతీలలో ఎన్డీఏ కూటమిలో భాగంగా బీజేపీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా విజేతలు శుక్రవారం ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నార్సింపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన ఎర్రరంగు అనసూయమ్మ, దాడితోట సర్పంచ్‌గా విజయం సాధించిన పావనితో పాటు ఆయా గ్రామాల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను హరీష్ బాబు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని పదవిగా కాకుండా బాధ్యతగా భావించి గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించి నార్సింపల్లి, దాడితోట గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని విజేతలకు హరీష్ బాబు పిలుపునిచ్చారు.



మరో ఎమ్మెల్యేపై మహిళా అధికారిణి వేధింపుల ఆరోపణలు

- ఎఫ్ఐఆర్ నమోదు!

- డీఎంకే ఎమ్మెల్యే వసంతం కె. కార్తికేయన్

- బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా

- తియాగదురుగం పోలీసులు ఎమ్మెల్యేపై కేసు

తమిళనాడులో ప్రజాప్రతినిధులపై మహిళా అధికారిణుల వేధింపుల ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే టీవీకే ఎమ్మెల్యేపై కేసు నమోదైన ఘటన మరువకముందే.. తాజాగా డీఎంకే ఎమ్మెల్యేపై కూడా పోలీసులకు ఫిర్యాదు అందింది. కల్లకురిచ్చి జిల్లాలో వారం రోజుల వ్యవధిలోనే ఎమ్మెల్యేలకు సంబంధించిన ఇలాంటి రెండో ఘటన వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. రిషివందియం నియోజకవర్గానికి చెందిన డీఎంకే ఎమ్మెల్యే వసంతం కె. కార్తికేయన్‌పై ఓ మహిళా అధికారిణి వేధింపుల ఆరోపణలు చేశారు. తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ లో పనిచేస్తున్న బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తియాగదురుగం పోలీసులు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు.

అక్టోబర్ 18న వీరచోళపురంలోని జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో ఈ ఘటన జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్ 79, సెక్షన్ 132, సెక్షన్ 351(2)తో పాటు తమిళనాడు మహిళల వేధింపుల నిషేధ చట్టంలోని సెక్షన్ 4 కింద కేసు నమోదైంది. ఈ సెక్షన్లకు సంబంధించిన ఆరోపణలు మహిళ గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించడం, ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించేలా దాడి లేదా బలప్రయోగం చేయడం, క్రిమినల్ బెదిరింపులకు పాల్పడటం వంటి అంశాలకు సంబంధించినవి.

కల్లకురిచ్చి జిల్లాలో వారం రోజుల వ్యవధిలోనే మరో ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలతో కేసు నమోదవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల కల్లకురిచ్చి టీవీకే ఎమ్మెల్యే సి. అరుణ్ విఘ్నేష్‌పై కూడా కేసు నమోదైంది. జిల్లాకు చెందిన ఓ సీనియర్ మహిళా అధికారిణి ఫిర్యాదు మేరకు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఆయనపై లైంగిక వేధింపులకు సంబంధించిన మరో కేసు నమోదు చేశారు.



లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపు వల్ల ఎవరికీ నష్టం జరగదు

న్యూఢిల్లీ, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్

లోక్‌సభ సీట్ల 50 శాతం పెంపు వల్ల ఎవరికీ నష్టం జరగదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. లోక్‌సభ సీట్లను 50శాతం పెంచడం గొప్ప విషయమని, అన్ని రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతాయన్నారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడితో కలిసి దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారతంలో ప్రస్తుతం 129 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. డీలిమిటేషన్ తర్వాత 195 లోక్‌సభ స్థానాలు ఉంటాయి. దక్షిణ భారతానికి ఉన్న 23.76 శాతంలో ఎలాంటి మార్పు ఉండదు. 50 శాతం పెంపు వల్ల ఎలాంటి నష్టం ఉండదు. ఏపీలో ప్రస్తుతం 25 సీట్లు.. పెంపు తర్వాత 38 సీట్లు ఉంటాయి. ఏపీకి ప్రస్తుతం ఉన్న 4.6 శాతం సీట్లే పెంపు తర్వాత కూడా ఉంటాయి. కర్ణాటకలో ప్రస్తుతం 28 సీట్లు.. పెంపు తర్వాత 42 సీట్లు ఉంటాయి. కర్ణాటకకు ప్రస్తుతం ఉన్న 5.16శాతం సీట్లే పెంపు తర్వాత కూడా ఉంటాయి. ప్రస్తుతం ఉన్న పరిష్కార మార్గాల్లో 50శాతం సీట్ల పెంపే సరైన నిర్ణయం.
ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోతోంది. మోదీ సారథ్యంలో కేంద్రం అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా చర్యలుతీసుకోవాలి. మహిళా రిజర్వేషన్ గురించి 30 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. మహిళా రిజర్వేషన్ విషయంలో కేంద్రంతో కలిసి అడుగులు వేస్తున్నాం. మహిళల హక్కుల కోసం అన్ని పార్టీలు మద్దతివ్వాలి. రాజకీయాలు కాదు.. దేశ శ్రేయస్సే ముఖ్యం. జనాభాలో సగం ఉన్న మహిళలకు తగిన ప్రాధాన్యం దక్కాలి. మహిళా బిల్లును ఓడించిన వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరు. బిల్లును మళ్లీ ఓడించినా ఎన్డీయే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉంటాయి. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న విపక్షాలు సమస్యకు పరిష్కారం మాత్రం చెప్పట్లేదు. నారీ శక్తిని అన్ని పార్టీలు గౌరవించాల్సిందే'' అని సీఎం అన్నారు.
దక్షిణాది రాష్ట్రాలకు ఊరట..
ప్రతి రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యను 50 శాతం పెంచేందుకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న చర్యను స్వాగతిస్తూ, ఈ నిర్ణయం దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద ఉపశమనం కలిగిస్తుందని చంద్రబాబు చెప్పారు.
"ప్రధానమంత్రి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి రాష్ట్రానికి ఉన్న సీట్లలో 50 శాతం పెంపునకు శ్రీకారం చుట్టింది. ఇది మనందరికీ ఎంతో ఊరటనిస్తుంది," అని ఆయన అన్నారు.
కుటుంబ నియంత్రణ ద్వారా జనాభా వృద్ధిని తొలి దశలోనే అదుపు చేసినప్పటికీ, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందన్న ఆందోళన గతంలో ఉండేదని గుర్తు చేశారు.
"నిన్నటి వరకు మనందరిలో ఒక భయం ఉండేది. 1971 జనాభా లెక్కలు, 2011 లెక్కలు లేదా 2026 లెక్కల ప్రకారం చూస్తే, తొలి దశలో మనం కుటుంబ నియంత్రణకు చొరవ తీసుకున్నందున దక్షిణాదికి పెద్ద సమస్య వస్తుందని ఆందోళన పడ్డాం. ఆ రోజుల్లో నేను కూడా ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాను. రెండున్నర, మూడు దశాబ్దాల క్రితం కుటుంబ నియంత్రణను పెద్ద ఎత్తున ప్రోత్సహించాను," అని చంద్రబాబు పేర్కొన్నారు.
"కుటుంబ నియంత్రణ చేయాలంటే ముందుగా మహిళా అక్షరాస్యత, పేదరిక నిర్మూలన జరగాలని, అప్పుడే జనాభాను నియంత్రించగలమని అందరూ నన్ను అడిగారు. అప్పుడు నేను వాళ్లతో చెప్పాను. ఈ మూడింటినీ సాధించడానికి చాలా సమయం పడుతుంది. వీటిని ఒకేసారి చేపట్టాలి. ఆ ప్రచార పంథానే నేను ఎంచుకున్నాను," అని ఆయన వివరించారు.
ప్రస్తుతం రీప్లేస్‌మెంట్ స్థాయి 2.1 ఉండగా, సంతానోత్పత్తి రేటు 1.6గా ఉన్న నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాయని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు జనాభా నిర్వహణ అవసరమని, పెద్ద కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇచ్చి ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రజలను ప్రోత్సహించాలని తాను పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ఇన్‌స్టామార్ట్‌లో ఉద్యోగాల కోత
340 మందిపై వేటు

- బాధిత సిబ్బందికి 2027 మే వరకు
- ఆరోగ్య బీమా, పరిహార ప్యాకేజీ అందిస్తోంది

క్విక్ కామర్స్ రంగంలో పోటీ తీవ్రమవుతున్న వేళ, స్విగ్గీ అనుబంధ సంస్థ ఇన్‌స్టామార్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా సుమారు 340 మంది ఉద్యోగులను తొలగించింది. సెంట్రల్ ఆపరేషన్స్, కస్టమర్ సపోర్ట్ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిపై ఈ కోతల ప్రభావం పడినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. ఉద్యోగాలు కోల్పోయిన వారికి చట్టబద్ధంగా అందాల్సిన చెల్లింపులతో పాటు అదనపు పరిహార ప్యాకేజీ (సెవరెన్స్ సపోర్ట్) అందిస్తోంది. దీనికి తోడు 2027 మే నెల వరకు పొడిగించిన ఆరోగ్య, సంక్షేమ ప్రయోజనాలను (హెల్త్ అండ్ వెల్‌నెస్ బెనిఫిట్స్) కల్పిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 3న ఇన్‌స్టామార్ట్ కొత్త ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా నందితా సిన్హా బాధ్యతలు చేపట్టిన తర్వాత సంస్థ తీసుకున్న తొలి పెద్ద నిర్ణయం ఇదే. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో నిమిషాల్లోనే నిత్యావసర సరుకులు అందించే క్విక్ కామర్స్ విభాగంలో ప్రస్తుతం తీవ్రమైన వ్యాపార పోటీ నెలకొంది. ప్రత్యర్థి సంస్థలైన బ్లింకిట్, అమెజాన్ నౌ నుంచి ఎదురవుతున్న గట్టి పోటీని తట్టుకుని నిలబడేందుకు ఇన్‌స్టామార్ట్ ఒకవైపు వ్యయ నియంత్రణ చర్యలు చేపడుతూనే, మరోవైపు వ్యాపార విస్తరణపై దృష్టి సారించింది.
పెరుగుతున్న నష్టాలు.. ఆగని పెట్టుబడులు
నష్టాలు పెరుగుతున్నప్పటికీ వృద్ధి కోసం పెట్టుబడులను ఇన్‌స్టామార్ట్ కొనసాగిస్తోంది. 202627 ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై27) సెప్టెంబర్ త్రైమాసికంలో సంస్థ సర్దుబాటు చేసిన ఎబిze నష్టం రూ.895 కోట్లకు చేరింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఈ నష్టం రూ.849 కోట్లుగా నమోదైంది. త్రైమాసిక ప్రాతిపదికన చూస్తే, క్రితం త్రైమాసికంతో పోలిస్తే నష్టం రూ.118 కోట్లు పెరిగింది.
సెప్టెంబర్ త్రైమాసికంలో కొత్త కస్టమర్లను ఆకర్షించడానికి, వినియోగదారుల్లో కొనుగోలు అలవాట్లను పెంచడానికి, నిద్రాణమైన (డార్మెంట్) యూజర్లను తిరిగి క్రియాశీలం చేయడానికి స్విగ్గీ ఖర్చును భారీగా పెంచింది. ఇదే సమయంలో కొత్తగా 69 డార్క్ స్టోర్లను ప్రారంభించింది. దీంతో దేశంలోని 133 నగరాల్లో ఇన్‌స్టామార్ట్ డార్క్ స్టోర్ల సంఖ్య 1,240కి చేరింది.
సొంత బ్రాండ్లతో కొత్త వ్యూహం
ఈ భారీ పెట్టుబడుల కారణంగానే త్రైమాసిక ప్రాతిపదికన కాంట్రిబ్యూషన్ మార్జిన్‌పై ఒత్తిడి పెరిగిందని సంస్థ పేర్కొంది. తీవ్ర పోటీ ఉన్న క్విక్ కామర్స్ మార్కెట్లో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఇన్‌స్టామార్ట్ ఇటీవల సరికొత్త వ్యూహాలను అమలు చేస్తోంది.
ఇందులో భాగంగా రెండు ప్రైవేట్ లేబుల్ బ్రాండ్లను మార్కెట్లోకి తెచ్చింది. స్నాక్స్, పానీయాల విభాగంలో 'నాయిస్', తాజా పండ్లు, కూరగాయల విభాగంలో 'నెక్టర్' బ్రాండ్లను ప్రవేశపెట్టింది. కాగా, ఉద్యోగుల తొలగింపు వార్తలపై స్పందన కోసం సంప్రదించగా ఇన్‌స్టామార్ట్ స్పందించలేదని 'మింట్' తన కథనంలో నివేదించింది.



సర్వర్ సమస్యతో పేదలకు పౌరసరఫరాల కష్టాలు!

- రేషన్ కోసం రోజంతా నిరీక్షణ..
కూలి పనులు
వదులుకుంటున్న పేదలు

గుడిబండె నవంబర్ 27,అనంత జనశక్తి న్యూస్

పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం పొందడమే ఇప్పుడు లబ్ధిదారులకు కష్టంగా మారింది. న్యాయధరల దుకాణాల్లో తరచూ తలెత్తుతున్న సర్వర్ సమస్యల కారణంగా పౌరసరఫరాల పంపిణీ నిలిచిపోతోంది. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నా బియ్యం అందకపోవడంతో పేదలు, కూలీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రోజువారీ కూలీ పనులకు వెళితేనే కుటుంబం గడిచే పరిస్థితుల్లో ఉన్న పేదలు రేషన్ కోసం పనులు మానుకుని దుకాణాల వద్దకు వస్తున్నారు. అయితే అక్కడికి చేరుకున్నతర్వాత సర్వర్ పనిచేయకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. దీంతో ఒకరోజు కూలీ కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మహిళలు, వృద్ధులు సైతం గంటల తరబడి నిరీక్షిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

కూలీ పనులకు వెళ్లాలా.. రేషన్ కోసం వేచి ఉండాలా?

రేషన్ బియ్యం కోసం రోజంతా సమయం వెచ్చించాల్సి రావడంతో పేద కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ఒకరోజు కూలీకి వెళ్లకపోతే ఆ రోజు కుటుంబ పోషణ భారంగా మారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందిస్తున్నప్పటికీ, వాటిని పొందేందుకు ఇన్ని ఇబ్బందులు పడాల్సి రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

సర్వర్ సమస్యతో డీలర్లకూ తప్పని తిప్పలు!

సర్వర్ సమస్య లబ్ధిదారులనే కాకుండా న్యాయధరల దుకాణాల నిర్వాహకులను కూడా ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రజలు రేషన్ కోసం వచ్చినా సాంకేతిక సమస్య కారణంగా పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో ప్రజల ఆగ్రహానికి డీలర్లు గురవుతున్నారు. తమ చేతుల్లో లేని సమస్యకు సమాధానం చెప్పలేక వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయంపై పడితరాల పంపిణీదారుడు హెచ్.పీ. రామనాథ్ మాట్లాడుతూ.. సర్వర్ సమస్య కారణంగా రేషన్ పంపిణీ చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పైఅధికారుల నుంచి సరైన స్పందన రావడం లేదన్నారు. ఉదయం నుంచి రాత్రి 11.59 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలని ఆదేశాలు ఉన్నాయని, సర్వర్ సక్రమంగా పనిచేస్తే రాత్రంతా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కానీ సర్వర్ పనిచేయకపోతే రోజంతా ఎదురుచూసినా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు.

అధికారులు స్పందించాలి.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి!

పేదలకు అందాల్సిన ఉచిత రేషన్ సకాలంలో అందేలా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సర్వర్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కూలీ పనులు వదులుకుని రేషన్ కోసం రోజంతా వేచి ఉండే దుస్థితికి ముగింపు పలకాలని, పేదల సమయాన్ని, శ్రమను ఆదా చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.



జాతి, మతం, భాషలకు అతీతంగా మానవత్వానికి ప్రాధాన్యతనిచ్చిన మహనీయుడు కనకదాసు

- కనకదాసు ఆశయాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలి
– ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి

గుడిబండ, నవంబర్ 27, అనంత జనశక్తి న్యూస్:



జాతి, మతం, భాషలకు అతీతంగా మనిషిని మనిషిగా గౌరవిస్తూ మానవత్వానికి ప్రాధాన్యతనివ్వాలని బోధించిన మహనీయుడు శ్రీ కనకదాసు అని ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి అన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ నిజ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.శుక్రవారం గుడిబండలోని పట్టణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ పండుగల నిర్వహణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కనకదాసు జయంతి వేడుకలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో కుల వివక్షను తొలగించేందుకు కనకదాసు విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. కులం, మతం, భాష ఆధారంగా కాకుండా ప్రతి మనిషిని మానవత్వంతో గౌరవించే గొప్ప సంస్కృతిని అలవర్చుకోవాలన్నారు.గుడిబండలో కనకదాసు భవన నిర్మాణం కోసం 20 గుంటల స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు, భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు విడుదల చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ భవనాన్ని సమాజ అభివృద్ధికి, మంచి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని సూచించారు. కురుబ సామాజిక వర్గ ప్రజలు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని కోరారు.అనంతరం ముఖ్య ఉపన్యాసం చేసిన అధ్యాపకులు ఆరికెరె మునిరాజు మాట్లాడుతూ, కనకదాసు దేవుడిని వెతకడం కంటే మనిషిలోని మానవత్వాన్ని గుర్తించేందుకు ప్రాధాన్యతనిచ్చారని వివరించారు. మహిళా స్వేచ్ఛ, సమానత్వం వంటి అంశాల పట్ల కూడా కనకదాసుకు గొప్ప ఆలోచనలు ఉండేవని పేర్కొన్నారు. అలాంటి మహనీయుడి జీవిత చరిత్ర, బోధనలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, కురుబ సంఘం నాయకులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కేబినెట్ భేటీకి వెళ్లకుండా.. అమిత్ షాను ఒప్పించా

(మొదటి పేజీ తరువాయి)



సామాజిక సమస్యలపై చర్చించుకునే కుటుంబాలు ఇప్పుడు డ్రగ్స్ అంశంపై కూడా మాట్లాడుకుంటున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రాత్రి రెండు గంటల వరకు అనేక మంది వచ్చి తమను కలిశారని, నగర శివారుల నుంచి ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది తరలివచ్చి సంఘీభావం తెలుపుతూ ఉత్సాహంగా ప్రతిజ్ఞ చేస్తున్నారని వివరించారు. దేశంలో డ్రగ్స్‌కు బానిసలవుతున్న వారిలో 13 శాతం మంది 14 నుంచి 16 ఏళ్ల మధ్య వయసు వారే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, అందుకే తాను పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని అవగాహన కల్పిస్తున్నానని చెప్పారు. పాఠశాలల విజ్ఞప్తి మేరకు పాఠ్యాంశాల్లో (సిలబస్) డ్రగ్స్ దుష్ప్రభావాలపై అంశాలను చేర్చే విషయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.
రాబోయే రోజుల్లో భారత యువత కీలక పాత్ర పోషిస్తుందని, వారిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కిషన్ రెడ్డి అన్నారు. దేశంలో డీఅడిక్షన్ కేంద్రాలను పెంచాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో వాటి సంఖ్యను పెంచుతామని తెలిపారు. సరిహద్దు దేశాల నుంచి వివిధ మార్గాల ద్వారా డ్రగ్స్ దేశంలోకి వస్తున్నాయని, దీనిని అరికట్టేందుకు ఇప్పటికే పలు దేశాలతో ఒప్పందాలు చేసుకున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 1 లక్షా 89 వేల కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసిందని వెల్లడించారు. డ్రగ్స్ బారిన పడిన వారిని సమాజం నుంచి వెలివేయకుండా, వారితో స్నేహపూర్వకంగా ఉంటూ ఆ మహమ్మారి నుంచి బయటపడేలా చేయాలని సూచించారు.
ఈ రోజు మైత్రివనం వద్ద సినీ నటుడు అక్కినేని నాగార్జున యాత్రలో పాల్గొంటారని, మధ్యాహ్నం 3 గంటలకు యాత్ర ఫిల్మ్‌నగర్ చేరుకుంటుందని కిషన్ రెడ్డి తెలిపారు. ముగింపు సభలో ప్రముఖ నటుడు చిరంజీవి, ఆధ్యాత్మిక గురువు పండిట్ రవిశంకర్ పాల్గొంటారని వెల్లడించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కేంద్ర కేబినెట్ సమావేశం ఉన్నందున, యాత్రను రద్దు చేసుకుని రావాలని ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఫోన్ చేశారని చెప్పారు. అయితే, ఈ కార్యక్రమానికి వస్తున్న స్పందనను అమిత్ షాకు వివరించి ఒప్పించానని, ఆయన ద్వారా ప్రధాని మోదీ అనుమతి తీసుకున్నానని తెలిపారు. ఏ మంత్రికి మినహాయింపు ఇవ్వకపోయినా, 'సషా ముక్త్ భారత్' కార్యక్రమ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని తనకు అనుమతి ఇచ్చినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ యాత్రలో ఎక్కడా బీజేపీ జెండా లేదని స్పష్టం చేస్తూ, సమస్యపై అవగాహన లేకుండా విమర్శలు చేసే వారికి తాను సమాధానం చెప్పనని, వారికి తెలివి ఉంటే ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని హితవు పలికారు.

రూ.36 వేల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

అమరావతిలో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాల పనులకు భారీగా నిధులను కేటాయించడానికి పచ్చజెండా ఊపింది. సమీకృత సచివాలయం, ఆయా శాఖాధిపతుల కార్యాలయాల నిర్మాణ వ్యయం రూ.4,688 కోట్ల నుంచి రూ.6,641 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అమరావతిలో గ్రామ పంచాయతీల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1,215 కోట్ల పనులను చేయడానికి ఆమోదించింది. శాఖమూరులో అమరావతి సంగమం నిర్మాణానికి రూ.626 కోట్ల ప్రతిపాదనకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

కోల్ ఇండియాతో జాయింట్ వెంచర్ ఏర్పాటు..

రాజధానిలో గ్రీన్‌వర్క్స్ ప్యాకేజీ2 కింద రూ.180.68 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం కోల్ ఇండియాతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయడానికి ఏపీజెన్‌కోకు అనుమతి ఇచ్చింది. కడప జిల్లా మైలవరంలో 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు 1,127 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయించింది. నంద్యాల జిల్లాలో 210 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు బదిలీకి అనుమతి ఇచ్చింది. ప్రకాశం జిల్లాలో రోజుకు 12 టన్నుల సామర్థ్యంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. అనంతపురం జిల్లాలో 9,917 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అనంతపురం జిల్లాలో 4,352 మంది పట్టాదారులకు ప్రయోజనం కలిగేలా భూ రికార్డుల సవరణకు అనుమతి ఇచ్చింది. రైల్వేకోడూరు పరిధిలో 10,192 ఎకరాల భూములకు సంబంధించి వెబ్‌ల్యాండ్ రికార్డుల సవరణకు పచ్చజెండా ఊపింది. భూ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ, అసైన్డ్, వివాదాస్పద భూములకు కొత్త హక్కులు కల్పించరాదని స్పష్టమైన నిబంధనలు విధిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విశాఖపట్నంలోని రుషికొండ ప్యాలెస్ భవనాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది.. అయితే, రుషికొండ ప్యాలెస్ నిర్మాణాల వినియోగంపై ఏపీ కేబినెట్‌లో కీలక చర్చ జరిగింది. రుషికొండ ప్యాలెస్‌ను హోస్పిటాలిటీ, పర్యాటక రంగానికి ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా నాలుగు నెలల పాటు ప్రజల సందర్శనకు ప్యాలెస్‌ను అందుబాటులో ఉంచాలని నిర్ణయించినట్లు సమాచారం. సందర్శకుల కోసం టికెట్ విధానం అమలు చేసే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.
120 రోజుల్లో PPP విధానంలో అప్పగింత
రుషికొండ ప్యాలెస్‌ను 120 రోజుల్లోగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో హోస్పిటాలిటీ ప్రాజెక్టుగా అప్పగించాలని కేబినెట్‌లో చర్చించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపుతూ తొమ్మిది సంస్థలు పర్యాటక శాఖను సంప్రదించాయి. టాటా గ్రూప్, లీలా ప్యాలెస్, అట్మాస్ఫియర్ కోర్ వంటి ప్రముఖ సంస్థలు ఈ ప్రాజెక్టుపై ఆసక్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సంస్థల ప్రతిపాదనలను పరిశీలించి నాలుగు నెలల్లోగా తుది నిర్ణయం తీసుకునేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.
మరో నాలుగు ఎకరాల్లో నిర్మాణాలకు అవకాశం
రుషికొండ ప్యాలెస్ ప్రాజెక్టుకు సంబంధించి 2019 నాటి కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (CRZ) నిబంధనల ప్రకారం లభించే సడలింపులతో మరో నాలుగు ఎకరాల స్థలంలో కొత్త నిర్మాణాలకు అనుమతి కల్పించే అంశం కూడా చర్చకు వచ్చింది. ఈ స్థలంలో గరిష్ఠంగా 150 గదుల వరకు నిర్మించుకునే అవకాశం కల్పించనున్నారు. దీనివల్ల రుషికొండ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి హోస్పిటాలిటీ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.
నాలుగు నెలల పాటు ప్రజల సందర్శనకు అవకాశం
ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియ పూర్తయ్యేలోపు నాలుగు నెలల పాటు రుషికొండ ప్యాలెస్‌ను ప్రజల సందర్శన కోసం తెరవాలని నిర్ణయించినట్లు సమాచారం. సందర్శకుల నుంచి టికెట్ వసూలు చేయాలా? టికెట్ ధర ఎంత ఉండాలి? అనే అంశాలపై ప్రభుత్వం త్వరలో స్పష్టత ఇవ్వనుంది. మొత్తంగా రుషికొండ ప్యాలెస్‌ను పర్యాటక, ఆతిథ్య రంగాలకు ఉపయోగపడేలా మార్చడంతో పాటు ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. రానున్న నాలుగు నెలల్లో ఈ ప్రాజెక్టుపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

భారత్‌లోకి పాకిస్థాన్ చొరబాటుదారుడు
కాల్చి చంపిన బీఎస్ఎఫ్

- 20 ఏళ్ల యువకుడు ప్రవేశించేందుకు
- 120 మీటర్ల వరకు భారత్ భూభాగంలోకి

అంతర్జాతీయ సరిహద్దు గుండా భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన పాకిస్థాన్ చొరబాటుదారుణ్ని బీఎస్ఎఫ్ దళాలు కాల్చి చంపాయి. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో జరిగింది. అనంతరం ఈ విషయాన్ని దళాలు అధికారికంగా వెల్లడించాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ జిల్లాలో సరిహద్దు నుంచి పాకిస్థాన్‌కు చెందిన 20 ఏళ్ల యువకుడు ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. 120 మీటర్ల వరకు భారత్ భూభాగంలోకి చొరబడ్డాడు. అతడిని గుర్తించిన బీఎస్ఎఫ్ జవాన్లు.. వెనక్కు వెళ్లిపోవాలని హెచ్చరించారు. అయినా ఆ యువకుడు ముందుకు రావడానికి ప్రయత్నించగా.. దళాలు కాల్పులు జరిపాయి. దీంతో అతడు మరణించాడు.
కాగా గత నెల (అక్టోబర్) రెండో తేదీన ఇదే తరహా ఘటన చోటు చేసుకుంది. పంజాబ్‌లోని తరన్ తారన్ జిల్లాలో సరిహద్దు నుంచి భారత్‌లోకి ప్రవేశించేందుకు ముగ్గురు పాకిస్థాన్ వ్యక్తులు ప్రయత్నించారు. తరువాత ఒకరు వెనుతిరగగా, మిగిలిన ఇద్దరూ భారత్ భూభాగం వైపునకు కదిలారు. చొరబాటుదారులను గుర్తించిన బీఎస్ఎఫ్ దళాలు కాల్పులు జరిపి హతమార్చాయి.



గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు 10 వేల అడుగులు నడిస్తే సరిపోతుందా?

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు 10 వేల అడుగులు నడిస్తే సరిపోతుందా? సమాధానం కాదు. సాధారణ గుండెతో పాటు హృదయనాళాలకి సంబంధించిన ఫిట్‌నెస్ నిర్వహించడానికి రోజుకు 10 వేల అడుగులు నడవడం సాయపడుతుంది. ఇది ఆచరణాత్మకంగా ఉంటుంది. గుండె ఆరోగ్యం కోసం కేవలం నడిచే అడుగుల సంఖ్య మీద మాత్రమే ఆధారపడకూడదు. సరైన జీవనశైలి పాటించనివారికి వాకింగ్ మంచి ఆప్షన్. నిశ్చల జీవనశైలి ఉన్నవారు రోజుకు 7 వేల నుంచి 10 వేల అడుగులు నడవడం మంచిది. ఇది సరైన రక్త ప్రసరణకు మద్ధతు ఇస్తుంది. బరువు నిర్వహణకు సాయపడుతుంది. గుండెకి హాని చేసే రక్తపోటును నియంత్రిస్తుంది. జీవక్రియ ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది.



సరిగ్గా నడవడం చాలా ముఖ్యం

సరిగ్గా నడిచినప్పుడే గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యులు అంటున్నారు. శ్వాస, హృదయ స్పందన రేటు వేగంగా ఉండేలా.. శరీరం వెచ్చగా ఉండేలా, మీకు కొంచెం ఊపిరి ఆడనట్లు అనిపించేలా వాకింగ్ చేయాలి. అంటే బ్రిస్క్ వాకింగ్ చేయాలి అని డాక్టర్ చెబుతున్నారు. అందుకే రోజంతా నెమ్మదిగా నడవడం కంటే 30 నిమిషాల చురుకైన నడక (బ్రిస్క్ వాకింగ్) చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది హృదయనాళాల వశ్యతను పెంచుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సాయపడుతుంది. వైద్యుల అభిప్రాయం ప్రకారం, రోజుకు 7,000 నుంచి 8,000 అడుగులు సరైన పద్ధతిలో నడిస్తే గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

10 వేల అడుగుల వాకింగ్ సరిపోదా?

నేటి ప్రస్తుత బిజీ లైఫ్‌స్టైల్‌లో చాలా మందికి రోజులో ఓకేసారి 10 వేల అడుగులు నడవడం చాలా కష్టం. ఎక్కువసేపు కూర్చొని పనిచేయడం , డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్, అధిక ట్రైగ్లిజరైడ్లు లేదా గుండె జబ్బుల కుటుంబ చరిత్ర వంటి పరిస్థితులకు కేవలం 10 వేల అడుగులు నడిస్తే సరిపోదు. ఇలాంటి ఆరోగ్య పరిస్థితులు ఉన్న వారు వ్యాయామ ప్రణాళికల్ని వైద్య మార్గదర్శకత్వంలో అమలు చేయాలి. అంటే డాక్టర్లు చెప్పిన సలహాలు తీసుకోవాలి. వాకింగ్‌తో పాటు సమతుల్య ఆహారం, సరైన నిద్ర, ఒత్తిడిని నిర్వహించడం చాలా ముఖ్యం.

గుండె ఆరోగ్యం కోసం ఏం చేయాలి?

డాక్టర్ నూతన్ ప్రకారం మంచి గుండె ఆరోగ్యం కోసం వారానికి కనీసం 150 నిమిషాలు మితమైన-ఏరోబిక్ కార్యకలాపాలతో పాటు వ్యాయామంలో పాల్గొనడం ముఖ్యం. ఇందులో చురుకైన నడక, సైక్లింగ్ లేదా మెట్లు ఎక్కడం వంటివి ఉండొచ్చు. దీంతో స్ట్రెంత్ ట్రైనింగ్ (బల శిక్షణ), ఫ్లెక్సిబుల్ వ్యాయామాల్ని కూడా లక్ష్యంగా చేసుకోవాలి. రోజుకు 10,000 అడుగులు పూర్తి చేయడం మంచి విషయమే అయినప్పటికీ.. ఇది గుండె రక్షణకు పూర్తి హామీ ఇవ్వదు. నడక ఒక అద్భుతమైన పునాది కానీ సమగ్రమైన, బ్యాలెన్స్‌డ్ లైఫ్‌స్టైల్ గుండె యొక్క దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది.

వాకింగ్‌తో పాటు పాటించాల్సిన ఇతర అలవాట్లు

గుండె ఆరోగ్యం కోసం వాకింగ్‌తో పాటు కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లు కూడా పాటించాల్సి ఉంటుంది.

సమతుల్య ఆహారం: మీరు తినే ఆహారం విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏది పడితే అది తింటే



ఆరోగ్యానికి మంచిది కాదు. ఉప్పు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, తీపి పదార్థాలు, జంక్ ఫుడ్స్, వేయించిన ఆహారాలకు దూరంగా ఉండాలి. సమతుల్య ఆహారం తీసుకోవాలి. ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు, ఫైబర్ ఎక్కువగా ఉండే ఫుడ్స్‌ని భాగం చేసుకోవాలి.

ఒత్తిడి నిర్వహణ: ఈ రోజుల్లో చాలా మంది ఒత్తిడిని అనుభవిస్తున్నారు. ఒత్తిడి తగ్గించుకోవడం కోసం యోగా, ధ్యానం వంటి వాటిని జీవనశైలిలో భాగం చేసుకోవాలి.

చెడు అలవాట్లు మానేయండి: స్మోకింగ్, ఆల్కహాల్ వంటివి గుండె ఆరోగ్యానికి మంచివి కావు. వీటిని మానేయడానికి ప్రయత్నించండి.

సరైన నిద్ర: గుండె ఆరోగ్యానికి ప్రతి రోజూ సరైన నిద్ర కూడా చాలా ముఖ్యం. రోజుకు కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోయేలా ప్లాన్ చేసుకోండి.

బరువు నియంత్రణ: ఊబకాయం లేదా అధిక బరువు గుండె ఆరోగ్యానికి మంచిది కాదు. అధిక బరువు తగ్గించుకుంటే గుండెపై భారాన్ని తగ్గిస్తుంది.

రోగ్యంపై శ్రద్ధ: కొలెస్ట్రాల్, రక్తపోటు, డయాబెటిస్ గుండె ఆరోగ్యానికి మంచి విషయాలు కావు. అందుకే వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. కొలెస్ట్రాల్, బీపీ, రక్తంలో షుగర్ లెవల్స్‌ను పరీక్షించుకోవాలి.

నీరు తాగడం వల్ల మీ చర్మం రంగు మారి మెరుపు వస్తుందా?



నీరు ఎక్కువగా తాగడం వల్ల చర్మం మెరుగుపడుతుందనేది అందరూ నమ్మే విషయం. శరీరానికి నీరు చాలా అవసరం. కానీ కేవలం నీరు తాగడం వల్ల మాత్రమే మొటిమలు, మచ్చలు లేదా చర్మం రంగు మారిపోవు. చర్మం యొక్క ఆరోగ్యం అనేది మన వంశపారంపర్య లక్షణాలు (జన్యువులు), హార్మోన్లు, ఎండ ప్రభావం, తీసుకునే ఆహారం, చర్మ సంరక్షణ పద్ధతులపై ఆధారపడి ఉంటుంది.



హైడ్రేషన్ అంటే నీరు చర్మంపై చూపే ప్రభావం

చర్మం యొక్క తీరు కేవలం నీటిపైనే కాకుండా అనేక ఇతర అంశాలపై కూడా ఆధారపడి ఉంటుంది. నీరు తాగడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. నీరు చర్మం నుంచి మురికి, ధూళిని బయటకు పంపగలదు. కానీ నీరు తాగడం వల్లే మొటిమలు, మచ్చలు, చర్మం రంగు మారిపోవడం జరగదు.

నీరు తాగడం గురించి తెలుసుకోవాల్సిన విషయాలు

ప్లస్ పాయింట్స్: తగినంత నీరు తాగడం వల్ల చర్మానికి రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీంతో, ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది.

అపోహ: నీరు తాగితే మొటిమలు పోతాయని చాలా మంది భావిస్తారు. అయితే, మొటిమలు అనేవి హార్మోన్ల మార్పులు, జిడ్డు, బ్యాక్టీరియా వల్ల వస్తాయి. వీటికి సరైన చికిత్స అవసరం.

కొల్లాజెన్: వయసు పెరిగే కొద్దీ చర్మంలో కొల్లాజెన్ తగ్గి ముడతలు వస్తాయి. నీరు చర్మానికి కావాల్సిన తేమను అందిస్తుంది. అంటే చర్మాన్ని తేమగా ఉంచుతుంది. అయితే, అది కొల్లాజెన్‌ను తిరిగి తయారు చేయలేదు.



చర్మం డీహైడ్రేషన్‌కి గురైందని చెప్పే సంకేతాలు

మీరు రోజుకు ఒక లీటర్ కంటే తక్కువ నీరు తాగినప్పుడు చర్మంపై ప్రతికూల ప్రభావాలు కనిపిస్తాయి. మీ చర్మం డీహైడ్రేషన్‌కి గురైతే కొన్ని లక్షణాలు, సంకేతాల ద్వారా గుర్తించవచ్చు.

చర్మం దురదగా మారడం: తక్కువ నీరు తాగడం వల్ల చర్మం యొక్క బయటి పొర అయిన స్ట్రాటమ్ కార్నియం దెబ్బతింటుంది. స్ట్రాటమ్ కార్నియం తేమను లాక్ చేస్తుంది. దుమ్ము, ధూళి, బ్యాక్టీరియాను దూరంగా ఉంచుతుంది. అందువల్ల, నీరు తక్కువ తాగినప్పుడు అది పెళుసుగా మారి చర్మం దురదగా మారుతుంది.

పొడిబారి పాట్టులా ఊడటం: నీరు తక్కువ తాగడం వల్ల చర్మానికి కావాల్సినంత తేమ అందదు. దీంతో, చర్మం యొక్క బయటి పొర బలహీనపడుతుంది. తేమ లేకపోవడంతో చర్మం పొడిబారుతుంది. దీంతో పాట్టులా ఊడటాన్ని మీరు గమనించవచ్చు.



చర్మం సున్నితంగా మారుతుంది: డీహైడ్రేషన్ వల్ల చర్మం నిస్తేజంగా, అసమానంగా కనిపిస్తుంది. చర్మం చాలా సున్నితంగా మారుతుంది. దీంతో ఎర్రటి మచ్చలు, మంట వంటి అనుభూతిని అనుభవించవచ్చు.

సన్నని గీతలు, ముడతలు కనిపించడం: చర్మంపై ముడతలు, సన్నని గీతలు కనిపిస్తాయి. డీహైడ్రేషన్ వల్ల ముడతలు లేదా మచ్చలు ఏర్పడవు. కానీ నీరు లేకపోవడం వల్ల ఉన్న ముడతలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి.

మెరుగైన చర్మం కోసం ఏం చేయాలి?

కేవలం నీరు తాగితే సరిపోదు. దాంతో పాటు కొన్ని చిట్కాలు కూడా పాటించాలి.

చర్మ సంరక్షణ:

మంచి క్లెన్సర్, మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ వాడటం చాలా అవసరం.

నీరు ఎక్కువగా తాగకూడదు:

శరీరానికి అవసరమైనంత నీరు తాగితే సరిపోతుంది. అతిగా నీరు తాగడం కూడా మంచిది కాదు. ఎక్కువగా నీరు తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సమతుల్యతను దెబ్బతీస్తుంది. శరీర అవసరానికి తగినట్టుగా తాగాలి.

నీరు ఎంత తాగాలి:

ప్రతి రోజూ 2.5 నుంచి మూడు లీటర్ల నీరు తాగితే చర్మం హైడ్రేషన్ గణనీయంగా మెరుగుపడుతుంది. అంటే చర్మం కోసం ఏడు నుంచి ఎనిమిది గ్లాసుల నీరు తాగితే సరిపోతుంది.

చర్మం ఆరోగ్యంలో జీర్ణక్రియ, ఆహారం పాత్ర

మన కడుపు అంటే గట్ హెల్త్ ఆరోగ్యంగా ఉంటేనే చర్మం అందంగా ఉంటుంది. అందుకోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ సూచిస్తున్నారు.

మానేయాల్సిన ఆహారాలు: చక్కెర ఎక్కువగా ఉన్న ఫుడ్స్, ప్రాసెస్ చేసిన ఆహారాలు తగ్గించాలి. వీటి వల్ల మొటిమలు వచ్చే అవకాశం పెరుగుతుంది. షుగరీ డ్రింక్స్, జంక్ ఫుడ్స్ తీసుకోవడం నివారించాలి.

తీసుకోవాల్సిన ఆహారాలు: ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్, జింక్, విటమిన్ ఎ, సి, ఈ వంటి పోషకాలు ఉన్న ఆహారం తీసుకుంటే చర్మం రిపేర్ అవ్వడానికి, కొల్లాజెన్ పెరగడానికి సాయపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

ధర్మన్ రాక అప్పుడేనా!

ఇటీవలే 'జైలర్ 2'తో ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు రజనీకాంత్. ఇప్పుడు 'ధర్మన్'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాని కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రామ్, రాశీ ఖన్నా, నయనతార, శ్రీలీల తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా విడుదల విషయమై చిత్ర బృందం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. దీన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ చివరి వారంలో థియేటర్లలోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. డిసెంబరు 12న రజనీ పుట్టినరోజు సందర్భంగా టీజర్‌తో పాటు విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రం డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి కానుందని టాక్. భారీ యాక్షన్ హంగులతో ముస్తాబవుతున్న ఈ సినిమాలో రజనీ డాక్టర్ పాత్రలో కనిపించనున్నారు. దీనికి అనిరుధ్ సంగీతమందిస్తున్నారు.



జపాన్‌లో 'లెనిన్'

తెలుగు చిత్రాలకు జపాన్‌లో మంచి ఆదరణ దక్కుతోంది. కొద్దిమంది కథానాయకులకు, దర్శకులకూ అక్కడ ప్రత్యేకమైన అభిమానగణం ఉంది. అందుకే తరచూ తెలుగు సినిమాలు అక్కడ విడుదలవుతుంటాయి. డిసెంబరు 11న 'లెనిన్' కూడా జపనీస్ భాషలో విడుదల కాబోతోంది. అఖిల్ అక్కినేని కథానాయకుడిగా... మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈ ఏడాది జులైలో తెలుగులో విడుదలై రూ.వంద కోట్ల వసూళ్లు సొంతం చేసుకుంది. అఖిల్‌కి తిరుగులేని విజయాన్ని అందించింది. మరి జపాన్‌లో ఏ స్థాయిలో ప్రేక్షకుల్ని అలరిస్తుందో చూడాలి. ఇప్పటికే అఖిల్ జపాన్‌కి చేరుకుని అక్కడ విహరిస్తున్నారు.



పనివాళ్ళతో కలిసి భోజనం చేసిన జగపతిబాబు

వెండితెరపై తనదైన నటనతో ప్రేక్షకులను భయపెట్టే విలన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటుడు జగపతిబాబు. ఒకప్పుడు ఫ్యామిలీ హీరోగా అలరించిన ఆయన.. ప్రస్తుతం పవర్‌ఫుల్ విలన్ పాత్రలతో దక్షిణాది సినిమాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. పాత్ర ఏదైనా తనదైన నటనతో అందులో ఒదిగిపోవడం జగపతిబాబు ప్రత్యేకత. అయితే తెరపై ఎంతటి క్రూరమైన పాత్రల్లో కనిపించినా నిజ జీవితంలో మాత్రం ఆయన ఎంతో సరదాగా, ఆత్మీయంగా ఉంటారు. స్టార్ నటుడిగా ఎంత ఎదిగినా సాధారణ వ్యక్తిలా అందరితో కలిసిపోతూ తన నిరాడంబరతను చాటుకుంటుంటారు. తాజాగా ఆయన చేసిన ఓ పని సోషల్ మీడియాలో నెటిజన్ల మనసులు గెలుచుకుంటోంది. సాధారణంగా సెలబ్రిటీలు తమ స్థాయికి తగ్గట్టుగా ప్రత్యేక ఏర్పాట్లతో భోజనం చేయడం చూస్తుంటాం. కానీ జగపతిబాబు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. తన వద్ద పనిచేసే వర్కర్లతో కలిసి ఆయన స్వయంగా భోజనం చేశారు. అంతేకాదు.. వారి కోసం బయట నుంచి ప్రత్యేకంగా రుచికరమైన ఆహారాన్ని తెప్పించారు. మరోవైపు ఆ పనివారు తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న సాధారణ భోజనాన్ని జగపతిబాబు ఎంతో ఇష్టంగా తిన్నారు. వారితో కలిసి కూర్చుని భోజనం చేయడమే కాకుండా సరదాగా మాట్లాడుతూ ఆహ్లాదకరమైన సమయాన్ని గడిపారు. ఈ సందర్భంగా తీసిన దృశ్యాలను ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. దీంతో ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.



మా ఇంట్లో ప్రేమంటే అదే..

సినిమాల్లోని ప్రేమకథల్లో పెళ్లితో శుభం కార్డు పడటం సహజం. నిజ జీవితంలోనూ ప్రేమకు పెళ్లే గమ్యంగా భావిస్తానంటున్నారు బాలీవుడ్ నటి శర్వరి వాఘ్ . సూరజ్ బర్జాత్యా దర్శకత్వంలో తెరకెక్కిన 'యే ప్రేమ్ మోల్ లియా' నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రేమ, పెళ్లిపై శర్వరి తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సినిమాతో తొలిసారి పెళ్లికూతురి పాత్రలో కనిపించనున్న ఆమె.. తెరపై తనను అలా చూసి తల్లి భావోద్వేగానికి గురైన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. "నేను చాలా సంప్రదాయ కుటుంబంలో పెరిగాను. మా ఇంట్లో ప్రేమంటే పెళ్లి. ఒకరిని ప్రేమించినప్పుడు పెళ్లి దిశగా అడుగులు వేయాలి. ప్రేమకు పెళ్లే లక్ష్యం. వ్యక్తిగతంగా నేను కూడా అదే నమ్ముతాను" అని శర్వరి పేర్కొన్నారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో తన అక్క పెళ్లి జరిగిందని శర్వరి తెలిపారు. "ఈ సినిమాలోనే తొలిసారి పెళ్లికూతురిగా నటించాను. షూటింగ్ సమయంలో మా అక్క పెళ్లి జరిగింది. తెరపై నన్ను పెళ్లికూతురిగా చూసి మా అమ్మ చాలా భావోద్వేగానికి గురైంది. అప్పటికే అక్క పెళ్లి చేసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇప్పుడు నన్ను కూడా అలా చూసేసరికి అమ్మకి కన్నీళ్లాగలేదు" అని చెప్పారు. 'యే ప్రేమ్ మోల్ లియా'లో ఆయుష్మాన్ ఖురానాకు జోడీగా శర్వరి నటించారు. అనుపమ్ ఖేర్, సుప్రియా పాఠక్, సీమా పహ్వా, సౌమ్య టాండన్ ఇందులో కీలక పాత్రలు పోషించారు.



'మింట్ క్యాండీలు'.. నాథన్ లైయన్‌పై కొత్త ఆరోపణలు

శాండ్‌పేపర్ గేట్ వివాదంపై క్రికెట్ ఆస్ట్రేలియా బోర్డు స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించిన సమయంలో మరో వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. 2018లో దక్షిణాఫ్రికాతో బాల్ టాంపరింగ్ చేసి దొరికిన ముగ్గురు ఆసీస్ ఆటగాళ్లపై వేటు పడిన సంగతి తెలిసిందే. అదే ఏడాది అంతకుముందు బాల్ టాంపరింగ్‌కు ఆసీస్ ప్రయత్నించిందా? అనే అనుమానాలు మొదలయ్యాయి. ఈసారి ప్రధాన సూత్రధారిగా ఆసీస్ స్టార్ స్పిన్నర్ నాథన్ లైయన్ పేరు వినిపించడం గమనార్హం. యూఏఈ వేదికగా పాకిస్థాన్‌తో 2018లో ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ ఆడింది. ఇది సఫారీ జట్టుతో శాండ్‌పేపర్ గేట్ వివాదం కంటే కాస్త ముందు జరిగిన సిరీస్. బంతికి షైనింగ్ తెప్పించేందుకు మింట్ క్యాండీలను వాడాలని నాథన్ లైయన్ సూచించాడని ఆసీస్ మీడియాలో తాజాగా కథనం వచ్చింది. దీనిపై పూర్తి స్థాయిలో స్పష్టత లేనప్పటికీ.. మరింత ఉమ్మును తెప్పించేందుకు మింట్ క్యాండీలను నమలాలని తన సహచరులకు నాథన్ చెప్పినట్లు అందులో పేర్కొంది. ఇదే విషయాన్ని ఉస్మాన్ ఖవాజా తన తాజా ఆత్మకథలోనూ ప్రస్తావించినట్లు సమాచారం. ఓ సీనియర్ ప్లేయర్ ఎక్కువ సలైవా రాబట్టేందుకు మింట్ క్యాండీలను వాడాలని సూచించాడని.. అతడు దక్షిణాఫ్రికాతో సిరీస్‌లోనూ స్క్వాడ్‌లో ఉన్నట్లు పరోక్షంగా లైయన్‌ను ప్రస్తావించాడు. ఇదే నిజమైతే.. ఇక్కడా కూడా బాల్ టాంపరింగ్ జరిగిందా? లేదా? అనేది నిర్ధరించాల్సి ఉంటుందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.



భారత్‌కు ఆడి నాలుగేళ్లు.. ఇప్పుడు వరల్డ్ రికార్డుతో జయ్‌దేవ్ సంచలనం



జయ్‌దేవ్ ఉనద్కత్.. ఈ పేరు ఎక్కడో విన్నట్టుంది కదా.. చివరిగా టీమ్‌ఇండియా తరపున నాలుగేళ్ల కిందట మ్యాచ్ ఆడాడు. కానీ, దేశవాళీలో మాత్రం ఇప్పటికీ కొనసాగుతోన్న 35 ఏళ్ల జయ్‌దేవ్.. టీ20 క్రికెట్‌లో ప్రపంచ రికార్డు నమోదుచేశాడు. అదీనూ 11వ బ్యాటర్‌గా క్రీజ్‌లోకి వచ్చి విధ్వంసం సృష్టించాడు. ఇక చివరి వికెట్‌కు గొప్ప భాగస్వామ్యం నిర్మించడంలోనూ కీలక పాత్ర పోషించాడు. తన జట్టు ఓడినా.. అతడు సాధించిన రికార్డు మాత్రం చరిత్రలో నిలిచిపోతుంది. పదకొండో బ్యాటర్‌గా క్రీజ్‌లోకి వచ్చి అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన బ్యాటర్‌గా జయ్‌దేవ్ (40 పరుగులు) నిలిచాడు. గతంలో ఈ రికార్డు ఇంగ్లాండ్ బ్యాటర్ డ్యానీ బ్రిగ్స్ (35 పరుగులు) పేరిట ఉంది.

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తమిళనాడుతో సౌరాష్ట్ర తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో సౌరాష్ట్ర తడబడింది. ప్రధాన బ్యాటర్లు విఫలం కావడంతో గెలుపు రేసులో వెనుకబడింది. 16.4 ఓవర్లలో 154 పరుగులకే ఆలౌటైంది. అయితే, ఆ జట్టు సారథి జయ్‌దేవ్ ఉనద్కత్ (40: 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆఖర్లో ఎదురుదాడి చేశాడు. చేతన్ సకారియా (21*)తో కలిసి ఆఖరి వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. కానీ, వీరి పోరాటం కేవలం ఓటమి అంతరం తగ్గించేందుకు మాత్రమే సరిపోయింది.

బుమ్రాకు దక్కని వికెట్



న్యూజిలాండ్, భారత్ జట్ల రెండో టెస్టు మొదటి రోజు ఆట ముగిసింది. బ్యాటింగ్, బౌలింగ్‌కు సరిసమానంగానే పిచ్ సహకరించింది. ఆట ముగిసేసరికి కివీస్ 85 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. క్రీజ్‌లో టామ్ బ్లుండెల్ (53*), గ్లెన్ ఫిలిప్స్ (36*) ఉన్నారు. అంతకుముందు ఓపెనర్, కెప్టెన్ టామ్ లేథమ్ (59) హాఫ్ సెంచరీ సాధించాడు. మరో ఓపెనర్ డేవన్ కాన్వే (31), డారిల్ మిచెల్ (31), హెన్రీ నికోల్స్ (16) కాస్త ఫర్వాలేదనిపించారు. రచిన్ రవీంద్ర (0) డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రాకు ఒక్క వికెట్ పడకపోవడం గమనార్హం. ఆకాశ్ దీప్ 2.. గుర్నూర్ బ్రార్, అన్షుల్ కాంబోజ్, వాషింగ్టన్ సుందర్ తలో వికెట్ తీశారు. భారత చేతికి రెండో కొత్త బంతి వచ్చింది. అనూహ్యం 81వ ఓవర్‌లో రెండు బాల్స్ వేశాక.. టీమ్‌ఇండియా తీసుకోవడం గమనార్హం. ఆకాశ్ దీప్ ఈ ఓవర్‌ను సంధించాడు. ఆ తర్వాత తొలి బంతిని చక్కటి బౌట్స్వింగర్‌గా వేశాడు. ప్రస్తుతం కివీస్ స్కోరు 81 ఓవర్లకు 238/5. క్రీజ్‌లో టామ్ బ్లుండెల్ (49*), ఫిలిప్స్ (32*) ఉన్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నిర్మించారు. తొలి రోజు ఆట ముగిసేందుకు ఇంకాస్త సమయం మాత్రమే ఉంది. అయితే, ఇంకా తొమ్మిది ఓవర్లు ఉన్నాయి.

ఒలింపిక్స్‌కు మా ప్రణాళికలివే...: భారత్



దిల్లీ: 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం ప్రయత్నిస్తున్న భారత్ గురువారం తన ప్రణాళికలను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఫ్యూచర్ హోస్ట్ కమిషన్‌కు వివరించింది. దేశంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగంగా జరుగుతున్న తీరుతో పాటు.. డోపింగ్ నిరోధక చర్యలను ప్రముఖంగా ప్రస్తావించింది. వర్చువల్‌గా జరిగిన ఈ సమావేశంలో క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయా, గుజరాత్ క్రీడల మంత్రి హర్ష్ సంఘవి, క్రీడా మంత్రిత్వ శాఖ కార్యదర్శి హరి రంజన్ రావు, దిగిపోనున్న భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష, ఐవోసీ ప్రతినిధి నీతా అంబానీ, ఐవోఏ అథ్లెట్స్ కమిషన్ హెడ్ పి.వి.సింధు తదితరులు పాల్గొన్నారు. అహ్మదాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణపై భారత బృందం దాదాపుగా 30 నిమిషాల ప్రజంటేషన్‌ను సమర్పించింది. అనంతరం దాదాపుగా 20 నిమిషాల పాటు జరిగిన చర్చలో భారత్ ప్రతిపాదించిన బడ్జెట్, క్రీడా వేదికల నిర్మాణంలో తీసుకోనున్న చర్యలు, డోపింగ్ రహిత క్రీడలు, అథ్లెట్లకు కల్పించే సౌకర్యాలు, ఒలింపిక్స్ ముగిశాక స్టేడియాల నిర్వహణ తదితర అంశాలపై కమిషన్ సభ్యులు ప్రశ్నించినట్లు క్రీడా వర్గాలు తెలిపాయి.

PRINTER, PUBLISHER AND OWNED BY S VENKATESULU,D. NO. : 4/38, MAIN ROAD, SETTUR, ANANTHAPURAMU, ANDHRA PRADESH 515767. Place of Publication # MIG 5, KANDRIKA ROAD, PAYAKAPURAM NEW RAJIV NAGAR, VIJAYAWADA (CITY & POST), VIJAYAWADA., N T R, ANDHRA PRADESH 520015. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press .GOKUL PUBLICATIONS D. NO. : 4/10/19, AMBAKAPALLI ROAD, PULIVENDLA, Y.S.R., ANDHRA PRADESH 516390. Email: ananthajanasakshi2019@gmail.com, Cell: 9533633213, RNI REGD NO :APTEL/26/A8939